


నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com

visit us @ http://epaper.suryaa.com

శనివారం | 13 జూలై 2024 | విజయవాడ

సంపుటి 17 | సంచిక 224

| పేజీలు 10+8 | వెల: రూ. 6.50

Published from Hyderabad, Visakhapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Kadapa, Kurnool, Anantapuram, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bangalore, Mumbai, New Delhi




అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం ఉత్తరాయణం - శిశిర ఋతువు, ఆషాఢమాసం శుద్ధ సప్తమి మ.12.18, హస్త సా.5.30, వర్జ్యం రా.2.20 నుంచి 4.06 వరకు
రాహుకాలం ఉ.9.00 నుంచి 10.30 వరకు దుర్ముహూర్తం ఉ.7.22 నుంచి

## సరికొత్త గరిష్ఠాలకు సూచీలు



- 24,500 ఎగువన నిఫ్టీ
- 622 పాయింట్లు లాభపడ్డ సెన్సెక్స్
- 186 పాయింట్లు పెరిగిన నిఫ్టీ
- 6.68 శాతం పెరిగిన టీసీఎస్ షేరు విలువ

5లో

## జగన్‌పై ఎమ్మెల్యే రఘురామ ఫిర్యాదు



- తనపై హత్యాయత్నం చేయించారని ఆరోపణ
- సీఐడీ మాజీ డీజీ సునీల్ కుమార్‌తో పాటు మరికొందరిపై కేసులు నమోదు
- నాన్ బెయిల్‌బుల్ సెక్షన్ల కింద కేసు చేసిన పోలీసులు
- వారి విజ్ఞతకే వదిలేస్తానంటూ స్పందించిన సునీల్ కుమార్

2లో

## సీఎం కేజ్రీవాల్‌కు తాత్కాలిక బెయిల్




- 5 షరతులు విధించిన కోర్టు
- ఢిల్లీ మద్యం కుంభకోణంలో మనీల్యాండరింగ్ ఆరోపణలపై అరెస్ట్

6లో

### ఇక నుంచి జూన్ 25న
# రాజ్యాంగ హత్య దినం

- కేంద్ర సర్కార్ సంచలన నిర్ణయం
- కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్ కూడా విడుదల
- ఎక్స్ వేదికగా కేంద్ర హోమ్ మంత్రి షా ప్రకటన

కేంద్రంలోని మోదీ సర్కార్ సంచలన నిర్ణయం తీసుకుంది. జూన్ 25ను రాజ్యాంగ హత్య దినంగా ప్రకటించింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్ కూడా విడుదల చేసింది. ఎమర్జెన్సీ సమయంలో అమానవీయ బాధలను భరించిన వారిని స్మరించుకునేందుకు భారత ప్రభుత్వం ఏటా జూన్ 25న రాజ్యాంగ హత్య దినంగా నిర్వహిస్తుందని నోటిఫికేషన్ పేర్కొంది.



*1975 జూన్ 25 అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ దేశంలో ఎమర్జెన్సీని ప్రకటించారు. 1975 జూన్ 25 నుంచి 1977 మార్చి 21 వరకు దాదావు 21 నెలల పాటు దేశంలో ఎమర్జెన్సీ కొనసాగింది.*


వివరాలు-6లో

# గుంతలు పూడ్చండి

- గత ఐదేళ్ల నరకం ఇక ఉండకూడదు
- కొత్త టెక్నాలజీతో రోడ్లు వేయాలని సీఎం చంద్రబాబు ఆదేశాలు
- రాష్ట్రంలో వివిధ రోడ్ల స్థితి గతులపై సిఎం సమీక్ష
- రాష్ట్ర వ్యాప్తంగా 4వేల 151 కిలోమీటర్ల మేర రోడ్లపై గుంతలు సమస్య
- తక్షణమే మరమ్మతులు చేయాల్సిన రోడ్లు మరో 2వేల 936 కిలోమీటర్లు
- పూర్తి వివరాలను సిఎంకి అందించిన అధికారులు

గతంలో ఆంధ్రప్రదేశ్ రోడ్లపై వచ్చినన్ని ట్రోల్స్ అన్ని ఇన్ని కాదు. గుంతల మయమైన రోడ్లు వర్షం కురిస్తే చెరువులను తలపిస్తుండటంపై సోషల్ మీడియాలో విపరీతంగా ట్రోలింగ్ జరిగింది. అయితే, గత ప్రభుత్వం అవేవీ పట్టించుకోలేదు. ఉన్న నిధులు సంక్షేమానికి సరిపోవడం లేదని ప్రభుత్వ పెద్దలు చెప్పుకొచ్చారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన రాయలసీమ ఎమ్మెల్యేని జనం రోడ్లు బాగు చేయించమని కోరితే.. ఆయన ఇచ్చిన సమాధానానికి అవాక్కైపోయారు. ఒక్క నెల పింఛన్లు తీసుకోవడం మానేస్తే ఎంచక్కా రోడ్లు వేయొచ్చని ఎమ్మెల్యే నోటి నుంచి సమాధానం రావడంతో తిరిగి ఏం చెప్పాలో అర్థం కాని పరిస్థితి స్థానికుల్లో నెలకొంది.

వివరాలు-2లో



సూర్య వెబ్‌సైట్

సూర్య ఈ - పేపర్

### వైసీపీకి వైఎస్ఆర్‌కు
# సంబంధం లేదు

- వైఎస్ జీవితాంతం కాంగ్రెస్‌లోనే ఉన్నాడని వ్యాఖ్యలు
- ఎపి పిసిసి అధ్యక్షురాలు షర్మిల కీలక వ్యాఖ్యలు

వైఎస్ రాజశేఖర్ రెడ్డి జీవితాంతం కాంగ్రెస్ లోనే ఉన్నారని ఆయనకు వైఎస్ఆర్‌సీపీకి సంబంధం లేదని ఏపీ పీసీసీ చీఫ్ షర్మిల ప్రకటించారు. ఏపీలో కూటమి ప్రభుత్వం నెల రోజుల పాలనపై విజయవాడలో ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్ విగ్రహాలపై ఏపీలో దాడులు చేస్తున్నారని మండిపడ్డారు. వైఎస్ఆర్ ఉమ్మడి ఏపీ నాయకుడి గా రెండు సార్లు గెలిచారన్నారు. అలాంటి వ్యక్తి విగ్రహాలను టీడీపీ గూండాలు ధ్వంసం చేస్తున్నారని విమర్శించారు. వైసిపి కక్ష పూరిత చర్యలు చేసి ఉండొచ్చు . .మేము కాదనడం లేదు..కానీ వైఎస్ఆర్ ను దానికి బాధ్యుడి నీ చేస్తే ఎలా అని షర్మిల ప్రశ్నించారు. వైఎస్ఆర్‌సీపీకి వైసీపీకి సంబంధం లేదన్నారు.



2లో

## వ్యవసాయ అనుబంధ శాఖలను పటిష్ఠం చేస్తా



- అసెంబ్లీ ఎన్నికల్లో టెక్కలి నుంచి హ్యాట్రిక్ విజయం సాధించిన అచ్చెన్నాయుడు
- ఏపీ వ్యవసాయ శాఖ మంత్రిగా నియామకం
- నేడు పొలం పిలుస్తోంది ఫైలుపై తొలి సంతకం చేసిన అచ్చెన్న

వివరాలు-2లో

### మహిళలకు ఉచిత బస్సు
# ప్రయాణం షురూ

- విశాఖ కేంద్రంగా ఉచిత పథకం ప్రారంభం
- బాధ్యతలు చేపట్టిన అనంతరం పాలనలో ఎన్‌డిఏ స్పీడ్
- ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీలను అమలు వైపు అడుగులు
- ఇప్పటికే పెంచిన పెన్షన్లు, మెగా డీఎస్సీ, ఉచిత ఇసుక వంటి హామీలు అమలు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సంగతి తెలిసిందే. ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎంగా పవన్ కల్యాణ్ బాధ్యతలు చేపట్టిన అనంతరం పాలనపై స్పీడ్ పెంచారు.



3లో

## అంతా ఇంతే!




ఇక ముందు పార్టీతో పాటు తెలంగాణ భవన్‌ను కలిపేసుకుంటారేమో

### ఏపీ మహిళా రైతుకు
# అంతర్జాతీయ అవార్డు



2లో

- కమ్యూనిటీ మేనేజ్డ్ నేచురల్ ఫార్మింగ్ చేస్తోన్నమహిళా రైతు నాగేంద్రమ్మ
- తాను ప్రారంభించిన విభాగానికి అవార్డు దక్కడం ఆనందంగా ఉందని సిఎం ట్వీట్
- మహిళా రైతుకు ఏపీ సిఎం అభినందలు

## ఏపీకి ఐఏఎస్ కృష్ణ తేజ



- ఏపీకి కేరళ కేడర్‌కు చెందిన ఐఏఎస్ అధికారి ఎం. కృష్ణ తేజ
- ఐఏఎస్ కృష్ణ తేజ డిప్యూటేషన్‌కు డీఓపీటీ గ్రీన్ సిగ్నల్
- ఉత్తర్వులు జారీ చేసిన డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ ట్రైనింగ్

వివరాలు-2లో

### తీర ప్రాంత కోత ప్రమాద నివారణపై
# ప్రత్యేక దృష్టి

- తీర ప్రాంత నిర్వహణపై ఎన్.సి.సి.ఆర్. రూపొందించిన ప్రణాళిక విడుదల చేసిన రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్
- తీర ప్రాంత నిర్వహణకు ఎన్.సి.సి.ఆర్., ఏపీసీజెడ్ఎంఏల మధ్య అవగాహన ఒప్పందం

రాష్ట్రానికి 973 కి.మీ.కిపైగా ఉన్న సుదీర్ఘ సముద్ర తీరం ఒక వరం... తీర ప్రాంత సంరక్షణ, నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందని ఉప ముఖ్యమంత్రివర్యులు శ్రీ పవన్ కళ్యాణ్ గారు స్పష్టం చేశారు. రాష్ట్రంలో సముద్రపు కోత అనే ఆందోళన కలిగిస్తోందని, కోత ప్రమాదాన్ని నివారించేదుకు ప్రత్యేక దృాఎష్టిపెడుతున్నామన్నారు. ఇటీవల ఉప్పాడ తీరంలో కోతపై సమీక్షించి నిపుణులతో చర్చించామనీ, రక్షణ చర్యల గురించి అధ్యయనం చేయాలని ఆదేశాలిచ్చామని తెలిపారు.



వివరాలు-2లో



## గరుడ వాహనంపై శ్రీవారి అభయం : ముగిసిన సాక్షాత్కార వైభవోత్సవాలు


తిరుపతి, 2024 జూలై 12: శ్రీనివాసమంగాపురం శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో మూడు రోజుల పాటు జరిగిన సాలకట్ల సాక్షాత్కార వైభవోత్సవాలు శుక్రవారం వైభవంగా ముగిశాయి. చివరి రోజు రాత్రి విశేషమైన గరుడ వాహనంపై స్వామివారు విహరించి కటాక్షించారు. ఉదయం సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి, తోమాలసేవ, కొలువు, పంచాంగ శ్రవణం, సహస్రనామార్చన నిర్వహించారు. అనంతరం ఉదయం 10 నుండి 11 గంటల వరకు కల్యాణ మండపంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఉత్సవర్లకు వేడుకగా స్నపనతిరుమంజనం నిర్వహించారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, పసుపు, చందనం, కొబ్బరినీళ్లతో విశేషంగా అభిషేకం చేశారు. సాయంత్రం 6 గంటలకు ఊంజల్ సేవ జరిగింది.

రాత్రి 7 గంటల నుండి గరుడ వాహనంపై స్వామివారు ఆలయ మాడ వీధుల్లో విహరించి భక్తులకు అభ్యమిచ్చారు.

ఈ కార్యక్రమంలో ఆల్య ప్రత్యేక శ్రేణి డిప్యూటీ ఈవో శ్రీమతి వరలక్ష్మి, ఏఈఓ శ్రీ గోపినాథ్, సూపరింటెండెంట్లు శ్రీ చెంగల్రాయలు, శ్రీ వెంకట స్వామి, టెంపుల్ ఇన్స్పెక్టర్ శ్రీ కిరణ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

# గుంతలు పూడ్చండి

● కొత్త టెక్నాలజీతో రోడ్లు వేయాలని సీఎం చంద్రబాబు ఆదేశాలు ● రాష్ట్రంలో వివిధ రోడ్ల స్థితి గతులపై సిఎం సమీక్ష ● రాష్ట్ర వ్యాప్తంగా 4 వేల 151 కిలోమీటర్ల మేర రోడ్లపై గుంతలు సమస్య ● తక్షణమే మరమ్మతులు చేయాల్సిన రోడ్లు మరో 2 వేల 936 కిలోమీటర్లు ● పూర్తి వివరాలను సిఎంకి అందించిన అధికారులు



అమరావతి... గతంలో ఆంధ్రప్రదేశ్ రోడ్లపై వచ్చినన్ని ట్రోల్స్ అన్నిఇన్ని కాదు. గుంతల మయమైన రోడ్లు వర్షం కురిస్తే చెరువులను తలపిస్తుండటంపై సోషల్ మీడియాలో విపరీతంగా ట్రోలింగ్ జరిగింది. అయితే, గత ప్రభుత్వం అవేవీ పట్టించుకోలేదు. ఉన్న నిధులు సంక్షేమానికి సరిపోవడం లేదని ప్రభుత్వ పెద్దలు చెప్పుకొచ్చారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన రాయలసీమ ఎమ్మెల్యేని జనం రోడ్లు బాగు చేయించమని కోరితే.. ఆయన ఇచ్చిన సమాధానానికి అవాక్కైపోయారు. ఒక్క నెల పింఛన్లు తీసుకోవడం మానేస్తే ఎంచక్కా రోడ్లు వేయొచ్చని ఎమ్మెల్యే నోటి నుంచి సమాధానం రావడంతో తిరిగి ఏం చెప్పాలో అర్థం కాని పరిస్థితి స్థానికుల్లో నెలకొంది. దీనిపై ప్రతిపక్షాలు, మీడియా నుంచి విమర్శలు వెల్లువెత్తాయి.

అయితే, ఇప్పుడు ప్రభుత్వం మారింది. కొత్త ప్రభుత్వం ఏర్పడగానే రాష్ట్రంలో రోడ్ల పరిస్థితిపై దృష్టి పెట్టింది. సంబంధిత శాఖల అధికారులతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమీక్ష నిర్వహించారు. గత ప్రభుత్వం రోడ్ల స్థితిగతులను పట్టించుకోలేదని, ఫలితంగా వాహనదారులు, ప్రజలు ఐదేళ్ల పాటు నరకం చూశారని అధికారులతో సమావేశంలో ప్రస్తావించారు. ఈ పరిస్థితిని మార్చే పనులు మొదలు కావాలని ఆదేశాలిచ్చారు. దెబ్బతిన్న రోడ్లను బాగుచేసే ప్రక్రియ తక్షణమే ప్రారంభించాలన్నారు.



వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయంలో జరిగిన ఈ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి పలు అంశాలను తీసుకొచ్చారు ఆర్ అండ్ బీ అధికారులు.... రాష్ట్రంలోని రోడ్ల దుస్థితి, నిధుల అవసరం, ప్రస్తుతం ఉన్న సమస్యలపై సీఎంకు వివరించారు. నాడు రోడ్ల మరమ్మతుల కోసం కనీస మొత్తంలో కూడా నిధులు ఖర్చు చేయలేదని తెలిపారు. పనులు చేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు కూడా చెల్లించలేదని చెప్పారు. దీంతో కాంట్రాక్టర్లు కూడా నేడు పనులు చేసేందుకు ముందుకు రావడం లేదని వివరించారు. ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా 4వేల 151 కిలోమీటర్ల మేర రోడ్లపై పాత్ హోల్స్ (గుంతలు) సమస్య ఉందని అధికారులు ముఖ్యమంత్రి చంద్రబాబుకు వివరించారు. తక్షణమే మరమ్మతులు చేయాల్సిన రోడ్లు మరో 2వేల 936 కిలోమీటర్లు మేర ఉన్నాయని తెలిపారు. మొత్తంగా రాష్ట్రంలో 7వేల 87 కిలోమీటర్ల మేర ఉన్నాయని... తక్షణమే వాటి పనులు చేపట్టాల్సిన అవసరం ఉందని వెల్లడించారు. ఇందుకోసం కనీసం రూ.300 కోట్ల నిధులు అవసరం అని తెలిపారు. ఈ సందర్భంగా స్పందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గుంతలు పూడ్చే పనులు వెంటనే చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అత్యంవసరంగా బాగు చేయాల్సిన రోడ్లపై దృష్టిపెట్టాలని సూచించారు. వెంటనే టెండర్లు పిలిచి అత్యవసర పనులు చేపట్టాలని ఆదేశించారు.

***సాంకేతిక అంశాలపై చర్చ...***

రోడ్ల మరమ్మతులు, నిర్మాణంలో కొత్త, మెరుగైన సాంకేతికతను వినియోగించే విషయంపై సమీక్షలో చర్చించారు. తిరుపతి ఐఐటీ, ఎస్ఆర్ఎం యూనివర్సిటీలకు చెందిన ప్రొఫెసర్లు, ప్రభుత్వ అధికారులు, నిర్మాణ రంగ నిపుణులు ఈ సమీక్షలో పాల్గొన్నారు. తక్కువ ఖర్చుతో, మన్నిక ఉండేలా రోడ్ల నిర్మాణానికి జరిగిన పరిశోధనల వివరాలను సమీక్షలో సీఎంకు తెలిపారు. సంప్రదాయ పద్ధతిలో కాకుండా పలు రకాల మెటీరియల్స్ ఉపయోగించి రోడ్ల నిర్మాణం చేపడితే కలిగే ప్రయోజనాలపై చర్చించారు. నేల తీరు, ట్రాఫిక్ రద్దీ, వర్షాలను దృష్టిలో పెట్టుకుని రోడ్ల నిర్మాణం చేపట్టాల్సి ఉంటుందన్నారు. వర్షాకాలంలో కూడా రోడ్ల నిర్మాణం, మరమ్మతులు చేపట్టే సాంకేతికపైనా నిపుణులు సాధ్యాసాధ్యాలను వివరించారు.

## ఏపీకి ఐఏఎస్ కృష్ణ తేజ



అమరావతి : ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత.. మరీ ముఖ్యంగా జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఉప ముఖ్యమంత్రి అయిన తర్వాత ఓ ఐఏఎస్ అధికారి పేరు ప్రముఖంగా తెరపైకి వచ్చింది.. ఆయనే కేరళ కేడర్ కు చెందిన ఐఏఎస్ అధికారి ఎం. కృాఎష్ణ తేజ.. ఆయన డిప్యూటేషన్‌పై ఏపీకి వస్తారని.. కీలక బాధ్యతలు తీసుకుంటారనే ప్రచారం సాగింది.. దానికి అనుగుణంగానే ఐఏఎస్ కృాఎష్ణ తేజకు డిప్యూటేషన్‌పై ఏపీకి వెళ్లేందుకు అనుమతి వచ్చేసింది.. ఈ మేరకు డిపార్ట్మెంట్ ఆఫ్ పర్సనల్ ట్రైనింగ్ (ట్రా) ఉత్తర్వులు జారీ చేరసింది.. ఇక, పంచాయతీ రాజ్ శాఖ బాధ్యతలను కృాఎష్ణ తేజకు అప్పగించే అవకాశం ఉందనే చర్చ సాగుతోంది. అయితే, గత నెలలో సచివాలయంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు ఐఏఎస్ కృాఎష్ణతేజ.. ఆ తర్వాత కేరళలోని త్రిసూర్ కలెక్టర్‌గా పనిచేస్తున్న ఆయనను డివ్యుటేషన్‌పై రాష్ట్రానికి రప్పించే ఏర్పాట్లు చేయాలని సీఎం చంద్రబాబును పవన్ కల్యాణ్ కోరడం.. కేంద్ర ప్రభుత్వానికి సీఎం చంద్రబాబు లేఖ రాయడం అన్నీ వెనువెంటనే జరిగిపోయాయి.. మొత్తంగా ఎప్పుడు డీఓపీటీ కూడా గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో.. త్వరలోనే ఏపీలో ఛార్జ్ తీసుకోనున్నారు కృాఎష్ణతేజ.. ఇక, గతంలో కేరళ పర్యాటకాభివృాఎద్ధి సంస్థ ఎండీ, పర్యాటకశాఖ డైరెక్టర్, ఎస్సీ అభివృాఎద్ధిశాఖ డైరెక్టర్, అలప్పుజ జిల్లా కలెక్టర్‌గా సేవలు అందించారు కృాఎష్ణ తేజ.. ఆయన స్వస్థలం.. పల్నాడు జిల్లా చిలకలూరిపేట.. ఇక, ఈ మధ్యే త్రిసూర్ జిల్లా కలెక్టర్‌గా కృాఎష్ణతేజ అందించిన సేవలకు గాను జాతీయ బాలల రక్షణ కమిషన్ ఆయనను పురస్కారానికి ఎంపిక చేసింది. బాలల హక్కుల రక్షణలో త్రిసూర్ జిల్లాను ఆయన దేశంలోనే అగ్రగామిగా నిలిపారు.. 2015 బ్యాచ్ ఐఏఎస్ అధికారి అయిన ఆయన.. వివిధ శాఖల్లో పనిచేశారు.. ఐఏఎస్‌గా బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి ఆయన అద్భుత పనితీరుతో తనదైన ముద్ర వేస్తూ వచ్చారు.. ఇప్పుడు ఏపీలో కీలక బాధ్యతలు నిర్వహించేందుకు సిద్ధం అయ్యారు.

## 'తల్లికి వందనం'పై అవాస్తవ ప్రచారం



అమరావతి : తల్లికి వందనం పథకం సంబంధించిన మార్గదర్శకాలు ప్రభుత్వం ఇంకా ఖరారు చేయలేదని పాఠశాల విద్యా శాఖ కార్యదర్శి కోన శశిధర్ స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వ ఆధార్ నిబంధనలకు సంబంధించిన ఉత్తర్వులు మాత్రమేనని అన్నారు. తల్లికి వందనం పథకానికి సంబంధించి ఇప్పటి వరకూ, ఎటువంటి మార్గదర్శకాలు ఇవ్వలేదని తెలిపారు. సామాజిక మాధ్యమాల్లో చేసే దుష్ప్రచారాన్ని నమ్మవద్దని కోన శశిధర్ కోరారు. ఆధార్ చట్టం 2016 ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం అన్ని శాఖల పథకాల లబ్దిదారులను గుర్తించేందుకు గెజిట్ నోటిఫికేషన్ జారీ చేయాల్సి ఉందని పాఠశాల విద్యా శాఖ కార్యదర్శి కోన శశిధర్ తెలిపారు. అనంతరం ఆధార్ ప్రాధికార సంస్థ నుంచి కావాల్సిన అనుమతులు వస్తాయని అన్నారు. దీనికి అనుగుణంగానే కమిషనర్, పాఠశాల విద్యాశాఖ ప్రతిపాదనలతో ఆధార్ను వినియోగించేలా గెజిట్ పబ్లికేషన్ జారీ అయిందని పేర్కొన్నారు. అయితే ఇది కేవలం కేంద్ర ప్రభుత్వ ఆధార్ నిబంధనలకు అనుగుణంగా తీసుకున్న చర్య మాత్రమే అని వివరిస్తూ ప్రకటన జారీ చేశారు. తల్లికి వందనం పథకం సంబంధించిన మార్గదర్శకాలు ప్రభుత్వం ఇంకా ఖరారు చేయలేదని స్పష్టం చేశారు. తల్లికి వందనం పథకానికి సంబంధించి ఇప్పటివరకూ, ఎటువంటి మార్గదర్శకాలు ఇవ్వలేదని పేర్కొన్నారు. ఇది ఆధార్ నిబంధనలకు సంబంధించిన ఉత్తర్వులు మాత్రమేనని తెలిపారు. సామాజిక మాధ్యమాలలో ఈ జీవోని చూపిస్తూ 'తల్లికి వందనం' పథకం పేరిట జరుగుతున్న ప్రచారం అవాస్తవమని కోన శశిధర్ స్పష్టంచేశారు.

# వైసీపీకి వైఎస్ఆర్‌కు సంబంధం లేదు

● వైఎస్ జీవితాంతం కాంగ్రెస్‌లోనే ఉన్నాడని వ్యాఖ్యలు ● ఎపి పిసిసి అధ్యక్షురాలు షర్మిల కీలక వ్యాఖ్యలు

అమరావతి : వైఎస్ రాజశేఖర్ రెడ్డి జీవితాంతం కాంగ్రెస్ లోనే ఉన్నారని ఆయనకు వైఎస్ఆర్‌సీపీకి సంబంధం లేదని ఏపీ పీసీసీ చీఫ్ షర్మిల ప్రకటించారు. ఏపీలో కూటమి ప్రభుత్వం నెల రోజుల పాలనపై విజయవాడలో ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్ విగ్రహాలపై ఏపీలో దాడులు చేస్తున్నారని మండిపడ్డారు. వైఎస్ఆర్ ఉమ్మడి ఏపీ నాయకుడి గా రెండు సార్లు గెలిచారన్నారు. అలాంటి వ్యక్తి విగ్రహాలను టీడీపీ గూండాలు ధ్వంసం చేస్తున్నారని విమర్శించారు. వైసిపి కక్ష పూరిత చర్యలు చేసి ఉండొచ్చు . .మేము కాదనడం లేదు..కానీ వైఎస్ఆర్ ను దానికి బాధ్యుడి నీ చేస్తే ఎలా అని షర్మిల ప్రశ్నించారు. వైఎస్ఆర్‌సీపీకి వైసీపీకి సంబంధం లేదన్నారు. కాంగ్రెస్‌అంటే యువజన శ్రామిక రైతు పార్టీ ..వైఎస్ రాజశేఖర రెడ్డి పార్టీ కాదు... ఆయన కూ వైసిపి కూ ఎలాంటి సంబంధం లేదని క్లారిటీ ఇచ్చారు. వైఎస్ఆర్ అంటే చాలా మంది వైఎస్ రాజశేఖర్ రెడ్డి అనుకుంటారు.కానీ యువజన, శ్రమిక, రైతు కాంగ్రెస్ పార్టీ. ఈ అంశంపై గతంలో ఈసీకి కూడా ఫిర్యాదులు అందాయి. షార్ట్ కట్‌లో వైఎస్ఆర్ అని పిలుస్తూండటం వల్ల .. తన పార్టీకి ఇబ్బంది అని మరో పార్టీ నేతలు పిటిషన్ వేశారు. దీంతో వైసీపీ నాయకులు తమ లెటర్ ప్యాడ్లపై యువజన శ్రామిక రైతు కాంగ్రెస్ పార్టీ అని రాయడం ప్రారంభించారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డిని తమ పార్టీకి మూల పురుషుడిగా పేర్కొంటూ వైసీపీ నేతలు కార్యక్రమాలు నిర్వహిస్తూ ఉంటారు. ఆయనే వైసీపీని స్థాపించినట్లుగా ప్రచారం చేస్తూంటారు. అయితే వైఎస్ చనిపోయేవరకూ కాంగ్రెస్ పార్టీలో సీఎంగా ఉన్నారు. మొదట్లో జగన్, షర్మిల కలిసే ఉన్నప్పుడు వివాదం రాలేదు కానీ షర్మిల ఇప్పుడు ఏపీ పీసీసీ చీఫ్ గా ఉన్నారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి రాజకీయ వారసత్వం తమదేనని అంటున్నారు. వైఎస్ పూర్తిగా కాంగ్రెస్ పార్టీ వాది అని గుర్తు చేస్తున్నారు. ఇటీవల వైఎస్ 75వ జయంతిని కూడా ఘనంగా నిర్వహించారు. సందర్భం వచ్చినప్పుడల్లా.. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేత అని.. వైసీపీకి సంబంధం లేదని పదే పదే గుర్తు చేస్తూ ఉంటారు. వైఎస్ విగ్రహాలపై మరోసారి దాడి చేస్తే తానే స్వయంగా అలాంటి చోటికి ధర్నా చేస్తానని షర్మిల హెచ్చరించారు. ఇలాంటి కక్ష పూరిత రాజకీయాల వల్లే వైసీపీ భూస్థాపితం అయ్యిందనీ టీడీపీ గుర్తు పెట్టుకోవాలని ప్రెస్‌మీట్‌లో సలహా ఇచ్చారు. చంద్రబాబు ప్రకటించిన సూపర్ 6 లో మహిళలకు ఫ్రీ బస్ వాగ్దానం పై ఇంకా ఉలుకూ పలుకూ లేదు.. ఇది మంచి పథకం కాబట్టే తెలంగాణ కర్ణాటక ల్లో అమలవుతోందన్నారు. తెలంగాణ లో



అధికారం లోకి వచ్చిన నెల లోపే..కర్ణాటక లో మూడో వారం లోపే ఈ పథకాన్ని కాంగ్రెస్ అమలు చేసిందని.. ఈ చిన్న పథకాన్ని అమలు చేయడానికి చంద్రబాబు కు ఇంత టైం ఎందుకు పడుతుందో నాకు అర్థం కావడం లేదన్నారు. తల్లికి వందనం వాగ్దానం అందరి పిల్లలకూ అన్నారు..కానీ జీవో లో మాత్రం ప్రతీ తల్లికీ 15000 అన్నారని.. ప్రతీ తల్లి కే 15000 ఇస్తారా.. ప్రతీ బిడ్డ కూ 15000 ఇస్తారా... చంద్రబాబు క్లారిటీ ఇవ్వాలని కోరారు.

# ఏపీలో తీర ప్రాంత కోత ప్రమాద నివారణపై ప్రత్యేక దృష్టి

● తీర ప్రాంత నిర్వహణపై ఎన్.సి.సి.ఆర్. రూపొందించిన ప్రణాళిక విడుదల చేసిన రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్ ● తీర ప్రాంత నిర్వహణకు ఎన్.సి.సి.ఆర్., ఏపీసీజడ్ఎంఏల మధ్య అవగాహన ఒప్పందం



ఏపీ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : రాష్ట్రానికి 973 కి.మీ.కిపైగా ఉన్న సుదీర్ఘ సముద్ర తీరం ఒక వరం... తీర ప్రాంత సంరక్షణ, నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందని ఉప ముఖ్యమంత్రివర్యులు శ్రీ పవన్ కళ్యాణ్ గారు స్పష్టం చేశారు. రాష్ట్రంలో సముద్రపు కోత అనే ఆందోళన కలిగిస్తోందని, కోత ప్రమాదాన్ని నివారించేదుకు ప్రత్యేక దృాఎష్టిపెడుతున్నామన్నారు. ఇటీవల ఉప్పాడ తీరంలో కోతపై సమీక్షించి నిపుణులతో చర్చించామనీ, రాష్ట్రంలోని తీరం వెంబడి కోత సమస్య ఎక్కడెక్కడ ఉంది, రక్షణ చర్యల గురించి అధ్యయనం చేయాలని ఆదేశాలిచ్చామని తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం మంగళగిరిలోని ఉప ముఖ్యమంత్రి గారు తన నివాసంలో తీర ప్రాంత నిర్వహణ ప్రణాళికను విడుదల చేశారు. నేషనల్ సెంటర్ ఫర్ కోస్టర్ రీసెర్చ్ (ఎన్.సి.సి.ఆర్.) నిపుణులు ఈ ప్రణాళికను రూపొందించారు. ఈ ప్రణాళిక తీర ప్రాంతంలో తీర ప్రాంతాల కోత, కెరటాల శక్తి తగ్గింపుతోపాటు కోత, కెరటాల తీవ్రత నుంచి వచ్చే ప్రమాదాలను తగ్గించేందుకూ ఉపయోగపడుతుందని ఎన్.సి.సి.ఆర్. నిపుణులు తెలిపారు. కొత్త ఓడ రేవులు, ఫిషింగ్ హార్బర్లు లాంటి వాటి కోసం అనువైన ప్రదేశాలు ఎంచుకోవడానికి ఈ ప్రణాళిక దోహదపడుతుందని చెప్పారు.

ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ గారి సమక్షంలో ఎన్.సి.సి.ఆర్., ఆంధ్ర ప్రదేశ్ కోస్టల్ జోన్ మేనేజ్మెంట్ అథారిటీలు అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. ఈ సమావేశంలో పీసీబీ సభ్య కార్యదర్శి శ్రీ బి.శ్రీధర్, అటవీ శాఖ ఉన్నతాధికారులు శ్రీ శరవణన్, డా.పి.వి.చలపతిరావు, ఎన్.సి.సి.ఆర్. శాస్త్రవేత్తలు డా.ఎం.వి.రమణమూర్తి, శ్రీ వి.రామనాథన్ తదితరులు పాల్గొన్నారు.

## ఏపీ మహిళా రైతుకు అంతర్జాతీయ అవార్డు

● కమ్యూనిటీ మేనేజ్డ్ నేచురల్ ఫార్మింగ్ చేస్తోన్నమహిళా రైతు నాగేంద్రమ్మ ● తాను ప్రారంభించిన విభాగానికి అవార్డు దక్కడం ఆనందంగా ఉందని సిఎం ట్వీట్ ● మహిళా రైతుకు ఏపీ సిఎం అభినందలు



అమరావతి : అంతర్జాతీయ స్థాయిలో ఏపీ వ్యవసాయానికి గుర్తింపు లభించింది. అంధ్రప్రదేశ్ కమ్యూనిటీ మేనేజ్డ్ నేచురల్ ఫార్మింగ్‌కు.. గుల్బెంకియన్ ప్రైజ్ ఫర్ హ్యూమానిటీ 2024 అవార్డు వరించింది. దీనిపై ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ మేనేజ్డ్ నేచురల్ ఫార్మింగ్ ప్రతిష్టాత్మకమైన గుల్బెంకియన్ ప్రైజ్ ఫర్ హ్యూమానిటీ 2024ని గెలుచుకోవడం ఆనందంగా ఉందన్నారు చంద్రబాబు. గతంలో తాను ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో 2016లో దీనిని ప్రారంభించినట్లు గుర్తుచేసుకున్నారు. ఏపీసీఎన్ఎఫ్.. జీరో బడ్జెట్ నేచురల్ ఫార్మింగ్ మోడల్‌కు ప్రపంచవ్యాప్త గుర్తింపు దక్కడంపై సంతోషం వ్యక్తం చేశారు. ఏపీసీఎన్ఎఫ్ 2016–19 మధ్యకాలంలో 5 లక్షల ఎకరాలను సేంద్రీయ వ్యవసాయ భూములుగా మార్చిందన్న చంద్రబాబు.. ఏపీసీఎన్ఎఫ్ మోడల్ ద్వారా రైతులకు జీవనోపాధి మెరుగుపడుతుందన్నారు. సేంద్రీయ వ్యవసాయంలో పది లక్షల మంది ఆంధ్రప్రదేశ్ రైతులకు ప్రాతినిధ్యం వహిస్తూ ఏసిపిఎన్ఎఫ్ తరవున అవార్డు అందుకున్న మా రైతు సోదరి నాగేంద్రమ్మను అభినందిస్తున్నానంటూ చంద్రబాబు ట్వీట్ చేశారు. మరోవైపు ఏపీసీఎన్ఎఫ్‌తో పాటుగా ఈజిప్టుకు చెందిన సెకెమ్ స్వచ్ఛందసంస్థ, ఇండో అమెరికన్ సైంటిస్ట్ రతన్‌లాల్‌ను ఈ గుల్బెంకియన్ అవార్డు వరించింది. పోర్చుగల్‌లోని లిస్బన్‌లో జరిగిన కార్యక్రమంలో రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ టి.విజయ్‌కుమార్, మహిళా రైతు నాగేంద్రమ్మకు ఈ అవార్డును అందజేశారు. ఈ అవార్డు కింద మిలియన్ యూరోలను ముగ్గురు విజేతలకు సమానంగా పంచారు. మరోవైపు117 దేశాల నుంచి 181 నామినేషన్లు ఈ అవార్డు కోసం రాగా.. ఏపీసీఎన్ఎఫ్ దక్కించుకోవడం విశేషం. సన్నకారు రైతులను సేంద్రీయ వ్యవసాయం వైపు మళ్లించడమే ఈ ఏపీఎస్ఎన్ఎఫ్ ముఖ్య ఉద్దేశం. సేంద్రీయ ఎరువులను ఉపయోగిస్తూ.. నేలసారాన్ని పెంచుతూ సేద్యం చేయడాన్ని ఏపీసీఎన్ఎఫ్ ప్రోత్సహిస్తుంది.

# వ్యవసాయ అనుబంధ శాఖలను పటిష్ఠం చేస్తా

ఏపీ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, పశుసంవర్థక, పాడి అభివృాఎద్ధి మరియు మత్స్య శాఖ మంత్రిగా శ్రీ కింజరావు అచ్చెన్నాయుడు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర సచివాలయం నాల్గో బ్లాక్ లో ఆయనకు కేటాయించిన చాంబరులో వేద పండితుల మంత్రచ్ఛారణలు, ఆశీర్వచనాలు మధ్య పూజా కార్యక్రమం అనంతరం మంత్రిగా ఆయన బాధ్యతలు చేపట్టారు. మంత్రిగా బాధ్యత చేపట్టిన వెంటనే వ్యవసాయ అనుబంధ శాఖలకు సంబంధించిన మొత్తం ఆరు ఫైళ్లపై తొలి శాంతం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర జిడిపిలో 35 శాతం వాటాను సమకూర్చే వ్యవసాయ అనుబంధ శాఖలను గత ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని, ఆ శాఖలకు పూర్వవైభవాన్ని తెచ్చేందుకు శాయశక్తులా కృాఎషి చేస్తానన్నారు. ఈనెల 23 నుంచి రాష్ట్రవ్యాప్తంగా పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఖరీఫ్ లో నాలుగు మాసాలు రబీలో నాలుగు మసాల పాటు పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. రైతులందరికీ వ్యవసాయ యాంత్రికరణ పరికరాలను పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. మత్స్యకారులకు జీవనాధారమైన చాపల చెరువులను గత ప్రభుత్వ లాక్కునేందుకు జీవో నెంబర్ 217 జారీ చేసిందని, ఆ జీఓ ను కూడా రద్దు చేస్తూ నేడు సంతకం చేయడం జరిగిందన్నారు. మత్స్యకారులకు ప్రభుత్వం అందజేసే డీజిల్ సబ్సిడీని గత ప్రభుత్వం నిలిపివేసిందని, ఆ రాయితీని మళ్లీ కొనసాగిస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి రూ.10 కోట్లు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. పాడి పరిశ్రమ అభివృాఎద్ధికి, పశువుల ఆరోగ్య పరిరక్షణకు డీ వార్మింగ్ క్యాంపులను రేపటి నుంచి నిర్వహిస్తున్నామన్నారు. అసలు రాష్ట్రంలో ఎన్ని పశువులు ఉన్నాయని వివరాలు తెలుసుకునేందుకు పశు గణాంక కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాదం, రాష్ట్ర ఆర్థిక శాఖా మంత్రి పయ్యావుల కేశవ్ , రాష్ట్ర మత్యశాఖ కార్యదర్శి బాబు ఎ, రాష్ట్ర పశుసంవర్ధక శాఖ కార్యదర్శి ఎమ్.ఎమ్ నాయక్, వ్యవసాయ శాఖ స్పెషల్ కమిషనర్ హరి కిరణ్ తడితర అదికారులతో పలువురు ప్రజా ప్రతినిధులు మంత్రికి పుష్ప గుచ్చాలు అందజేస్తూ అభినందనలు తెలిపారు.



# జగన్‌పై ఎమ్మెల్యే రఘురామ ఫిర్యాదు

గుంటూరు... ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత వైఎస్ జగన్‌కు బిగ్ షాక్ తగిలింది. మాజీ సీఎం జగన్‌పై నగరంపాలెం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయ్యింది. మాజీ సీఎం వైఎస్ జగన్‌తోపాటు సిఐడీ మాజీ డీజీ సునీల్ కుమార్ పై పోలీసులు కేసు నమోదు చేశారు. వైఎస్ జగన్‌పై విమర్శలు చేయడం..ఆయన బెయిల్ రద్దు చేయాలంటూ కోర్టులో పిటిషన్ వేసిన సమయంలో 2021 మే 14న సీఐడీ పోలీసులు తనను అరెస్ట్ చేశారని ఉండి ఎమ్మెల్యే రఘురామ కృాఎష్ణంరాజు ఆరోపించారు. సీఐడీ తనను అరెస్ట్ చేసిన సమయంలో హత్యాయత్నం చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ క్రమంలో గుంటూరు నగరం పాలెం పోలీసులు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ సందర్భంగా సీఐడీ మాజీ డీజీ సునీల్ కుమార్, వైసీపీ అధినేత వైఎస్ జగన్‌తోపాటు మరికొందరిపై కేసులు నమోదు చేశారు. వీటిలో నాన్ బెయిల్‌బుల్ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. తనను అరెస్ట్ చేసిన సమయంలో కస్టోడియల్ టార్చర్‌కు గురి చేశారని ఉండి ఎమ్మెల్యే రఘు రామకృాఎష్ణంరాజు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈనెల 11న ఈ మెయిల్ ద్వారా ఎమ్మెల్యే రఘురామ కృాఎష్ణంరాజు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

**ఏ-3గా వైఎస్ జగన్**

ఉండి ఎమ్మెల్యే రఘురామ కృాఎష్ణంరాజు తన కస్టోడియల్ టార్చర్‌పై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈనెల 11న గురువారం గుంటూరు నగరంపాలెం పోలీస్ స్టేషన్‌లో ఈమెయిల్ ద్వారా ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే రఘురామ కృాఎష్ణంరాజు ఫిర్యాదుతో కేసులు నమోదు చేశారు. సీఎం జగన్, నాటి సీఐడీ చీఫ్ సునీల్ కుమార్‌లపై హత్యాయత్నం కేసు నమోదు చేశారు. ఏ-1గా సీఐడీ మాజీ చీఫ్ సునీల్ కుమార్, ఏ-2గా ఐపీఎస్ అధికారి సీతారామాంజనేయులు, ఏ -3 గా వైఎస్ జగన్, ఏ-4గా విజయపాల్, ఏ-5 గా డాక్టర్ ప్రభావతిలుగా నమోదు చేశారు. వీరిపై సెక్షన్ 120, 166, 167, 197, 307, 326, 465, 506(34) ప్రకారం కేసు నమోదు చేశారు. వీటిలో నాన్ బెయిలబుల్ సెక్షన్లు కూడా ఉన్నాయి. రఘురామ కృాఎష్ణంరాజుపై హత్యాయత్నం..దాడి కేసులకు సంబంధించి నాన్ బెయిలబుల్ సెక్షన్లు అయిన 307,326 సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు

ఉండి ఎమ్మెల్యే రఘురామ కృాఎష్ణంరాజు ఫిర్యాదుతో సీనియర్ ఐపీఎస్ అధికారి సునీల్ కుమార్, మాజీ సీఎం వైఎస్ జగన్‌తోపాటు మరికొందరిపై గుంటూరు నగరం పాలెం పోలీసులు కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే. ఏ-1గా సీనియర్ ఐపీఎస్ అధికారి పీవీ సునీల్ కుమార్‌ను చేర్చారు. ఈ ఎఫ్ఐఆర్‌పై సునీల్ కుమార్ స్పందించారు. తనపై నమోదైన ఎఫ్ఐఆర్ విషయమై ట్విట్టర్ వేదికగా ఘాటుగా స్పందించారు. 'ఆ కేసు సుప్రీంకోర్టులో మూడేళ్లు నడిచిందని.. సాక్షాత్ సుప్రీంకోర్టు తిరస్కరించిన కేసులో కొత్తగా ఎఫ్ఐఆర్ వేయడాన్ని ఏమనాలో మీ విజ్ఞతకే వదిలేస్తున్నానంటూ ట్వీట్ చేశారు. ఈ ట్వీట్‌పై టీడీపీ, జనసేన పార్టీ శ్రేణులు మండిపడుతున్నారు. ఎఫ్ఐఆర్ నమోదుపై ఈ రకమైన పోస్టులు పెట్టడం ప్రభుత్వాన్ని ధిక్కరించడమే అవుతుందని ధ్వజమెత్తారు. ఇది ఆల్ ఇండియా కండక్ట్ రూల్స్‌లోని రూల్ నెంబరు 7ను ఉల్లంఘించడమేనని టీడీపీ విమర్శలు చేస్తోంది. మరోవైపు ఐపీఎస్ సునీల్ కుమార్ పోస్ట్ పై ప్రభుత్వానికి టీడీపీ ఫిర్యాదు చేసింది. సునీల్ కుమార్ సోషల్ మీడియాలో చేసిన పోస్టును పరిగణలోకి తీసుకుని సస్పెండ్ చేయాలని టీడీపీ ఫిర్యాదులో పేర్కొంది.



# సీఎం ఇంటి వద్ద ఆసక్తికర సంఘటన



● కారు దిగి సామాన్య ప్రజలను పలకరించారు.
● సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

ఏపీ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి: సీఎం చంద్రబాబు నివాసం వద్ద శుక్రవారం ఆసక్తికర సంఘటన చోటుచేసుకుంది. తన నివాసం నుంచి సచివాలయానికి కాన్వాయ్ లో ముఖ్యమంత్రి చంద్రబాబు బయలుదేరారు. సచివాలయానికి వెళుతూ ఒక్కసారిగా చంద్రబాబు కాన్వాయ్ ఆగింది. కాన్వాయ్ లో నుంచి దిగి తన కోసం ఎదురుచూస్తున్న సామాన్య ప్రజలను కలిసిన సీఎం చంద్రబాబు కలిశారు. చంద్రబాబు కారు దిగగానే అక్కడ ఉన్న ప్రజలు ఆశ్చర్యానికి గురయ్యారు.కారు దిగి వారందరినీ ఆప్యాయంగా చంద్రబాబు పలకరించారు. వారి సమస్యలు వినడంతోపాటు వారి నుంచి వినతి పత్రాలు తీసుకొని నేనున్నానని ధైర్యాన్ని నింపి సచివాలయానికి బయలుదేరారు. ద్రబాబు తమను చూసి కారు దిగడంతో సామాన్య ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. గతం లో జగన్ ముఖ్యమంత్రి గా ఉన్న సమయం లో కనీసం బయటకు వచ్చినా పోలీసులు ఇబ్బంది పెట్టారని స్థానికులు కన్నీళ్లు పెట్టుకున్నారు. పరదాలు, బారికేడ్లు లేకుండా ప్రజల్లో మీరు వెళ్లే తీరు చూస్తుంటే ప్రజా నాయకుడు ఎలా ఉండాలో జగన్ నేర్చుకోవాలని స్థానికులు హితువు పలికారు.

# చంద్రబాబు పాలనకు నెలరోజులు

● నూతన ఒరవడితో అనేక మార్పులు
● ఏపీలో మార్పులపై సర్వత్రా చర్చలు
● ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి దిశగా అడుగులు
పడ్డాయంటున్న కూటమి నేతలు

అమరావతి... ఏపీలో టీడీపీ కూటమి నెలరోజుల పాలనను పూర్తి చేసుకుంది. 2024 ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో గ్రాండ్ విక్టరీ కొట్టిన టీడీపీ కూటమి.. అధికార పగ్గాలు చేపట్టింది. ముఖ్యమంత్రిగా టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు జూన్ 12వ తేదీ ప్రమాణ స్వీకారం చేశారు. సీఎంగా ప్రమాణ స్వీకారం చేసి నెలరోజులు పూరైన నేపథ్యంలో నెలరోజుల పాలనలో టీడీపీ కూటమి ప్రభుత్వం ఏం చేసిందనే దానిపై ఆసక్తికర చర్చ నడుస్తోంది. ఈ క్రమంలోనే 30 రోజుల్లో 30 కార్యక్రమాలు చేసిన టీడీపీ కూటమి ప్రభుత్వం అంటూ తెలుగుదేశం పార్టీ ఎక్స్ వేదికగా ట్వీట్ చేసింది. ఈ 30 రోజుల్లో 16,347 టీచర్ పోస్టులతో, మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేశామని టీడీపీ తెలిపింది. అలాగే వృాఎద్ధాప్య, వితంతు పింఛన్లను రూ.4000కు పెంచామని, దివ్యాంగుల పింఛన్ను రెట్టింపు చేసి రూ.6000కి పెంచినట్లు తెలిపింది. ఇక ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చిన విధంగా ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేశామని, ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేస్తున్నామని ట్వీట్ చేసింది. వైసీపీ



పాలనలో మూలనపడిన రాజధాని అమరావతి పనులతో పాటుగా పోలవరం ప్రాజెక్టు నిర్మాణాన్ని పునః ప్రారంభించినట్లు తెలిపింది.

నెలరోజుల పాలనలో భోగాపురం ఎయిర్ పోర్టు పనులను 2026 నాటికి పూర్తిచేయాలని గడువు నిర్దేశించుకున్నామన్న టీడీపీ.. ఏపీకి పరిశ్రమలను తీసుకువచ్చేలా చర్యలు చేపట్టినట్లు తెలిపింది. ఏపీలో రూ.60 వేలకోట్లతో బీపీసీఎల్ రిఫైనరీ ఏర్పాటు దిశగా చర్యలు చేపట్టామని, అమరావతిలో ఎక్స్ఎల్ ఆర్ఐ విద్యాసంస్థను కూడా తీసుకువస్తున్నట్లు టీడీపీ తెలిపింది. ఈ 30 రోజుల్లోనే అమరావతి ఔటర్ రింగ్ రోడ్డుకు కేంద్రం అనుమతి, విజయవాడ తూర్పు బైపాస్కు ఆమోదం లభించినట్లు తెలిపింది. నెలరోజుల పాలనలో ప్రభుత్వ ఉద్యోగులకు ఒకటో తేదీనే జీతాలు అందించామని.. పట్టిసీమను మొదలుపెట్టి కృాఎష్ణా డెల్టాకు నీటిని విడుదల చేశామని, తిరుమలలో ప్రక్షాళన ప్రారంభించామని టీడీపీ ట్వీట్ చేసింది.

48 గంటల్లోగా అత్యాచారం చేసిన నిందితులను అరెస్ట్ చేశామని, ఐదేళ్ల తర్వాత పలాసకు తాగునీరు, పిఠాపురానికి పురుషోత్తపట్నం నీళ్లు అందించామని చెప్పింది. వైజాగ్ మెడ్ టెక్ జోన్లో కంపెనీలో ప్రారంభం, ఇంటర్ విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు, రైతుబజార్లలతో తక్కువ ధరకే బియ్యం, కందిపప్పు, రాజముద్రతో పాసుపుస్తకాలు వంటి పనులు కూడా ఈ నెలరోజుల్లోనే జరిగాయని టీడీపీ గుర్తు చేసింది.

ఇక ఒక్క వాట్సాప్ కాల్తో దివ్యాంగు విద్యార్థులకు మంత్రి నారా లోకేష్ అండగా నిలిచారన్న టీడీపీ.. ఈ నెల రోజులలోనే సీఎం చంద్రబాబు నాయుడు ఢిల్లీలో పర్యటించి ప్రధాని నరేంద్ర మోదీ, మంత్రులతో సమావేశమయ్యారని ట్వీట్ చేసింది. చంద్రబాబు నెలరోజుల పాలనలో తెలంగాణతో విభజన సమస్యలపై ముందడుగు పడిందని, గంజాయి, డ్రగ్స్ కట్టడిపై చర్యలు ప్రారంభమైనట్లు పేర్కొంది. స్కిల్ సెన్సస్ మీద కసరత్తు కూడా ప్రారంభమైందన్న టీడీపీ.. ఇక ఆగస్ట్ 15 నుంచి అన్న క్యాంటీన్లను కూడా ప్రారంభిస్తున్నట్లు చెప్పుకొచ్చింది.

# కలవడానికి వచ్చే వాళ్లు కూరగాయలు తీసుకురండి

● పవన్ కళ్యాణ్ స్పెషల్ రిక్వెస్ట్
● ఖాళీ చేతులతో వస్తే మరీ మంచిదని సూచన

మంగళగిరి : ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మరో వినూత్న నిర్ణయం తీసుకున్నారు. తనను కలిసేందుకు వచ్చే వాళ్లెవరూ పూల బొకేలు, విగ్రహాలు, శాలువలు తీసుకురావద్దని సూచించారు. వాటికి బదులు ప్రజలకు పనికి వచ్చే వస్తువులు తీసుకురావాలని అభ్యర్థించారు. డిప్యూటీ సీఎం అయిన తర్వాత వరస సమీక్షలతో పవన్ కల్యామ్ చాలా బిజీ అయిపోయారు. తన శాఖలపై పట్టు పెంచుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రజలకు మేలు జరిగే నిర్ణయాలు తీసుకోవడంలో వెనుకాడటం లేదు. అదే టైంలో తనను కలిసేందుకు వచ్చిన ముఖ్యులతో కూడా కాసేపు ముచ్చటిస్తున్నారు. ప్రజలతో మమేకమవుతున్నారు. డిప్యూటీసీఎంను కలవడానికి వెళ్తున్నామని అతిథులంతా పూల బొకేలు, శాలువలు, ఇతర వస్తువులు తీసుకెళ్తున్నారు. నెల రోజుల్లోనే ఇవి భారీగా పేరుకుపోయాయి. తన వద్దకు వచ్చే సమయంలో ఏమీ తీసుకురావద్దని గతంలోనే పవన్ చెప్పారు కానీ... ఎవరూ వినిపించుకోవడం లేదు. ఖాళీ చేతులతో ఎలా వస్తామని ప్రశ్నిస్తున్నారు. దీనికి పరిష్కారంగా వినూత్న ప్రయత్నానికి శ్రీకారం చుట్టారు పవన్ కల్యాణ్. తన వద్దకు వచ్చే వాళ్లు ఇకపై పూలబొకేలు, శాలువాలు ఇలాంటివి తీసుకురావద్దని... కూరగాయలు తీసుకురావలని సూచించారు.

ఇప్పుడు తీసుకొచ్చేవి కళ్లకు ఇంపుగా కనిపిస్తాయేమో కానీ... ప్రజల కడుపు నింపవని అన్నారు. అందుకే ప్రజల ఆకలి తీర్చే కూరగాయలు తీసుకురావాలని హితవు పలికారు. దీనికి జనసేన ఎంపీలే స్పూర్తిగా నిలిచారు. పవన్ను కలసేందుకు వెళ్లిన ఎంపీలు బాలశౌరి, ఉదయ్ బొకేలకు బదులు కూరగాయల బుట్టను తీసుకెళ్లారు. దీన్ని చూసి ఆశ్చర్యపోయిన పవన్ ఇలాంటివి తీసుకొస్తే అనాథ శరణాలయాలకు ఇవ్వొచ్చని అన్నారు. ఇకపై అందరూ ఇలాంటి ప్రయత్నం చేయాలన్నారు. వస్తే ఖాళీ చేతులతో రావాలని... తీసుకురాగలిగితే కూరగాయలు మాత్రమే తీసుకురావలన్నారు. అంతకు మించి ఏమీ తీసుకురాకపోయినా ఫర్వాలేదని అన్నారు.



# మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం షురూ



● విశాఖ కేంద్రంగా ఉచిత పథకం ప్రారంభం ● బాధ్యతలు చేపట్టిన అనంతరం పాలనలో ఎన్డిఏ స్పీడ్
● ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీలను అమలు వైపు అడుగులు
● ఇప్పటికే పెంచిన పెన్షన్లు, మెగా డీఎస్సీ, ఉచిత ఇసుక వంటి హామీలు అమలు

అమరావతి... ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సంగతి తెలిసిందే. ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎంగా పవన్ కల్యాణ్ బాధ్యతలు చేపట్టిన అనంతరం పాలనపై స్పీడ్ పెంచారు. అంతేకాదు మరింత దూకుడు సైతం పెంచారు. ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని నిర్ణయించారు. ఇప్పటికే సూపర్ సిక్స్ హామీలపై కూటమి ప్రభుత్వం దృాఎష్టి సారించిన సంగతి తెలిసిందే. ఇప్పటికే కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తోంది. ఇప్పటికే పెంచిన పెన్షన్లు, మెగా డీఎస్సీ, ఉచిత ఇసుక వంటి హామీలు అమలు చేసిన చంద్రబాబు నాయుడు ప్రభుత్వం మరో కీలక హామీ అమలుకు సిద్ధమైంది. మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం హామీ అమలుకు ముహూర్తం ఫిక్స్ చేసినట్లు తెలుస్తోంది. ఆగస్టు 15న విశాఖలో ఈ పథకాన్ని ప్రారంభించాలని సీఎం చంద్రబాబు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది.

సూపర్ సిక్స్ హామీలపై చంద్రబాబు ఫోకస్ : సూపర్ సిక్స్ హామీల అమలుపై సీఎం చంద్రబాబు నాయుడు ప్రత్యేక దృాఎష్టి కనబరుస్తున్నట్లు తెలుస్తోంది. ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీలపై తొలి సంతకం చేసిన చంద్రబాబు నాయుడు చరిత్ర సృాఎష్టించిన సంగతి తెలిసిందే. పెన్షన్లు పెంపు, మెగా డీఎస్సీ,ఉచిత ఇసుక వంటి కీలక హామీలను అమలు చేస్తున్న చంద్రబాబు నాయుడు ప్రభుత్వం తాజాగా మరోక కీలకమైన పథకం అమలుకు శ్రీకారం చుట్టింది. అన్నీ కుదిరితే ఆగష్టు 15న మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకాన్ని ప్రారంభించనున్నట్లు తెలుస్తోంది. మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం హామీ అమలుకు ముహూర్తం ఫిక్స్ చేసినట్లు తెలుస్తోంది. ఆగస్టు 15న విశాఖలో ఈ పథకాన్ని ప్రారంభించాలని సీఎం చంద్రబాబు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇకపోతే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అంశంపై జూలై 16న జరిగే మంత్రివర్గ సమావేశంలో చర్చించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఉచిత బస్సు పథకం అమలుపై తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. మహిళలకు ఏ కేటగిరీ బస్సుల్లో ఈ అవకాశం కల్పించాలనే దాని పైన అధికారులు కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని రూట్లలోనూ ఈ పథకం అమలు దిశగా ప్రభుత్వం అత్యంత వ్యూహాత్మకంగా కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. విశాఖపట్నం కేంద్రంగా ఈ పథకాన్ని అమలు చేయాలని సీఎం చంద్రబాబు నాయుడు, రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంపప్రాద్ రెడ్డి ఇటీవలే ప్రకటించిన సంగతి తెలిసిందే. ఆగష్టు 15న ఎట్టి పరిస్థితుల్లో పథకం ప్రారంభించాలని ప్రభుత్వం భావిస్తుంది.

**వెనక్కి తగ్గని ప్రభుత్వం:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో బస్సుల సంఖ్య తక్కువగా ఉందని అధికారులు రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంపప్రాద్ రెడ్డికి తెలియజేసినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఉన్న బస్సులతో ఈ పథకం అమలు చేస్తే ఇబ్బందులు తప్పవని అధికారులు క్లారిటీ ఇచ్చారని టాక్ వినిపిస్తోంది. కొత్త బస్సులు తీసుకొనే వరకూ పథకం వాయిదా వేయాలనే సూచించినట్లు సమాచారం. అయితే ప్రభుత్వం మాత్రం పథకం అమలుపైనే దృాఎష్టి సారించినట్లు తెలుస్తోంది. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నెల వ్యవధిలోపే ఈ పథకాన్ని ప్రారంభించిందని కాబట్టి ఏపీలో కూడా వీలైనంత త్వరగా ప్రారంభించాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఫ్రీ బస్సుకోసం ఈ డాక్యుమెంట్స్ తప్పనిసరి : ఉచిత బస్సు ప్రయాణం అమలులోకి వస్తే ఖచ్చితంగా ప్రతీ మహిళ ఆధార్ కార్డును తీసుకుని బస్సులో ప్రయాణించాల్సి ఉంటుందని తెలుస్తోంది. ఇప్పటికే అటు కర్ణాటక ఇటు తెలంగాణ రాష్ట్రాలలో ఆధార్ కార్డు ప్రామాణికంగా ఫ్రీ బస్సు సౌకర్యం కల్పిస్తున్న సంగతి తెలిసిందే. ఏపీలో కూడా ఇదే అమలు చేయాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఒకవేళ ఆధార్ కార్డు లేని పక్షంలో ఓటర్ ఐడీ, రేషన్ కార్డు, ఉపాధి హామీ పథకం కార్డులను తీసుకెళ్లొచ్చు అనే ప్రచారం జరుగుతుంది.

# జగన్‌పై కక్షతోనే కేసులు

● రఘురామ ది తప్పుడు ఫిర్యాదు
● గతంలో గుర్తుతెలియదని,
ఇప్పుడు జగన్ పేరు తెచ్చారు
● మాజీ ఏఏజీ పొన్నవోలు సుధాకర్ ఆరోపణ

అమరావతి : సీఐడీ అధికారుల కస్టడీలో తనపై హత్యాయత్నం జరిగిందని రఘురామకృాఎష్ణరాజు చేసిన పిటిషన్ పై పోలీసులు కేసు నమోదు చేయడాన్ని వైసీపీ ఖండించింది. ఆ పార్టీ నేత, మాజీ అడిషనల్ అడ్వకేట్ జనరల్ పొన్నవోలు సుధాకర్ రెడ్డి ప్రెస్ మీట్ పెట్టి పలు విషయాలను వెల్లడించారు. రఘురామకృాఎష్ణరాజు పదకొండో తేదీన ఫిర్యాదు చేస్తే.. పదో తేదీనే లీగల్ ఒపీనియన్ తీసుకున్నట్లుగా చెప్పారని..ఇది ఎలా సాధ్యమనిాయన ప్రశ్నించారు. ఒక ప్లాన్ ప్రకారం తప్పుడు కేసు నమోదు చేయటానికి చేసిన కుట్ర అనటానికి ఇంకేం సాక్ష్యం ఉంటుందని పొన్నవోలు ప్రశ్నించారు.

వైఎస్ జగన్ తో పాటు మరికొందరు అధికారులపై ప్రభుత్వం తప్పుడు కేసులు పెట్టిందన్నారు. ఈ కేసుల వెనుక దురుద్దేశం..రాజకీయ కక్ష మాత్రమే ఉందన్నారు. వ్యక్తిగత ద్వేషంతో రఘురామ కృాఎష్ణరాజు ఫిర్యాదు చేశారన్నారు. సీఐడీ అధికారులు రఘురామను హైదరాబాద్ లో అరెస్టు చేసి ఇరవై నాలుగు గంటల్లో కోర్టు ముందు ఉంచారని అందులో ఎలాంటి తప్పు జరగలేదన్నారు. తనపై మాస్క్ పెట్టుకున్న గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేసినట్టు రఘురామ కృాఎష్ణరాజు మెజిస్ట్రేట్కు ఇచ్చిన వాంగ్మూలంలో స్వయంగా చెప్పారని గుర్తు చేశారు. ఇప్పుడేమో కేసులో జగన్ పేరు రాశాన్నారు. జగన్ పై రఘురామ ద్వేషం పెంచుకుని మూడేళ్ల తర్వాత ఫిర్యాదు చేశారని అధికారులు పీవీ సునీల్, సీతారాంజనేయులు తనపై దాడి చేస్తే అప్పట్లోనే కోర్టులో ఎందుకు చెప్పలేదని పొన్నవోలు ప్రశ్నించారు. అప్పట్లోనే కోర్టు రఘురామను వైద్య పరీక్షలకు పంపిందని.

గాయాలేమీ లేవని వైద్యులు నివేదిక ఇచ్చారన్నారు. ఒక కేసులో 77 రోజుల తర్వాత ఇచ్చిన సాక్ష్యాన్నే చెల్లదని సుప్రీంకోర్టు చెప్పిందని.. మూడేళ్ల తర్వాత రఘురామ కేసులో జగన్, ఇతర అధికారులపై ఎలా కేసు నమోదు చేస్తారని పొన్నవోలు నిలదీశారు. ఇబ్బందులు పెట్టాలన్న కక్షతోనే తప్పుడు కేసు పెట్టారని ఇది వ్యవస్థకు మంచిది కాదన్నారు. అధికారులు ఎవరూ సరిగా ఉద్యోగం చేయలేరని అన్నారు. కాగా రఘురామ తనపై కస్టోడియల్ టార్చర్ విషయంలో సుదీర్ఘంగా పోరాడుతున్నారు. కాల్ రికార్డులు కూడా భద్రపరచాలని హైకోర్టు నుంచి ఆర్డర్స్ తెచ్చుకున్నారు. ఇప్పుడు ప్రభుత్వం మారడంతో గుంటూరు ఎస్పీకి ఫిర్యాదు చేయడంతో లీగల్ ఒపీనియన్ తీసుకుని పోలీసులు కేసు నమోదు చేశారు.

# ప్రతిపక్ష హోదాపై వైసిపికి లేనట్టే?

● జగన్ ఆశలు వదులుకోవాల్సిందేనా? ● టిడిపి ఇప్పటికే ఓ నిర్ణయానికి వచ్చిందా?



అమరావతి.. ఆంధ్రప్రదేశ్లో రాజకీయాలు ఆసక్తికరంగా మారాయి. వైఎస్సార్సీపీని ఓటర్లు చావు దెబ్బకొట్టారు. కేవలం 11 సీట్లు మాత్రమే వైఎస్సార్సీపీకి ఇచ్చారు. దీంతో అసెంబ్లీలో ప్రతిపక్ష హోదా కూడా లేకుండా పోయింది. అయితే తమ పార్టీకి ప్రతిపక్ష హోదా ఇవ్వాలని అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడికి వైఎస్సార్సీపీ అధినేత పులివెందుల ఎమ్మెల్యే లేఖ రాశారు. ఆ లేఖపై తెలుగుదేశం పార్టీ కానీ, స్పీకర్ కానీ స్పందించలేదు.

**హోదా ఇచ్చే అవకాశం లేదు:** నేను అనుకుంటే ప్రతిపక్ష హోదా కూడా దక్కదు. అంటూ గత అసెంబ్లీలో మాజీ సీఎం వైఎస్ జగన్ చాలా సార్లు తెలుగుదేశం పార్టీని హేళన చేశారు. అది వారు మరిచి పోయినట్లు లేదు. అందుకే ప్రతిపక్ష హోదా విషయంలో ఏ విషయం చెప్పలేదు. ప్రతిపక్ష హోదా ఇవ్వాలా? వద్దా? అనే విషయమై తెలుగుదేశం పార్టీలో ఏకపక్ష నిర్ణయం వెలుబుచ్చినట్లు సమాచారం. జగన్ను అలా ఉంచితేనే మంచిదని, జనం ఏ తీర్పు ఇచ్చారో ఈ తీర్పు ప్రకారం ప్రతిపక్ష హోదా లేకుండా ఉంటేనే మంచిదనే అభిప్రాయాన్ని పార్టీ నాయకులంతా వ్యక్తం చేసినట్లు సమాచారం. అందువల్ల వైఎస్సార్సీపీకి ప్రతిపక్ష హోదా దక్కే అవకాశం లేదు.

**రెండో పెద్ద పార్టీని ప్రతిపక్షంగా గుర్తించ వచ్చు..**

అసెంబ్లీలో రెండో పెద్ద పార్టీగా జనసేన ఉంది. అధికార పక్ష కూటమిలో ఉండటం వల్ల ప్రతిపక్షం కిందకు జనసేన వచ్చే అవకాశం లేదు. ప్రభుత్వంలో మంత్రులు, ఉపముఖ్యమంత్రిగా జనసేన వారు ఉన్నారు. కేంద్రంలోని ఎన్డీఏ కూటమిలో సభ్యులుగా ఉన్నారు. రాష్ట్రంలో కూడా కూటమిలో ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. అందువల్ల వైఎస్సార్సీపీ మాత్రమే ప్రతిపక్షంగా చెప్పాల్సి ఉంటుంది. అందుకే వైఎస్ జగన్ తమకు ప్రతిపక్ష హోదా ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు.

**ప్రభుత్వం ఇవ్వాలనుకుంటే...**

ప్రతిపక్ష హోదా వైఎస్సార్సీపీకి రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాలనుకుకంటే ఇవ్వొచ్చు. చట్టంలో ఉన్న నిబంధనల ప్రకారం అధికార పక్షానికి వ్యతిరేకంగా ఉన్న ప్రతిపక్షం ఎన్ని సీట్లు గెలిచినా సీట్ల సంఖ్యతో సంబంధం లేకుండా ఇవ్వొచ్చని, గతంలో చాలా రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర ప్రభుత్వంలోనూ ఈ విధమైన అవకాశాలు కల్పించారని జగన్ తన లేఖలో పేర్కొన్నారు. ప్రతిపక్ష హోదా ఇస్తే కొన్ని సౌకర్యాలు ప్రతిపక్ష పార్టీ నేతకు వస్తాయి. ప్రస్తుతం జగన్కు ప్రతిపక్షనేత హోదా లేనందున ఆ సౌకర్యాలు లేకుండా పోయాయి. రాజ్యాంగంలో ఎక్కడా ప్రతిపక్ష నేత హోదా గురించిన ప్రస్తావన లేకపోయినప్పటికీ చట్టంలో మాత్రం ఉందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. 2014 నుంచి ఏపీలో రాజకీయ పార్టీల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటోంది. తనను జైలు పాలు చేయడంలో చంద్రబాబునాయుడు హస్తం కూడా వుందని పలు సార్లు మాజీ సీఎం వైఎస్ జగన్ చెప్పారు. వైఎస్సార్సీపీ అధికారం చేపట్టిన తరువాత చాలా వరకు కక్షపూరిత రాజకీయాల వైపు చూసింది. చంద్రబాబు, తెలుగుదేశం పార్టీ నాయకులను ఎక్కడికక్కడ కట్టడి చేశారు. చివరకు చంద్రబాబును అరెస్ట్ కూడా చేయాల్సి వచ్చింది. ఈ పరిణామాల నేపథ్యంలో పార్టీల మధ్య, వ్యక్తుల మధ్య సానుకూల సంబంధాలు లేవని చెప్పాలి. కేవలం 11 సీట్లకు పరిమితమైన వైఎస్ జగన్కు ప్రతిపక్ష హోదా ఎందుకు ఇవ్వాలనే ఆలోచనలో టీడీపీ ఉంది. పార్టీ నుంచి కూడా పూర్తి స్థాయిలో వ్యతిరేకత రావడం వల్ల ప్రతిపక్ష హోదా ఇచ్చే అవకాశమే లేదని కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నాయకులు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి కెవివి ప్రసాద్ అన్నారు.

## ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ డైరెక్టర్‌గా

# బాధ్యతలు స్వీకరించిన హిమాన్షు శుక్లా

● 2013 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి హిమాన్షు శుక్లా
● గతంలో డా.బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు
● సమర్థవంతమైన అధికారిగా పేరు తెచ్చుకున్న శుక్లా



ఏపీ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ డైరెక్టర్ గా 2013 బ్యాచ్ కు చెందిన ఐఏఎస్ అధికారి శ్రీ. హిమాన్షు శుక్లా శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. విజయవాడ పండిట్ నెహ్రూ బస్టాండ్ లోని ఎన్టీఆర్ అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్ రెండవ అంతస్తులోని సమాచార పౌర సంబంధాల శాఖ ప్రధాన కార్యాలయంలో మధ్యాహ్నం 3 గం.లకు ఆయన డైరెక్టర్ గా బాధ్యతలు చేపట్టారు. పదవీ బాధ్యతలు స్వీకరించిన అనంతరం హిమాన్షు శుక్లా ఐ అండ్ పీఆర్ అధికారులతో సమావేశమై శాఖాపరమైన వివరాలను అడిగి తెలుసుకున్నారు. సమాచార, పౌర సంబంధాల శాఖకు డైరెక్టర్ గా రావడం ఆనందంగా ఉందన్నారు. అంతకుముందు ఐ అండ్ పీఆర్ (సమాచార పౌర సంబంధాల శాఖ) అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది హిమాన్షు శుక్లాకు ఘనస్వాగతం పలికారు. బాధ్యతల స్వీకరణ అనంతరం పుష్పగుచ్చాలతో అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సమాచార పౌర సంబంధాల శాఖ అడిషనల్ డైరెక్టర్ శ్రీమతి ఎల్.స్వర్ణలత, జాయింట్ డైరెక్టర్లు శ్రీ. పి.కిరణ్ కుమార్, శ్రీమతి. తేళ్ల కస్తూరి, చీఫ్ ఇన్ఫర్మేషన్ ఇంజినీర్ శ్రీ. ఓ.మధుసూధన, రీజినల్ ఇన్ఫర్మేషన్ ఇంజినీర్లు శ్రీ. సి.వి. కృాఎష్ణారెడ్డి, శ్రీ. నాగరాజు, అసిస్టెంట్ డైరెక్టర్లు శ్రీ. ఎం.భాస్కర్ నారాయణ, శ్రీ. జీవీ. ప్రసాద్, శ్రీ. వెంకటరాజు గౌడ్, ఎఫ్ డీసీ జనరల్ మేనేజర్ శ్రీ. శేష సాయి, ఐ అండ్ పీఆర్ ఉద్యోగులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# వైఎస్సార్సీపీ హయాంలో జలజీవన్ మిషన్ అస్తవ్యస్తం

కుళాయి ఉన్న చుక్క నీరందని పరిస్థితి
గత ఐదేళ్ల పాటు తాగునీరంటూ ఊదరగొట్టిన వైఎస్సార్సీపీ పాలకులు
అనంతపురం జిల్లా ఉరవకొండ నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో అందని తాగునీరు
ఎన్నికల్లో లబ్ది పొందడానికి ఏడా పెడా అధికారులతో సమీక్షలకే పరిమితం
సొంత నిధులతో పనులంటూ ఇంటింటా నీళ్లు ఇచ్చేస్తున్నట్లు హడావుడి

ఉరవకొండ : జలజీవన్ మిషన్ పథకం ద్వారా ఇంటింటికి తాగునీటిని అందిస్తామని గత ఐదేళ్లలో వైఎస్సార్సీపీ పాలకులు ప్రచారం చేసుకున్నారు. కానీ ఆచరణలో మాత్రం ఆ పథకాన్ని అమలు చేసింది లేదు. అక్కడక్కడ నామమాత్రంగా పనులు చేసి అవి పూర్తయినట్లు ఆర్భాటంగా చేశారు. ఆ పథకం ద్వారా ఒక్క చుక్క నీటిని అందించిన దాఖలాలు లేవు. అనంతపురం జిల్లా ఉరవకొండ నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో 86 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. మొత్తం 3 లక్షలకు పైగా జనాభా ఉన్నారు. పల్లెల్లో తాగునీటి సదుపాయాన్ని మెరుగుపరిచే పేరుతో జలజీవన్ మిషన్ మొదటి దశలో భాగంగా 50 గ్రామ పంచాయితీల్లో రూ. 8.6 కోట్లతో పనులు చేపట్టారు. అందులో భాగంగా కొత్త పైపులైన్లు, ట్యాంకుల నిర్మాణం, ఇంటింటా కుళాయిల ఏర్పాటు పనులకు శ్రీకారం చుట్టారు. అయితే నేటికీ ఆ పనులు పూర్తి కాలేదు. అక్కడక్కడ కొంత మేర పనులు చేపట్టినా, అవి నామమాత్రంగా మిగిలిపోయాయి. వైఎస్సార్సీపీ ప్రభుత్వం బిల్లులు మంజూరు చేయకపోవడంతో గుత్తేదారులు ఆ పనులను మధ్యలోనే వదిలేశారు. ఇక రెండో దశలో విడపనకల్లు మండలంలో రూ.11.56 కోట్లు, ఉరవకొండ మండలంలో రూ.21.2 కోట్లతో జలజీవన్ మిషన్ పనులు చేపట్టారు. బొమ్మనహాళ్ మండలం బొల్లనగుడ్డం నుంచి విడపనకల్లు మండలం పాల్తూరు వరకు కొత్త పైపులైన్ నిర్మాణంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో తాగునీటి ట్యాంకులు నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఉరవకొండ పట్టణంలో 5 వేల కుళాయిల ఏర్పాటుతో పాటు కొత్త పైపులైన్లు, నీటి నిల్వకు పెద్ద సంపు నిర్మించేలా చర్యలు చేపట్టారు. ఆ పనులు కనీసం 25 శాతం మేర కూడా పూర్తి కాలేదు. కొన్ని కాలనీల్లో ఇంటింటా కుళాయిలు ఏర్పాటు చేసినా, వాటికి నీటిని సరఫరా చేసింది లేదు. ప్రస్తుతం అవి ఆలంకార ప్రాయంగా మారాయి. జలజీవన్ మిషన్ పథకం ద్వారా ఇంటింటికీ తాగునీటిని అందిస్తామని గత ఐదేళ్ల వైఎస్సార్సీపీ పాలకులు ఊదరకొట్టారు. కానీ ఆచరణలో శూన్యం. ఎన్నికల్లో లబ్ది పొందడానికి గత ఐదేళ్లలో స్థానిక వైఎస్సార్సీపీ ముఖ్య నాయకులు ఎలాంటి పదవులు లేకపోయినా జలజీవన్ మిషన్ పనులపై ఆర్డబ్ల్యూఎస్ అధికారులతో సమీక్షలు జరిపారు. పనులను తమ సొంత నిధులతో చేపట్టినట్లు ప్రగల్భాలు పలికారు. నీటి సమస్యను తీర్చేస్తున్నామంటూ ప్రజలను నమ్మించే ప్రయత్నం చేశారు. ఇక ఇంటింటా నీళ్లు ఇచ్చేస్తున్నట్లు హడావుడి చేశారు.అయితే నేటికి చుక్కనీరు అందిన దాఖలాలు లేవు. కాలనీల్లో కుళాయిలు ఉన్న నీరు రాని పరిస్థితి. పైప్లైన్ కోసం ఉన్న రోడ్లను తవ్వి, తరువాత వాటిని పూడ్చలేదు. దీంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది

# జగన్‌పై కేసు నమోదు

టీడీపీ ఎమ్మెల్యే రఘురామకృష్ణ ఫిర్యాదు



ఏపీ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి: మాజీ సీఎం జగన్తో, పాటు సీఐడీ మాజీ డీజీ సునీల్ కుమార్ పై - సెక్షన్ 120, 166, 167, 197, 307, 326, 465, 506(34) ప్రకారం కేసులు నమోదు అయ్యాయి. టీడీపీ ఎమ్మెల్యే రఘురామకృాఎష్ణ రాజు ఫిర్యాదుతో గుంటూరు లోని నగరంపాలెం పీఎస్ లో కేసు నమోదు అయింది. కస్టడీ సమయంలో తనపై హత్యాయత్నం చేశారని ఆయన ఫిర్యాదు చేశారు. తనను అక్రమంగా అరెస్ట్ చేసి వేధించారన్నారు. కేసులో ఏ3గా జగన్ పేరును నమోదు చేసిన పోలీసులు నమోదు చేశారు. ఏ2గా ఐపీఎస్ అధికారి సీతారాంజనేయులు , ఏ4గా విజయపాల్, ఏ5 గా డాక్టర్ ప్రభావతి పేరులు ఉన్నాయి. గురువారం ఈ-మెయిల్ ద్వారా రఘురామకృాఎష్ణరాజు ఫిర్యాదు చేశారు. మాజీ సీఎం జగన్ ఒత్తిడి మేరకే తనను అరెస్ట్ చేశారని రఘురామకృాఎష్ణ ఆరోపించారు.

Repco Home Finance
REPCO హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్
గుంటూరు బ్రాంచ్ : డో.నం. 5-37-217,1వ అంతస్తు, 4/2వ లైన్, బ్రాడీపేట్, ల్యాండ్‌మార్క్: మహమ్మద్ ఖాన్ అండ్ సన్స్ లేన్ ప్రక్కన, గుంటూరు - 522 002

ఇ-వేలం విక్రయ ప్రకటన

రెప్కో హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్‌కు తనఖా పెట్టిన స్థిరాస్తుల విక్రయం. సెక్యూరిటైజేషన్ మరియు ఫైనాన్షియల్ అసెట్స్ రీకన్‌స్ట్రక్షన్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ యాక్ట్ 2002 కింద

**రుణగ్రహీత:** శ్రీ షేక్ కాజా, S/o. శ్రీ షేక్ ఘను, **సహ రుణగ్రహీత:** శ్రీమతి షేక్ షామా, W/o. శ్రీ షేక్ కాజా, మరియు **హామీదారు:** శ్రీ షేక్ బాజీ S/o. శ్రీ షేక్ గన్ను సాహె ఇక్కడ షెడ్యూల్‌లో మరింత పూర్తిగా వివరించిన స్థిరాస్తి తనఖాపై **రెప్కో హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్, గుంటూరు బ్రాంచ్** నుండి డబ్బు తీసుకున్నారు. రుణగ్రహీతలు లోన్ మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో విఫలమైనందున, కంపెనీ **08-08-2023**న సర్ఫేసీ చట్టం, 2002 సెక్షన్ 13(2) ప్రకారం లోన్ ఖాతా ద్వారా నోటీసులో పేర్కొన్న మొత్తాన్ని నం. **1301890001079** ద్వారా **రూ.15,67,372/-** 08-08-2023 నుండి తదుపరి వడ్డీతో కలిపి, పేర్కొన్న నోటీసు తేదీ నుండి 60 రోజులలోపు ఖర్చులు మరియు ఖర్చులతో తిరిగి చెల్లించాల్సిందిగా కోరుతూ డిమాండ్ నోటీసును జారీ చేసింది.

**రుణగ్రహీత, సహ రుణగ్రహీతలు & హామీదారు** పేర్కొన్న డిమాండ్ నోటీసులో పేర్కొన్న విధంగా కంపెనీకి చెల్లించాల్సిన మొత్తాన్ని చెల్లించడంలో విఫలమైనందున, **20.03.2024**న చట్టంలోని సెక్షన్ 13(4) ప్రకారం పొసెషన్ నోటీసును జారీ చేయడం ద్వారా ఇక్కడ షెడ్యూల్‌లో మరింత పూర్తిగా వివరించిన సురక్షిత ఆస్తిని కంపెనీ స్వాధీనం చేసుకుంది.

రుణగ్రహీతలు బకాయిలను పూర్తిగా చెల్లించడంలో విఫలమైనందున, సెక్యూర్డ్ క్రెడిటార్, రెప్కో హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ కింద పేర్కొన్న సురక్షిత ఆస్తిని "పరిస్థితుల్లో ఉన్నట్లే" మరియు షరతు ప్రకారం విక్రయించాలని నిర్ణయించింది. చట్టంలోని సెక్షన్ 13(4) కింద కంపెనీకి బకాయిలు చెల్లించడం కోసం సెక్యూరిటీ వడ్డీ (అమలు) రూల్స్ 2002లోని 8 & 9 నిబంధనలతో చదవబడి **03.07.2024** నాటికి రుణగ్రహీత **రుణ ఖాతా** నం. **1301890001079** ద్వారా బకాయిలు వరుసగా **రూ.15,01,562/-.**

**ఇ-వేలం తేదీ/సమయం : 20-08-2024, సమయం : 11.00 a.m 12.00 p.m**
5 నిమిషాల అపరిమిత ఆటో పొడిగింపుతో

ఇ-టెండర్లు సమర్పించుటకు ఆఖరి తేదీ మరియు సమయం: 19-08-2024 సా॥ 4.00 గం॥లు

**ఆస్తి వివరణ:** గుంటూరు జిల్లా, గుంటూరు ఉప జిల్లా, గుంటూరులోని మునిసిపల్ కార్పొరేషన్ ప్రాంతంలో మహబూబ్ నగర్ మునిసిపల్ పాత వార్డు నెం.3 కొత్త వార్డు నెం.5 బ్లాక్ నెం.12 టి.ఎస్.నెం.711/1 Asst. నెం.13888 డోర్ వద్ద అరండల్‌పేట ప్రాంతంలో నం.7-18- 34/4 విస్తీర్ణంలో 153 చ.గజాల స్థలం మరియు దానిలో ACC రూఫ్ హౌస్ సరిహద్దులుగా ఉంది: తూర్పు : షేక్ జాన్ బి ఆస్తి -47-6 FT, దక్షిణం : ఆస్తి టైటిల్ హోల్డర్ -29-0 FT, పశ్చిమం : షేక్ బేగం మరియు ఇతరుల ఆస్తి -47-6 FT, ఉత్తరం : రోడ్డు -29-0 FT.

**రిజర్వ్ ధర : రూ. రూ. 52,02,000/- (EMD (రిజర్వ్ ధరలో 10%) రూ. 5,20,200/-**
కనీస బిడ్ ఇంక్రిమెంట్ మొత్తం రూ. 50,000/-

ఇ-వేలం ప్రక్రియ కోసం, దయచేసి M/s C1 ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ శ్రీ ప్రభాకరన్-7418281709 ని సంప్రదించండి.

ఆస్తిని తనిఖీ చేయడానికి ఉద్దేశించిన బిడ్డర్లు బ్రాంచ్ హెడ్, రెప్కో హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్, గుంటూరు బ్రాంచ్‌ని అన్ని పని దినాలలో ఉదయం 10 నుండి సాయంత్రం 5 గంటల మధ్య సంప్రదించవచ్చు. సంప్రదింపు నంబర్లు 9391234527 & 08632223830.

తేదీ : 04.07.2024 — అధీకృత అధికారి, రెప్కో హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్.,

ప్రజలు దుకాణాల్లో కొనుగోలు చేసిన ఆహారం, బట్టలు వంటి వస్తువులను తీసుకెళ్లడానికి లక్షలాది ప్లాస్టిక్ సంచులను ఉపయోగిస్తున్నారు. ప్లాస్టిక్ సంచులు పర్యావరణాన్ని దెబ్బతీస్తాయని తెలిసినప్పటికీ వాటిని సాధారణంగా ఉపయోగిస్తున్నాం. పట్టణ ఘన వ్యర్థాల కోసం, ప్లాస్టిక్ సంచులు చెత్త వ్యవస్థలో ప్రధాన వస్తువులుగా మారాయి. ఇది జంతువులు ఉక్కిరిబిక్కిరి చేయడం, కాలుష్యం, కాలువలు, నదులు, ప్రవాహాలు, ప్రకృతి దృశ్యం వికృతీకరణ వంటి అనేక హానికరమైన పర్యావరణ ప్రభావాలకు దారితీసింది. వన్యప్రాణులకు హాని కలుగుతుంది.

19వ శతాబ్దపు మధ్యకాలంలో మొదటి పేపర్ బ్యాగ్ను యునైటెడ్ స్టేట్స్లో ఫ్రాన్సిస్ వోల్ అనే పాఠశాల ఉపాధ్యాయుడు కనిపెట్టారు. తమ విద్యార్థులు తమ పుస్తకాలను

## పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించే కాగితపు సంచీలు

తీసుకువెళ్లడానికి మరింత సౌకర్యవంతమైన మార్గాన్ని సృష్టించాలనుకున్నాడు. ప్లీటెడ్ సైడ్లతో ఫ్లాట్ బాటమ్ పేపర్ బ్యాగ్లను ఉత్పత్తి చేయగల యంత్రం గురించి అతను ఆలోచన చేశాడు. అయితే మరో పేపర్ బ్యాగ్ ఆవిష్కర్త విలియం గూడాలే కాగితాన్ని కత్తిరించే విధంగా అనుకూలమైన యంత్రాన్ని రూపొందించి 12జూలై 1859న తన పేటెంట్ను అందుకున్నాడు. అందువలన ప్రతీ యేడాది జూలై 12 వ తేదీని ప్లాస్టిక్కు బదులుగా పేపర్ బ్యాగ్లను ఉపయోగించడం యొక్క ప్రాముఖ్యతను ప్రోత్సహించడానికి ప్రపంచ పేపర్ బ్యాగ్ దినోత్సవాన్ని జరుపుతున్నారు. దీనిని వరల్డ్ పేపర్ బ్యాగ్ డే, నేషనల్ పేపర్ బ్యాగ్ డే లేదా ఇంటర్నేషనల్ పేపర్ బ్యాగ్ డే అని కూడా పిలుస్తారు. ప్లాస్టిక్ బ్యాగ్ల కంటే పేపర్ బ్యాగ్లను ఉపయోగించడం వల్ల పర్యావరణ ప్రయోజనాల గురించి అవగాహన పెంచడం ఈ దినోత్సవం యొక్క ప్రధాన లక్ష్యం. పేపర్ బ్యాగ్ డే అనేది ప్లాస్టిక్ బ్యాగ్ ప్రత్యామ్నాయంగా కాగితపు సంచుల వినియోగాన్ని జరుపుకోవడానికి అంకితమైన రోజు. పర్యావరణంపై ప్లాస్టిక్ సంచుల దుష్ప్రభావం గురించి ప్రజలకు అవగాహన కల్పించడం, పేపర్ బ్యాగులు ఇతర పర్యావరణ అనుకూల ప్రత్యామ్నాయాలను ప్రోత్సహించడం ఈ దినోత్సవం యొక్క లక్ష్యం.

1999లో శాన్ ఫ్రాన్సిస్కో నగరం సూపర్ మార్కెట్లు మరియు పెద్ద ఫార్మసీలలో ప్లాస్టిక్ బ్యాగ్ల వాడకాన్ని నిషేధించిన మొదటి నగరంగా మారింది. దీని తర్వాత ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఇతర నగరాలు మరియు దేశాలు కాగితపు సంచులపై ఆసక్తిని పెంచాయి. ఇది ప్రపంచ ఉద్యమానికి నాంది పలికింది. ప్లాస్టిక్ బ్యాగ్ వినియోగాన్ని నియంత్రించడంలో ఇతర పట్టణాలు, దేశాలు అనుసరించాయి. విధానాలలో ఈ మార్పు మరింత పర్యా వరణ అనుకూల ప్రత్యామ్నాయంగా పేపర్ బ్యాగ్ల వాడకంలో పునరుజ్జీవనానికి దారి తీసింది. అయితే 20వ శతాబ్దం మధ్యకాలంలో ప్లాస్టిక్ వినియోగం పెరగడంతో ప్లాస్టిక్ సంచులు ఉత్పత్తి చేయడానికి చౌకగాను, మరింత సౌకర్యవంతంగా ఉండడంతో పేపర్ బ్యాగుల వినియోగం తగ్గుముఖం పట్టింది. ప్లాస్టిక్ సంచుల పర్యావరణ ప్రభావం గురించి అవగాహన పెరగడంతో పేపర్ బ్యాగ్ల వాడకం తిరిగి వచ్చింది.

కాగితపు సంచులు పునరుత్పాదక వనరుల నుండి తయారవుతాయి. ఇవి పునర్వినియోగపరచదగినవి. జీవఅధోకరణం చెందుతాయి. ఉపయోగించదగిన జీవితకాలం ముగిసినప్పుడు పర్యావరణానికి హాని కలిగించకుండా ప్లాస్టిక్ వాటి కంటే పేపర్ బ్యాగ్లను రీసైకిల్ చేయవచ్చు మరియు సులభంగా కుళ్లింప చేయవచ్చు. కాగితపు సంచులను ఉపయోగించడం వల్ల కలిగే ప్రధాన ప్రయోజనాల్లో ఇది ఒకటి. ప్లాస్టిక్ వాటి కంటే తక్కువశక్తితో సులభంగా వీటిని రీసైకిల్ చేయవచ్చు. కాగితపు సంచులను ఐదు నుండి ఏడు సార్లు రీసైకిల్ చేయవచ్చు. వాటిని పునర్వినియోగం కోసం ఒక తెలివైన ఎంపికగా మార్చవచ్చు. కాగితపు సంచులలోని ఫైబర్లను విచ్ఛిన్నం చేసి కొత్త కాగితపు ఉత్పత్తులను తయారు చేయడానికి తిరిగి ఉపయోగించవచ్చు. కాగితపు సంచులను తిరిగి ఉపయోగించడం ద్వారా పల్లపు ప్రదేశాలలో వ్యర్థాల పరిమాణాన్ని గణనీయంగా తగ్గించవచ్చు. ఇది రీసైక్లింగ్ ప్రక్రియ నుండి విడుదలయ్యే కాలుష్యాన్ని తగ్గించడంలో సహాయపడుతుంది. పేపర్ బ్యాగ్లు వస్తువులను ప్యాకేజింగ్ చేయడానికి, ఎక్కడికైనా వస్తువులు పదార్థాలు తీసుకెళ్లడానికి అనుకూలంగా ఉంటాయి. పేపర్ బ్యాగ్లు కార్బన్డై ఆక్సైడును నిల్వ చేస్తాయి.


కాగితపు సంచులు జలనిరోధిత కాకపోవడం వలన వర్షం పడేటప్పుడు వీటిని ఉపయోగించలేము. ప్లాస్టిక్ సంచుల కంటే ఖరీదైనది. ప్లాస్టిక్ సంచుల కంటే కాగితం సంచులు ఎక్కువ నిల్వ స్థలాన్ని తీసుకుంటాయి. ప్లాస్టిక్ సంచుల కంటే చాలా బరువుగా ఉంటుంది. కాగితం తయారీ ప్రక్రియ అటవీ నిర్మూలన, నీటి కాలుష్యం, రసాయన వినియోగానికి దారి తీస్తుంది. అలాగే పెద్ద మొత్తంలో వ్యర్థాలను ఉత్పత్తి చేస్తుంది. కాగితాన్ని తయారు చేయడానికి ఎక్కువ చెట్లను నరకవలసి ఉంటుంది. సహజ వనరులు క్షీణించకుండా కాగితం ఉత్పత్తిని కొనసాగించాలంటే పునరుత్పాదక వనరులైన మొక్కలను ఎక్కువ సంఖ్యలో నాటాలి. అలాగే ఆహార పదార్థాల ప్యాకింగ్ సంచుల కొరకు జాతీయ అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా నాణ్యమైన కాగితాన్ని వాడాలి.

**పాఠకులు, విశ్లేషకులు, రచయితలు తమ రచనలు క్రింది చిరునామాకు గానీ సూర్య దినపత్రిక ఎడిటోరియల్ మెయిల్ ఐడికి గాని పంపవలసినదిగా మనవి మెయిల్ : suryaeditpage@gmail.com**

SPR publications, Surya Soudha, Plot.No: 185, M.C.H. NO.258/1/185, siddi vinayaka nagar, Ayyappa Society
Opp: Hi-Tech City, Hyderabad - 500 072.

# ఘోర ఓటమి చవి చూసిన రిషీ సునాక్ ప్రభుత్వం

- తాజా ఫలితాలతో 14 ఏళ్ల కర్జర్వేటివ్ పార్టీ పాలనకు చరమగీతం
- 130 సీట్లకే పరిమితమయిన సునాక్ పార్టీ
- ఇన్ని తక్కువ స్థానాలకు పరిమితం కావటం ఇదే తొలిసారి
- కరోనాని ధీటుగా ఎదుర్కొన్నా తప్పని పరాజయం
- ఆర్థికంగా దేశం పతనావస్థ వైపుకు ఓ కారణం



బి. వెంకటరమణ
94407 40015

ప్రధాన మంత్రి రిషి సునాక్ నేతృత్వంలోని కన్జర్వేటివ్ పార్టీ యూకే పార్లమెంటరీ ఎన్నికల్లో అత్యంత ఘోరమైన ఓటమిని చవిచూసింది. దీంతో బ్రిటన్లో కన్జర్వేటివ్ పార్టీ 2010 నుంచి అధికారంలో కొనసాగుతుండగా.. తాజా ఫలితాలతో 14 ఏళ్ల ప్రభుత్వ పాలనకు ముగింపు పడింది. అయితే 650 సీట్ల హౌస్ ఆఫ్ కామన్స్లో కన్జర్వేటివ్ పార్టీ 130 లోపు స్థానాలకు మాత్రమే పరిమితం అవుతుందని తాజా ట్రెండ్స్ చూపిస్తున్నాయి. అయితే గతంలో కన్జర్వేటివ్ పార్టీ ఇంత తక్కువ స్థానాలకు పడిపోలేదు. చివరగా 2019లో అప్పటి ప్రధాని బోరిస్ జాన్సన్ నేతృత్వంలో ఎన్నికలకు వెళ్లిన కన్జర్వేటివ్ పార్టీ 365 సీట్లు గెలుచుకుంది.

అయితే ఈ ఎన్నికల్లో మాత్రం ఘోర పరాజయం పాలైంది. కోవిడ్ -19 మహమ్మారి సమయంలో ఆర్థిక మంత్రిగా తన నిర్ణయాత్మక చర్యతో ఒకప్పుడు ప్రజాదరణ పొందిన రిషి సునాక్కు ఇది ఘోర పతనం. అయితే అధికార వ్యతిరేకత, ఆర్థిక వ్యవస్థ స్థితి, వలసలు, ఆరోగ్య సంరక్షణ.. వంటివి తాజా ఎన్నికల్లో కన్జర్వేటివ్ పార్టీ అధికారాన్ని కోల్పోవడానికి కొన్ని కీలక కారణాలు ఉన్నాయి. అయితే కన్జర్వేటివ్ పార్టీ అధికారం కోల్పోవడానికి గల ఐదు ప్రధాన కారణాలను ఇప్పుడు తెలుసుకుందాం..

**నెమ్మదించిన ఆర్థిక వృద్ధి..**

రిషి సునాక్ ప్రభుత్వం ఓటమికి అతి ముఖ్యమైన కారణం యూకేలో గత కొన్ని సంవత్సరాలుగా ఎదురవుతున్న సంక్షోభాల పరంపర. ఆర్థిక వ్యవస్థ పరంగా దేశం తక్కువ వృద్ధిని ఎదుర్కొంటోంది. అదే సమయంలో ఇతర ప్రధాన అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థల కంటే యూకే పరిస్థితి చాలా అధ్వాన్నంగా తయారైంది. 2023లో బ్రిటన్ ఆర్థిక వ్యవస్థ 0.1 శాతం మాత్రమే పెరిగింది. అంతేకాకుండా.. ఈ ఏడాది ప్రారంభంలో ఆర్థిక మాంద్యం చుట్టు ముట్టింది.

**పెరుగుతున్న ద్రవ్యోల్బణం..**

బ్రిటన్లో జీవన వ్యయం పెరగడం మరో ప్రధాన సంక్షోభం ఉంది. 2022 అక్టోబరులో ద్రవ్యోల్బణం 40 ఏళ్ల గరిష్ట స్థాయికి చేరుకుంది. అయితే ఇటీవలే ద్రవ్యోల్బణం తగ్గింది. కానీ ఇది యూకేపై తీవ్ర ప్రభావం చూపింది.. అది దేశ పౌరులకు కోపం తెప్పించింది.

**ఆరోగ్య సంరక్షణ..**

బ్రిటన్లో ప్రజాసేవలు కుంటుపడ్డాయి. జాతీయ ఆరోగ్య సేవ (ఎన్హెచ్ఎస్) అనేది.. సార్వత్రికమైన, సరసమైన ఆరోగ్య సంరక్షణకు ప్రామాణికంగా ఉండేంది. ఈ సేవలు చాలా కాలంగా ప్రశంసలు అందుకున్నాయి. అయితే నిధుల సంక్షోభం కారణంగా ఈ వ్యవస్థ దెబ్బతింది. దీంతో సాధారణ పౌరులు సకాలంలో, చవకైన సంరక్షణను పొందడం కష్టంగా మారింది. దీంతో ఎన్హెచ్ఎస్ను సక్రమంగా నిర్వహించనందుకు కన్జర్వేటివ్ పార్టీపై అక్కడి పౌరుల్లో కోపాన్ని పెంచింది.

**వలసల సమస్య..**

బ్రిటన్ను అక్రమ వలసల సమస్య వెంటాడుతుంది. ముఖ్యంగా టర్కీ, ఇరాన్, ఆఫ్ఘనిస్తాన్ నుంచి శరణార్థులు బ్రిటన్ను అతలాకుతలం చేశారు. దీనిని స్మాల్ బోట్ క్రైసిస్ అని పిలుస్తారు. వేలాది మంది శరణార్థులు ఇంగ్లండ్లోకి ప్రవేశించడానికి చిన్న ఓడలలో ఇంగ్లీష్ ఛానల్ను దాటుతుంటారు.

**ప్రభుత్వ వ్యతిరేకత..**

కన్జర్వేటివ్ పార్టీ 14 సంవత్సరాలు అధికారంలో ఉన్నందున.. పాలకపక్షంపై అనేక ఆరోపణలు ఉన్నాయి. ఇందులో పార్టీలో చోటుచేసుకున్న తప్పిదాలు అనేకం.. ఎందుకంటే యూకే గత ఎనిమిది సంవత్సరాలలో నలుగురు ప్రధాన మంత్రులను చూసింది. అయితే చివరిగా ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టిన రిషి సునాక్.. దేశంలోని ప్రధాన సమస్యలను పరిష్కరించడానికి స్పష్టమైన ప్రణాళికతో అనుభవజ్ఞుడైన నిర్వాహకుడిగా తనను తాను నిరూపించుకోవడానికి ప్రయత్నించారు.

అయితే అప్పటికే పెద్ద ఎత్తున నష్టం చోటుచేసుకోవడంతో.. అందులో నుంచి బయటపడానికి అవసరమైన రాజకీయ చరిష్మా రిషి సునాక్కు లోపించినట్లు కనిపిస్తోందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఆరోగ్యం, రక్షణ, ఇమ్మిగ్రేషన్, ఆర్థిక వ్యవస్థ.. ఇలా దాదాపు ప్రతి ప్రధాన సమస్యను ప్రభుత్వం సరిగా నిర్వహించలేదని చాలా మంది ప్రజలు విశ్వసిస్తున్నారు. ఒకప్పుడు అనుభవం, సుస్థిరత, మితవాద పార్టీగా కనిపించిన కన్జర్వేటివ్ పార్టీకి ఈ పరిణామాలు భారీ ఎదురుదెబ్బగా మారాయి.

# ఇంతకీ జీవీఎల్ పరిస్థితి ఏంటి?

- విశాఖ నుంచి ప్రత్యక్ష రాజకీయాలలో దిగాలనుకున్న తీరు
- అందుకు తగ్గట్టుగా విశాఖపట్నంలో ప్రత్యేక ఏర్పాట్లు
- అయినా కూటమి పార్టీల కారణంగా సీటు దక్కని వైనం
- ఇప్పటికే రాజ్యసభ సభ్యత్వ సమయం పూర్తి
- పార్టీలోనే మరో మారు పెద్దల సభకు వెళ్లేందుకు ఎదురుచూపులు




టి.శ్యాంకుమార్
హైదరాబాద్

బిజెపిలో ఆయనో కీలక నేత. తెలుగురాష్ట్రాల్లో ఆయనకంటూ ప్రత్యేక గుర్తింపు ఉంది. మొన్నటి ఎన్నికలలో అదృష్టం కలిసి రాలేదు. ఎంపీగా పోటీ చేద్దామంటే పార్టీపెద్దలు కరుణించలేదు. పార్టీలో, క్యాడర్లో పలుకుబడి ఉన్నా టిడిపి ఆడిన ఆటలో అరటిపండుగా మిగిలిపోయారు. ఆయన రాజ్యసభ ఎంపీ పదవీ కాలం కూడా పూర్తి అయింది. ప్రత్యక్ష ఎన్నికల్లో ఛాన్స్ ఇవ్వలేదు. మరోసారి రాజ్యసభలో అడుగుపెట్టడానికి అవకాశం దక్కుతుందా? ఆయనపై అధిష్టానం కరుణ కురిపిస్తుందా? ఇంతకీ ఎవరా బిజెపి నేత?

గుంటుపల్లి వెంకట నరసింహారావు..జీవీఎల్గా గుర్తింపు పొందిన ఈ బీజేపీ నేత రాజ్యసభ పదవీ కాలం పూర్తయింది. ప్రధాని మోదీకి దగ్గరగా ఉన్న నేతల్లో ఒకరుగా గుర్తింపు పొందిన జీవీఎల్..అమిత్షా పార్టీ జాతీయ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో జాతీయ అధికార ప్రతినిధిగా బాధ్యతలు నిర్వహించారు. దశాబ్ద కాలం పాటు పార్టీకి చేసిన సేవలకి గుర్తింపుగా జీవీఎల్ను 2018లో ఉత్తరప్రదేశ్ నుంచి రాజ్యసభ సభ్యుడిగా పంపించారు బిజెపి పెద్దలు. రాజ్యసభ సభ్యుడిగా%ొ%వివిధ పార్లమెంటరీ కమిటీలలో సభ్యుడిగా కూడా జివిఎల్ సమర్థవంతంగా పనిచేశారనే పేరు తెచ్చుకున్నారు. అదే సమయంలో ఎపిలో పార్టీ బలోపేతం చేసే లక్ష్యంతో జీవీఎల్ నరసింహారావును బీజేపీ హైకమాండ్రాష్ట్రానికి పంపించింది.

గతంలో విశాఖ ఎంపీ సీటును బీజేపీ గెలుచుకుంది. అందువల్ల విశాఖపట్నం పార్లమెంటరీ నియోజకవర్గం పరిధిలో పార్టీ బలోపేతంపై దృష్టి పెట్టాలని కమలం పార్టీ పెద్దలు సూచించడంతో జివిఎల్ విశాఖలోనే ఇల్లు కొనుక్కుని 2020 నుంచి అక్కడే పనిచేస్తున్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేసిన సోము వీర్రాజుతో కలిసి విశాఖలో బిజెపిని పటిష్టం చేయడానికి ప్రయత్నించడంతో పాటు.. పలు కార్యక్రమాలతో నగర ప్రజలకి దగ్గరయ్యే ప్రయత్నం చేశారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ని అమ్మేయాలని కేంద్రంలోని మోదీ ప్రభుత్వం నిర్ణయించిన సందర్భంలో రాజ్యసభలో స్టీల్ప్లాంట్పై ప్రశ్న వేసి అందరి దృష్టినీ ఆకర్షించారు.

స్టీల్ ప్లాంట్ కి ఉక్కు గనులు కేటాయించాలని కూడా కేంద్రానికి లేఖ కూడా రాసారు. దీంతో పాటు విశాఖ రైల్వే జోన్ ఏర్పాటు కోసం రైల్వే శాఖమంత్రిని కలిసి విన్నవించారు. బిజెపిలో ఉంటూనే ఉమ్మడి ఎపి విభజిత సమస్యలపై ప్రత్యేకంగా ఫోకస్ చేశారు. ఇలా పార్టీలో ముఖ్యనాయకుడిగా ఉన్న జివిఎల్ మొన్నటి ఎన్నికలలో విశాఖపట్నం నుంచి ఎంపిగా పోటీ చేయడం ఖాయమని అందరూ భావించారు. అయితే టిడిపి ఆడిన ఆటలో జివిఎల్ అరటిపండుగా మిగిలిపోవాల్సి వచ్చింది. విశాఖ ఎంపి సీటు కోసం నాలుగేళ్లపాటు జివిఎల్ శ్రమించగా చివరి నిమిషంలో ఆ సీటు ఆయనకే కాదు..అసలు బీజేపీ నుంచే జారిపోయింది.

రాష్ట్రంలో బిజెపి, టిడిపి, జనసేన పార్టీలు పొత్తు పెట్టుకోవడంతో%ొ%అందులో భాగంగా విశాఖ సీటు టిడిపికి దక్కింది. గతంలో గెలిచిన సీటును వదులుకుని, అనకాపల్లి సీటును బీజేపీ కేటాయించేవిధంగా రాష్ట్ర పార్టీ అధ్యక్షురాలు పురందేశ్వరి చక్రం తిప్పారు. విశాఖ స్థానం నుంచి పోటీ చేయాలని విశ్వప్రయత్నం చేసిన జివిఎల్ కి సొంత పార్టీలోనే చుక్కెదురైంది. పురందేశ్వరి తన సోదరుడు బాలకృష్ణ చిన్నల్లుడు భరత్ కోసం విశాఖ సీటుని వదులుకున్నట్లుగా విమర్శలు చెలరేగాయి. విశాఖ సీటుపై ఎన్నో ఆశలు పెట్టుకున్న జివిఎల్ కి పొత్తుల కారణంగా చివరికి నిరాశే మిగిలింది. ఇదే సమయంలో రాజ్యసభ సభ్యుడైన జివిఎల్ కి ఇటీవలే పదవీకాలం ముగిసింది.

విశాఖ ఎంపి సీటు దక్కకపోవడంతో మళ్లీ రెండోసారి రాజ్యసభ సభ్యుడిగా అవకాశం కోసం జివిఎల్ నరసింహరావు ఎదురుచూస్తున్నారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్ర కోటాలో 2018 లో రాజ్యసభ సభ్యుడైన జివిఎల్కు ఇప్పుడు అక్కడి నుంచి అవకాశం వస్తుందా అంటే అనుమానమే అంటున్నారు. ఎందుకంటే పార్టీ అధికారంలో ఉన్నా యూపీలో బీజేపీకి ఎంపీ సీట్లు భారీగా తగ్గిపోయాయి. అనేక మంది సీనియర్లు ఓడిపోయారు. అందువల్ల ఇప్పుడు అక్కిడి కీలక నేతకే రాజ్యసభ సీట్లు ఇవ్వాల్సి ఉంటుంది. యూపీలో వచ్చే అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని కూడా బీజేపీ హైకమాండ్నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. అందువల్ల జీవీఎల్కు మరోసారి అవకాశం ఇస్తారా లేదా అనేది చూడాలి.

అయితే ప్రధాని మోదీ, అమిత్ షా, జేపీ నడ్డా లాంటి అగ్రనేతలతో సన్నిహిత సంబంధాలు ఉండటం, యుపిలో కూడా జివిఎల్ కి గట్టి పట్టు ఉండటం వల్ల రెండోసారి రాజ్యసభ సభ్యుడిగా అవకాశం దక్కవచ్చని బిజెపిలో చర్చ జరుగుతోంది. ఒకవేళ రాజ్యసభ సభ్యుడిగా ఛాన్సుకక్కపోతే పార్టీలో కీలక బాధ్యతలు అప్పగిస్తారనే వాదన వినిపిస్తోంది. ఉత్తరాదిన ఒక రాష్ట్రానికి ఇన్ చార్జిగా పంపించే అవకాశాలు కూడా ఉన్నట్లు పార్టీలో గట్టిగా ప్రచారం జరుగుతోంది. మరి సొంత రాష్ట్రంలో ఎంపీ సీటు దక్కని, రాజ్యసభ పదవీ కాలం ముగిసిన జీవీఎల్కు బీజేపీ పెద్దలు ఎలాంటి అవకాశం ఇస్తారో చూడాలి.

# నలుగురూ చిత్తశుద్ధితో ప్రయత్నిస్తే పోయేదేముంది?

- విభజన చట్టంలోని వివిధ అంశాల అమలు ఎప్పటికి?
- హోదా అటకెక్కించిన తీరుతో బిజెపి మడం తిప్పుడు
- మెడలు వంచి తెస్తానన్న జగన్ ఏకంగా మాట తప్పుడు
- గురి చూసి కొట్టిన ఓటర్ల దెబ్బకు 11 సీట్లకే పరిమితం
- పురందేశ్వరి, పవన్, చంద్రబాబులు హోదాకు యత్నించాలి



కైలసాని శివప్రసాద్
9940203999

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ఆశాస్త్రీయంగా విభజించడంతో నవ్యాంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఒకతరం ప్రజలు అన్నివిధాలుగా నష్టపోయే పరిస్థితి ఏర్పడింది. రాష్ట్ర విభజన వలన సంభవించే సంక్షోభం నుంచి నవ్యాంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని గట్టెకించేందుకు రాష్ట్రానికి ప్రత్యేక హోదాకల్పించడంతో పాటూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్విభజన చట్టం-2014 ఏర్పాటు చేసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజాప్రయోజనకరమైన అంశాలను అనేకం ఆ చట్టంలో అప్పటి మన్ మోహన్ సింగ్ ప్రభుత్వం పొందుపరచింది. ఆ విభజన చట్టానికి కేంద్రం లో అప్పటి ప్రధాన ప్రతిపక్ష పార్టీ అయిన బిజెపి తన సంపూర్ణ మద్దతు తెలియచేసింది. అదేసమయంలో 2014 లో నవ్యాంధ్రప్రదేశ్ రాష్ట్రానికి జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి,బిజెపి లు కలిసిపోటీ చేశాయి. ఆ రెండు పార్టీలకు జనసేనాని పవన్ కళ్యాణ్ బేషరతుగా మద్దతు తెలపడం గమనార్హం. ఆసమయంలో రాష్ట్రంలోని పలు ఎన్నికల బహిరంగ సభల్లో నారా చంద్రబాబు నాయుడు, జనసేనాని పవన్ కళ్యాణ్ లతో పాటూ నరేంద్ర మోడీ పాల్గొన్నారు. ఆ సభల్లో రాష్ట్రానికి ప్రత్యేక హోదా కల్పించి డిల్లీని తలదన్నే రాజధాని నిర్మించి రాష్ట్రాన్ని అన్నివిధాలుగా ఆదుకుంటామని నరేంద్ర మోడీ రాష్ట్ర ప్రజలకు హామీ ఇచ్చారు. నరేంద్ర మోడీ, నారా చంద్రబాబు నాయుడుల పాలనా అనుభవాన్ని పరిగణిలోకి తీసుకున్న రాష్ట్ర ప్రజలు వారైతేనే విభజన వలన నష్టపోయిన రాష్ట్రాన్ని అభివృద్ధి పదంలోకి నడిపిస్తారని 2014 ఎన్నికల్లో టిడిపి, బిజెపి మిత్రద్వయానికి పట్టం కట్టారు. అయినా 2014 ఎన్నికల సమయంలో రాష్ట్ర ప్రజలకు నరేంద్రమోడీ ఇచ్చిన హామీలు నీటి మూటలుగా మారాయి. ప్రత్యేక హోదాతో పాటూ ప్రధానమైన విభజన హామీలన్నీ ఆటకెక్కాయి. ఆసమయంలో రాష్ట్రంలో కొన్ని విద్యాసంస్థలు, ఎయిమ్స్ హాస్పిటల్ లను రాష్ట్రంలో మోడీ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అదేవిధంగా పోలవరం జాతీయ ప్రాజెక్టుకు కొద్దిగా నిధులు, వెనుకబడిన జిల్లాలకు 1500 కోట్లరూపాయలు, రాజధాని నిర్మాణానికి 2500 కోట్ల రూపాయలను కేంద్ర ప్రభుత్వం అప్పట్లో రాష్ట్రానికి ఇచ్చింది. అదేసమయంలో దేశంలోని అన్ని రాష్ట్రాలకు ఇచ్చే విధంగా పన్నులలో వాటాను రాష్ట్రానికీ మోడీ ప్రభుత్వం ఇచ్చింది. దీనిని ప్రామాణికంగా తీసుకుని రాష్ట్రానికి నరేంద్ర మోడీ ప్రభుత్వం లక్షల కోట్ల రూపాయలు ఇచ్చినట్లు బిజెపి నేతలు ఈనాటికీ గొప్పగా చెప్పుకుంటున్నారు. అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కేంద్ర ప్రభుత్వం నుండి విభజన హామీలు సాధించడంలో విఫలమయ్యారు. ప్రత్యేక హోదా అంశంలో మరియు జాతీయ ప్రాజెక్టు అయిన పోలవరం ప్రాజెక్టు విషయంలో అప్పట్లో నారా చంద్రబాబు నాయుడు తీసుకున్న నిర్ణయాలు అనేక విమర్శలకు తావిచ్చాయి. అదేసమయంలో 2019 ఎన్నికలు సమీపించాయి. ఆ ఎన్నికల్లో నాకు ఒక్క ఛాన్స్ ఇవ్వండని కోరిన జగన్ మోహన్ రెడ్డిని నమ్మి వై.యస్.ఆర్.సి.పి కి బ్రహ్మరథం పట్టి 151 స్థానాలతో ప్రజలు ఘన విజయం అందించారు. విభజన హామీలు సాధించడంలో ఘోరంగా విఫలమై రాష్ట్ర ప్రజలు తన పై పెట్టుకున్న ఆశలను జగన్ మోహన్ రెడ్డి అడియాశలు చేశారు. ఎన్నికల సమయంలో 25 పార్లమెంటు స్థానాలివ్వండి కేంద్రం మెడలు వంచి ప్రత్యేక హోదాతో పాటూ విభజన హామీలన్నీ సాధిస్తానని పలు బహిరంగ సభల్లో జగన్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రజలు 22 పార్లమెంటు స్థానాలలో జగన్ మోహన్ రెడ్డి పార్టీకి విజయాన్ని కట్టబెట్టారు. అయినా కేంద్రానికి సంపూర్ణ మెజారిటీ వచ్చింది ప్రత్యేక హోదా, విభజన హామీల విషయంలో మనం ఏమీ చేయలేమయంటూ జగన్ అధికారంలోకి వచ్చిన మొదటి వారంలోనే చేతులెత్తేసి అస్త్రసన్యాసం చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలో ఉన్న తెలంగాణా రాష్ట్ర సచివాలయ భవనాలను జగన్ మోహన్ రెడ్డి బేషరతుగా కె.సి.ఆర్ ప్రభుత్వానికి అప్పచెప్పారు. విభజన హామీలు కేంద్రం నుండి సాధించడంలో జగన్ మోహన్ రెడ్డి నిర్లక్ష్య వైఖరి అవలంబించి చారిత్రాత్మక తప్పు చేశారని కచ్చితంగా చెప్పవచ్చు.

వై.యస్.ఆర్.సి.పికి రాజ్యసభలో 11 మంది సభ్యుల బలం ఉంది. యన్.డి.ఏ కు రాజ్యసభలో జగన్ మోహన్ రెడ్డి పార్టీ సభ్యుల అవసరం కచ్చితంగా ఉంది. ఈ కారణంగా విభజన హామీల విషయంలో గతంలో తాను చేసిన తప్పులను దిద్దుకుని ప్రజలకు మేలు చేసే అవకాశం జగన్ కు ఇప్పటికీ ఉంది. జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వ వైఫల్యాల కారణంగా 2024 లో జరిగిన ఎన్నికల్లో తిరిగి టిడిపి, జనసేన, బిజెపి ల యన్.డి.ఏకూటమికి రాష్ట్ర ప్రజలు 164 సీట్లతో అఖండ విజయాన్ని అందించారు. కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వ ఏర్పాటుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో యన్.డి.ఏ సాదించిన 21 పార్లమెంటు స్థానాలు కీలకంగా మారాయి. దీంతో గత పది సంవత్సరాలుగా అపరిష్కృతంగా ఉన్న ప్రత్యేకహోదా హామీ తోపాటూ విభజన చట్టం ప్రకారం రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం పూర్తిచేయవలసిన అంశాలకు పరిష్కారం లభిస్తుందని రాష్ట్ర ప్రజలు చాలా ఆశలు పెట్టుకున్నారు. మళ్ళీ రాష్ట్ర ప్రజల ఆశలు అడియాశలే అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇటీవల డిల్లీ పర్యటన తేటతెల్లంచేసింది. ఇటీవల చంద్రబాబు నాయుడు డిల్లీలోని కేంద్ర పెద్దలను కలుసుకున్న సమయంలో విభజన హామీల గురించి ఏమాత్రం చర్చించకుండా తన ప్రభుత్వ మనుగడ సాఫీగా జరిగేందుకు అవసరమైన నిదులకొరకే అభ్యర్థించినట్లు వార్తలు బలంగా వస్తున్నాయి. గతంలో జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి హోదాలో డిల్లీ వెళ్ళి కేంద్ర పెద్దలను కలిసినప్పుడు ఇదేవిధంగా ప్రవర్తించారు. వాస్తవంగా జగన్ మోహన్ రెడ్డికి, నారా చంద్రబాబు నాయుడుకు ఉన్న వ్యక్తిగత సమస్యల కారణంగా మరియు వారిరువురికి నరేంద్ర మోడీ ప్రభుత్వంతో ఉన్న వ్యక్తిగత అవసరాల దృష్ట్యా విభజన చట్టంలోని అంశాల విషయంలో కేంద్రంపై వారివురు నామ మాత్ర ఒత్తిడి కూడా చేయరనే బలమైన అభిప్రాయం రాష్ట్ర ప్రజలలో ఎప్పటినుంచో ఉంది. అయినా సరైన ప్రత్యామ్నాయ రాజకీయ శక్తి రాష్ట్రంలో లేక వారిరువురినే మార్చి మార్చి ఎన్నుకోవలసిన పరస్తితి రాష్ట్ర ప్రజలకు ఏర్పడింది. విభజన చట్టంలోని 9, 10 షెడ్యూల్లలో పొందుపరచిన ప్రకారం తెలంగాణారాష్ట్రంలోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రావలసిన ఆస్తులపై ఉన్న సమస్యలు పరిష్కరించుకునేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలంగాణా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ఇటీవల హైదరాబాద్ లో సమావేశమయ్యారు. ఆ సమావేశంలో రాష్ట్ర విభజన వలన అన్నివిధాలుగా నష్టపోయిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హక్కులు, డిమాండ్లు ఎక్కడా ప్రస్తావనకు వచ్చినట్లు వార్తలు బయటకు రాలేదు. అన్నిరంగలలో గణనీయంగా అభివృద్ధి చెందిన తెలంగాణా రాష్ట్రం నుంచే బలమైన కొత్త కొత్త డిమాండ్లు తెరమీదకు వచ్చాయి.

నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర ప్రయోజనాల విషయంలో ఇక్కడ కూడా ఎందుకు మెతక వైఖరి అవలంబిస్తున్నారో ఎవ్వరికీ అర్థం కావడం లేదు. సమస్యల పరిష్కారానికి ఇరు రాష్ట్రాలకు చెందిన అధికారుల, మంత్రుల కమిటీలు వేయడం ఆహ్వానించ దగిన విషయమే. కానీ నిజంగా ఈ కమిటీలు సమస్యల పరిష్కారానికి వేశారా? కాలయాపనకు వేశారా? కమిటీల ద్వారా సన్నిహితులైన ఇరువురు ముఖ్యమంత్రులు తెలంగాణా రాష్ట్రంలో తమ పార్టీలు బలపడేందుకు వ్యూహం పన్నారా? అనేది రాజకీయ విశ్లేషకులకు సైతం అంతుచిక్కడం లేదు. ఆమరుసటిరోజు హైదరాబాద్ లోని తెలుగుదేశం పార్టీ ఆఫీసులో నాకు రెండు రాష్ట్రాలు రెండు కళ్ళు అని నారా చంద్రబాబు నాయుడు మళ్ళీ రెండు కళ్ళ సిద్ధాంతం ఎత్తుకోవడం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజల గుండెల్లో రాయి పడినట్లయింది. సంపద సృష్టించి కుక్కలు చింపిన విస్తరివలే తయారయిన రాష్ట్రాన్ని బాగుచేయడం ఇప్పటికిప్పుడు ఎవరివల్లా ఆయ్యే పని కాదు. రాష్ట్రానికి ప్రత్యేక హోదాతో పాటూ విభజన చట్టం ప్రకారం రాష్ట్రానికి రావలసిన ప్రధానమైన అంశాలు కేంద్రం నుండి సాధించడం ద్వారానే రాష్ట్రం బాగుపడుతుందనేది నిర్వివాదాంశం. అడగందే అమ్మ అయినా అన్నం పెట్టదు. అదేవిధంగా కేంద్ర ప్రభుత్వంపై సంప్రదింపుల ద్వారా ఒత్తిడి తెస్తేనే విభజన హామీలకు పరిష్కారం లభిస్తుంది. ఈ పరిస్తితులలో క్లీన్ ఇమేజ్ తో పాటూ గొప్ప చారిత్రక నేపద్యం, కేంద్ర పెద్దల తో సన్నిహిత సంబందాలు ఉన్న జనసేనాని పవన్ కళ్యాణ్ , బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు,పార్లమెంటు సభ్యురాలు దగ్గుబాటి పురందరేశ్వరిలు అయినా కేంద్రంతో సంప్రదించి విభజన హామీల పరిష్కారానికి చొరవ చూపిస్తారని ప్రజలు బావించారు. అయినా వారూ నిమ్మకు నీరెత్తినట్లు ఉండడం దురదృష్టకరం. ప్రస్తుత పరిస్తితులలో నారా చంద్రబాబు నాయుడు,జగన్ మోహన్ రెడ్డి, పవన్ కళ్యాణ్, పురందరేశ్వరిలు ఎవరి శక్తి మేరకు వారు చిత్తశుద్ధితో కేంద్ర పెద్దలపై సంప్రదింపుల ద్వారా ఒత్తిడి తెస్తేనే ప్రత్యేక హోదాతో పాటూ విభజన హామీలకు పరిష్కారం లభించి రాష్ట్రానికి ప్రయోజనం చేకూరుతుందని కచ్చితంగా చెప్పవచ్చు.

## శాంతి స్థాపనలో భారతే కీలకం

రష్యా, ఉక్రైన్ యుద్ధంలో భారత్ కీలకమని ఆస్ట్రియ ఛాన్సెలర్ నెహామర్ వ్యాఖ్యానించాడు. ఆస్ట్రియ ఐరోపా లోనే ఉన్న దేశం. యుద్ధం జరుగ కూడదు అని భారత్ తో కలసి సంయుక్త ప్రకటన చేసింది. ఇక్కడ ఆస్ట్రియ దేశం గురించి టూకిగా తెలుసుకుందాం. ఆస్ట్రియ రాజధాని వియన్నా. ఈ దేశంలో ప్రవహించే నది డాన్యూబ్. జర్మన్ బాష మాట్లాడతారు. మతం క్రైస్తవం. ప్రధాన వృత్తులు పశువుల పెంపకం, ఎగుమతులలో కలప, యంత్రసామాగ్రి, ఇనుము, ఉక్కు ఉత్పత్తులు. దిగుమతులలో ఆహార పదార్థాలు, ముడి పదార్థాలు మొదలైనవి. ఇప్పుడిప్పుడే వేగంగా అభివృద్ధి చెందుతోంది. భారత ప్రధాని మోదీ రష్యా పర్యటన ముగించు కుని, ఆస్ట్రియ దేశం వెళ్లడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ముఖ్యంగా రష్యా, ఉక్రైన్ దేశాల మధ్య కొనసాగుతున్న నేపథ్యంలో ఇరువురు నేతలు తమ అభిప్రాయాలు వెల్లడించారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ "ఎటువంటి జటిల సమస్య అయినా చర్చలతోనే పరిష్కరించుకోవాలని స్పష్టం చేశారు. ఇదే విషయాన్ని ఆస్ట్రియ ఛాన్సెలర్ తో కూడ చెప్పడం గమనార్హం. 1983 తర్వాత అంటే దాదాపు నలభై ఒక్క ఏళ్ళ తరువాత ఆస్ట్రియ వెళ్లడం ఇదే ప్రథమం. మోదీ కి ఆస్ట్రియ లో ఆదేశ విదేశాంగ మంత్రి అలెగ్జాండర్ స్కాలెన్ బర్గ్ స్వాగతం పలికారు. ఇరు దేశాల నడుమ పటిష్టమైన సంబంధాలు ఉండాలని కోరుకున్నారు. ఇరువురు కూడ విశ్వవ్యాప్తంగా నెలకొన్న వివాదాలు చర్చించారు. ఓ సంయుక్త ప్రకటన విడుదలచేస్తూ "యుద్ధం అన్నిటికి ప్రధాన శత్రువు, అభివృద్ధి కుంటు పడుతుంది, పౌరులలో ప్రభుత్వం పట్ల వ్యతిరేక భావం ఏర్పడుతుంది, అంతేకాక యుద్ధంలో అమాయకులు ప్రాణాలు కోల్పోవడం మాకు సమ్మతం కాదు అని "ఇరువురు నేతలు స్పష్టం చేశారు. రష్యా, ఉక్రైన్ దేశాల మధ్య శాంతి పూయాలనే మా అభిమతం అని, మా సహకారం ఉంటుందని పేర్కొన్నారు. నెహామర్ మాట్లాడుతూ రష్యా, ఉక్రైన్ దేశాలు పంతాలకు పోకుండా చర్చలు ఫలవంతం చేయాలని, శాంతి కోసం భారత్ తన వంతు కృషి చేస్తుందని నెహామర్ ఆశాభావం వ్యక్తపరిచారు. రష్యా, ఉక్రైన్ దేశాల మధ్య చర్చలకు ఆస్ట్రియ ఎప్పుడు ముందు ఉంటుందని, చర్చలు తమ దేశంలో సాగడానికి అనువైన ప్రదేశమని పేర్కొన్నారు. ఇక ఆస్ట్రియ, భారత్ విషయానికి వస్తే అన్ని రంగాలలో ముఖ్యంగా వ్యర్థ పదార్థాల ను నిర్మూలించడం లోను, మౌలిక సదుపాయాల అభివృద్ధి కొరకు, నవకల్పనలు మొదలైన వాటి విషయంలో కలసి పని చేసి బలోపేతం కావాలని అంగీకారం కుదిరింది. భారత్ లో పెట్టుబడులకు ఆస్ట్రియ దేశంలోని కంపెనీ లను మోదీ ఆహ్వానించారు. దానికి ఆస్ట్రియ తన సమ్మతిని తెలియచేసింది. ఆస్ట్రియ తో మాకు ఇచ్చిపుచ్చుకునే ధోరణి ఉందని మోదీ చెప్పడం గమనార్హం.

. కనుమ ఎల్లారెడ్డి,93915 23027.

# నేడు ఇస్కాన్ మియాపూర్ ఆధ్వర్యంలో జగన్నాథ రథయాత్ర

హైదరాబాద్, మేజర్‌న్యూస్: అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం (ఇస్కాన్), మియాపూర్ కేంద్రం ఆధ్వర్యంలో నేడు జగన్నాథ రథయాత్ర నిర్వహిస్తున్నామని మియాపూర్ ఇస్కాన్ టెంపుల్ అధ్యక్షులు శ్రీరాందాస్ తెలిపారు. హైదరాబాద్ ప్రెస్ క్లబ్‌లో గురువారం ఆయన పాత్రికేయుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ప్రభూజీ మాట్లాడుతూ నేడు మధ్యాహ్నం 2 గంటలకు హైదరాబాద్ చందానగర్‌లోని ఆర్ఎస్ బ్రదర్స్ వద్ద ఈ రథయాత్ర ప్రారంభమవుతుందని అన్నారు. రథయాత్ర మదీనగూడ, ఆల్విన్ క్రాస్ రోడ్, మియాపూర్ క్రాస్ రోడ్, జెపి నగర్ వీధుల గుండా కొనసాగుతూ విశ్వనాథ గార్డెన్ వద్ద ముగుస్తుందని పేర్కొన్నారు. ఈ రథయాత్ర దారి పొడవునా భక్తుల సౌకర్యార్థం త్రాగునీరు, పులిహోర ప్రసాదం అందజేయడం జరుగుతుందని, యాత్రలో వివిధ రకాల సంకీర్తనలతో, నృత్యాలతో ఆధ్యాత్మిక శోభ సంతరించుకునేలా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. అదే రోజు సాయంత్రం 6 గంటల నుండి రాత్రి 10 గంటల వరకు విశ్వనాథ గార్డెన్‌లో సమావేశం ఉంటుందని, ఇందులో ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రభూజీల ప్రసంగాలు ఉంటాయని, అనంతరం భక్తులకు అన్న ప్రసాదం వితరణ ఉంటుందని తెలిపారు. రథయాత్ర సమావేశంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని శ్రీరాందాస్ విజ్ఞప్తి చేశారు. ఇస్కాన్ టెంపుల్ ప్రభూజీలు ఆనంద్ గోపీనాథ్, మధుర్ శ్యాం, ఇస్కాన్ సభ్యులు గోపరాజు శ్రీనివాస్, దేవిశెట్టి శ్రీనివాస్ ఈ సమావేశంలో పాల్గొన్నారు.



# ఇక నుంచి జూన్ 25న రాజ్యాంగ హత్య దినం

## కేంద్ర సర్కార్ సంచలన నిర్ణయం

● కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్ కూడా విడుదల ● ఎక్స్ వేదికగా కేంద్ర హోం మంత్రి షా ప్రకటన



న్యూఢిల్లీ.... కేంద్రంలోని మోదీ సర్కార్ సంచలన నిర్ణయం తీసుకుంది. జూన్ 25ను రాజ్యాంగ హత్య దినంగా ప్రకటించింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్ కూడా విడుదల చేసింది. ఎమర్జెన్సీ సమయంలో అమానవీయ బాధలను భరించిన వారిని స్మరించుకునేందుకు భారత ప్రభుత్వం ఏటా జూన్ 25న రాజ్యాంగ హత్య దినంగా నిర్వహిస్తుందని నోటిఫికేషన్ పేర్కొంది. ఇందుకు సంబంధించిన కేంద్ర హోం మంత్రి ఎక్స్ వేదికగా ప్రకటన చేశారు. 1975 జూన్ 25 అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ దేశంలో ఎమర్జెన్సీని ప్రకటించారు. 1975 జూన్ 25 నుంచి 1977 మార్చి 21 వరకు దాదాపు 21 నెలల పాటు దేశంలో ఎమర్జెన్సీ కొనసాగింది. ఆ సమయంలో పౌర హక్కులను కాలరాయడం, రాజకీయ ప్రత్యర్థుల అరెస్టులు, మీడియాపై తీవ్రమైన సెన్సార్షిప్ విధించడం వంటివి జరిగాయి. అయితే ఎమర్జెన్సీపై బీజేపీ సమయం దొరికనప్పుడల్లా కాంగ్రెస్పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడుతుంటుంది.

ఇటీవల 18వ లోక్సభ కొలువుదీరిన వేళ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పార్లమెంట్ ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగిస్తూ.. ఎమర్జెన్సీ గురించి ప్రస్తావించారు. ఎమర్జెన్సీ అనేది రాజ్యాంగంపై అతిపెద్ద దాడి అని.. అదొక చీకటి అధ్యాయం అని ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. ఎమర్జెన్సీ సమయంలో దేశం మొత్తం గందరగోళంలో కూరుకుపోయిందని.. అయితే అటువంటి రాజ్యాంగ విరుద్ధ శక్తులపై దేశం విజయం సాధించిందని అన్నారు.

ఇక, జూన్ 25ను రాజ్యాంగ హత్య దినంగా ప్రకటిస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుందని తెలిపిన అమిత్ షా.. 1975 జూన్ 25న అప్పటి ప్రధాని ఇందిరా గాంధీ నియంతృత్వ ఆలోచనా ధోరణిని ప్రదర్శించి.. దేశంపై ఎమర్జెన్సీని విధించడం ద్వారా మన ప్రజాస్వామ్యం ఆత్మను ఉక్కిరిబిక్కిరి చేశారు. తమ తప్పులేకుండా లక్షలాది మందిని కటకటాల వెనక్కి నెట్టారు.. మీడియా గొంతును మూయించారు. భారత ప్రభుత్వం ప్రతి సంవత్సరం జూన్ 25వ తేదీని సంవిధాన్ హత్యా దివస్‌గా నిర్వహించాలని నిర్ణయించింది. జూన్ 25 దేశం 1975 ఎమర్జెన్సీ సమయంలో అమానవీయ బాధను భరించిన వారందరి అపారమైన సహకారాన్ని స్మరించుకుంటుంది అని పేర్కొన్నారు.

నియంతృత్వ ప్రభుత్వ అణిచివేతలను, అసంఖ్యాక హింసలను ఎదుర్కొంటూ ప్రజాస్వామ్యాన్ని పునరుజ్జీవింపజేసేందుకు పోరాడిన లక్షలాది మంది ప్రజల పోరాటాన్ని గౌరవించడమే ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం వెనకాల ఉన్న ఉద్దేశ్యం.

రాజ్యాంగ హత్య దినం ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడానికి, ప్రతి భారతీయుడిలో వ్యక్తి స్వేచ్ఛ అమర జ్వాలని సజీవంగా ఉంచడానికి పని చేస్తుంది. తద్వారా భవిష్యత్తులో కాంగ్రెస్ వంటి నియంతృత్వ మనస్తత్వం పునరావృతం కాదు అని మోదీ పేర్కొన్నారు.

# సీఎం కేజ్రీవాల్‌కు తాత్కాలిక బెయిల్

● 5 షరతులు విధించిన కోర్టు ● ఢిల్లీ మద్యం కుంభకోణంలో మనీల్యాండరింగ్ ఆరోపణలపై అరెస్ట్



న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఢిల్లీ మద్యం కుంభకోణం వ్యవహారంలో మనీల్యాండరింగ్ ఆరోపణలపై అరెస్ట్ అయిన సీఎం అరవింద్ కేజ్రీవాల్కు ఎట్టకేలకు ఉపశమనం లభించింది. షరతులతో కూడిన మధ్యంతర బెయిల్ను సుప్రీంకోర్ట్ శుక్రవారం మంజూరు చేసింది. మొత్తం 5 షరతులతో సుప్రీంకోర్ట్ బెయిల్ విధించింది. సీఎం కార్యాలయాన్ని సందర్శించడానికి వీల్లేదని, గవర్నర్ అనుమతి లేకుండా అధికారిక ఫైళ్లపై సంతకం చేయడానికి వీల్లేదని కోర్ట్ స్పష్టం చేసింది. బెయిల్ కోసం రూ.50,000 వ్యక్తిగత పూచికత్తు చెల్లించాలని పేర్కొంది.

ఇక ఢిల్లీ మద్యం కుంభకోణం కేసుకు సంబంధించి ఎలాంటి వ్యాఖ్యలు చేయకూడదని, సాక్షులలో ఎవరితోనూ మాట్లాడకూడదు లేదా కేసుతో సంబంధించిన ఫైల్స్ జోలికి వెళ్లొద్దని స్పష్టం చేసింది. కాగా ఈ మధ్యంతర బెయిల్ను పొడిగించవచ్చు లేదా ఎక్కువ మంది సభ్యులతో కూడిన బెంచ్ రీకాల్ చేయవచ్చునని సుప్రీంకోర్ట్ పేర్కొంది. కాగా ఈడీ కేసులో బెయిల్ దొరికినప్పటికీ ఆయన జైలు నుంచి బయటకు వచ్చే అవకాశం కనిపించడం లేదు. ఈ బెయిల్ లభించడానికి కొన్ని గంటల ముందే ఇదే ఎక్సైజ్ పాలసీ వ్యవహారంలో సీబీఐ కేసులో కేజ్రీవాల్ జ్యుడీషియల్ కస్టడీని కోర్ట్ పొడిగించింది. దీంతో ఆయన జైలు నుంచి బయటకు వచ్చే అవకాశం కనిపించడం లేదు.

# గోపాన్‌పల్లి ఫ్లైఓవర్ ప్రారంభించండి

**ముఖ్యమంత్రికి కేటీఆర్ సూచన**



తెలంగాణ బ్యూరోప్రతినిధిః గోపాన్పల్లి, తెల్లాపూర్ చందానగర్వాసులకు మేలు చేసేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం గోపాన్పల్లి ఫ్లైఓవర్ను నిర్మించిందని కేటీఆర్ తెలిపారు. ఈ ఫ్లైఓవర్ నిర్మాణం పూర్తయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించడం లేదని అన్నారు. ఢిల్లీకి చక్కర్లు కొట్టడం, బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఇండ్ల చుట్టూ తిరగడం మీద ఉన్న శ్రద్ధ ప్రజా సమస్యలపై లేదా అని సీఎం రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. తమ వ్యక్తిగత పీఆర్ మీద ఉన్న శ్రద్ధ ప్రజలకు కల్పించాల్సిన సౌకర్యాల మీద లేదని మండిపడ్డారు. వెంటనే గోపాన్పల్లి ఫ్లైఓవర్ను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. లేదంటే ప్రజలే ప్రారంభించాల్సిన పరిస్థితి వస్తుందని హెచ్చరించారు.

# 16న కలెక్టర్లు, ఎస్పీలతో సీఎం రేవంత్ రెడ్డి సమావేశం



తెలంగాణ బ్యూరోప్రతినిధిః ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు. ఈనెల 16న హైదరాబాద్లోని రాష్ట్ర సచివాలయంలో జరుగనున్న ఈ సమావేశంలో అన్ని జిల్లాల కలెక్టర్లు, పోలీస్ కమిషనర్లు, ఎస్పీలు హాజరుకానున్నారు. ఈ సందర్భంగా ప్రజాపాలన, ధరణి, వ్యవసాయం, ఆరోగ్యం (సీజనల్ వ్యాధులు), వన మహోత్సవం, మహిళా శక్తి పథకం, విద్య, శాంతి భద్రతల సంబంధిత అంశాలు, డ్రగ్స్పై చర్చించనున్నారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి వెల్లడించారు. పన్నుల విసూళ్లలో కఠినంగా వ్యవహరిస్తూ, రాష్ట్ర ఆదాయం పెంచాలని అధికారులకు ముఖ్యమంత్రి రేవంతరెడ్డి దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలో నిర్దేశించిన వార్షిక లక్ష్యంతో పోలిస్తే ఈ ఆర్థిక సంవత్సరం జూన్ వరకు వచ్చిన ఆదాయం అంత ఆశాజనకంగా లేదని అసంతృప్తి వ్యక్తంచేశారు. ఓటాన్ అకౌంట్ బడ్జెట్లో పొందుపరిచిన వార్షిక లక్ష్యాన్ని చేరుకోవాలంటే, నెలవారీ లక్ష్యాలు నిర్దేశించుకోవాలని సూచించారు. నిర్ణీత ఆదాయ లక్ష్యాలపై ఇకనుంచి ప్రతి

**ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించనున్న సీఎం**

నెలా మొదటివారంలో తానే సమీక్ష నిర్వహిస్తానని తెలిపారు. ప్రతి శుక్రవారం ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క సంబంధిత శాఖల లక్ష్య సాధన పురోగతిపై సమావేశమవుతారని చెప్పారు. రాష్ట్రానికి ఆదాయం తెచ్చిపెట్టే ఎక్సైజ్, వాణిజ్య పన్నులు, మైనింగ్, స్టాంపులు, రిజిస్ట్రేషన్లు, రవాణా విభాగాల అధికారులతో సీఎం ఏ రేవంతరెడ్డి.. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, జూపల్లి కృష్ణారావుతో కలిసి గురువారం సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంతరెడ్డి మాట్లాడుతూ.. రాష్టానికి ఆదాయం తెచ్చిపెట్టే విభాగాలన్నీ నిర్ణీత వార్షిక లక్ష్యాన్ని సాధించేందుకు ప్రయత్నించాలని అధికారులను ఆదేశించారు. ఇసుక, ఖనిజ వనరుల ద్వారా వచ్చే ఆదాయం పెరగాలంటే అక్రమ రవాణా, లీకేజీలను అరికట్టాలని సూచించారు. గత ఆర్థిక సంవత్సరం కంటే ఈ ఏడాది మరింత ఆదాయం వచ్చేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. పన్నుల ఎగవేత లేకుండా అన్ని విభాగాలు కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. ఆదాయ వనరులు, పన్నుల వసూళ్ల విషయంలో అధికారులు నికచ్చిగా వ్యవహరించాలని ఆదేశించారు. ప్రధాన ఆదాయ మార్గమైన జీఎస్టీ ఆదాయం పెంచుకోవడానికి కావల్సిన అన్ని చర్యలను వెంటనే చేపట్టాలని సూచించారు. జీఎస్టీ రాబడి పెంపునకు వాణిజ్య పన్నుల శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలని, పకడ్బందీగా ఆడిటింగ్ నిర్వహించాలని ఆదేశించారు. పెట్రోలు, డీజిల్పై వ్యాట్ ద్వారా వచ్చే ఆదాయం తగ్గిందని, దానికి ప్రత్యామ్నాయంగా ఏవియేషన్ ఇంధనంపై ఉన్న పన్నును సవరించే అవకాశాలను పరిశీలించాలని సూచించారు. రాష్ట్రంలో ఎన్నికల సమయంలో మద్యం విక్రయాలు ఎకువగా జరిగినప్పటికీ ఆదాయం పెరగక పోవడానికి కారణాలను సీఎం రేవంతరెడ్డి ఆరా తీశారు. మద్యం అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని, నాన్ డ్యూటీ పెయిడ్ లికర్ను అరికడితే ఆదాయం పెరిగే అవకాశం ఉన్నదని ఈ సందర్భంగా చర్చించారు. డిస్టిలరీల నుంచి మద్యం అడ్డదారి పట్టకుండా నిఘా పెట్టాలని, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఇప్పటికే రాష్ట్రంలో భూములు, స్థిరాస్తుల రేట్లు భారీగా పెరిగాయని, రిజిస్ట్రేషన్లు, స్టాంపుల ద్వారా వచ్చే ఆదాయం పెరిగేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రాష్ట్రంలో ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహించేందుకు పరిమిత కాలం పన్ను సబ్సిడీ అమల్లోకి వచ్చిందని, తిరిగి పన్ను వసూలు చేయడం ద్వారా వాహనాల అమ్మకాలపై ఏమైనా ప్రభావం పడిందా? అన్న అంశంపై అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు.

## బలమైన వ్యవస్థగా హైడ్రా ఉండాలి

**అధికారులకు సీఎం రేవంత్ సూచన**

సచివాలయంలో హైడ్రా (హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్) అధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ఇతర అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా హైడ్రా విధివిధానాలపై చర్చ జరిగింది. హైడ్రా విధివిధానాలపై సీఎం రేవంత్ రెడ్డి అధికారులకు పలు సూచనలు చేశారు. ఔటర్ రింగ్ రోడ్డు వరకు 2 వేల చదరపు కి.మీ పరిధిలో హైడ్రా విధులు నిర్వహించేలా చూడాలని సీఎం ఆదేశించారు. ఇప్పటి వరకు జీహెచ్ఎంసీ పరిధిలో ఉన్న అనధికారిక హోర్డింగ్స్, ఫ్లెక్సీలు తొలగించాలి. అపరాధ రుసుము వసూలు బాధ్యత హైడ్రాకు బదలాయించాలని ఆదేశించారు. జోన్ల విభజనలో పోలీస్ స్టేషన్ పరిధులు, అసెంబ్లీ నియోజకవర్గ పరిధులు పూర్తిగా ఒకే జోన్లో వచ్చేలా జాగ్రత్త వహించాలన్నారు సీఎం. నాళాలు, చెరువులు, ప్రభుత్వ స్థలాల ఆక్రమణల విషయంలో నిబంధనలు కఠినతరం చేసేలా అధ్యయనం చేయండని అధికారులను సీఎం ఆదేశించారు. హెచ్ఎండీఏ, వాటర్ వర్క్స్, డిజాస్టర్ మేనేజ్మెంట్, మున్సిపల్ విభాగాల మధ్య ఎప్పటికప్పుడు సమన్వయం ఉండేలా చూడాలి. ఒక బలమైన వ్యవస్థగా హైడ్రా ఉండాలి. అవసరమైతే ప్రత్యేక నిధులు కేటాయించే అంశాన్ని పరిశీలించండి. అసెంబ్లీ సమావేశాల్లోగా పూర్తిస్థాయి విధివిధానాలు రూపొందించండని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్ ఆదేశించారు.

# కాంగ్రెస్‌లోకి కేసీఆరే పంపుతున్నారు

**చేరికలపై బండి హాట్ కామెంట్స్**



తెలంగాణ బ్యూరోప్రతినిధిః బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్లోకి చేరికలు కొనసాగుతూనే ఉన్నాయి. అయితే ఈ చేరికలకు సంబంధించి కేంద్రమంత్రి బండి సంజయ్ కీలక వ్యాఖ్యలు చేశారు. స్వయంగా కేసీఆర్ సొంత ఎమ్మెల్యేలను కాంగ్రెస్లోకి పంపుతున్నారని అన్నారు. తెలంగాణ ప్రజల ఏకైక గ్యారంటీ నరేంద్ర మోదీ అని తెలిపారు. అవినీతి నుంచి బయట పడేందుకు కాంగ్రెస్కు కేసీఆర్ సహకరిస్తున్నారని ఆరోపించారు. సెక్యూరిటీ లేకుండా.. రాహుల్ గాంధీ ఉస్మానియా యూనివర్సిటీకి రావాలని సవాల్ విసిరారు. నిరుద్యోగులను పోలీసుల ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం అణిచివేస్తోందని కేంద్ర మంత్రి మండిపడ్డారు. రాహుల్ గాంధీని సొంత పార్టీ వారే ప్రధాని అభ్యర్థిగా అంగీకరించలేదన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ కార్యకర్తలకు పెద్ద పీట వేస్తుందన్నారు. బీజేపీ కార్యకర్తల గెలుపే రాష్ట్ర బీజేపీ నాయకత్వం లక్ష్యమని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీల హామీతో తెలంగాణ ప్రజలు మోసపోయారన్నారు. కాంగ్రెస్ను ప్రజలు వ్యతిరేకించారనటానికి లోక్సభ ఎన్నికల ఫలితాలు నిదర్శనమన్నారు. తెలంగాణ ప్రజాప్రతినిధులు కూడా నరేంద్ర మోదీ మాత్రమే గ్యారంటీ అంటున్నారన్నారు. ధర్మం, తెలంగాణ పేదల కోసం పోరాడేది బీజేపీ మాత్రమే అని చెప్పుకొచ్చారు. బీజేపీ కార్యకర్తల పోరాటం వలనే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి 8సీట్లు వచ్చాయన్నారు. రైతులను మోసం చేసే విషయంలో బీఆర్ఎస్ బాటలోనే కాంగ్రెస్ నడుస్తోందన్నారు.

## బీజేపీ రాష్ట్ర విస్తృతస్థాయి కార్యవర్గ సమావేశాలు

తెలంగాణ బ్యూరోప్రతినిధిః బీజేపీ రాష్ట్ర విస్తృతస్థాయి కార్యవర్గ సమావేశాలు శుక్రవారం ఉదయం ప్రారంభమయ్యాయి. పార్టీ బలోపేతం, ప్రజా సమస్యలే లక్ష్యంగా కార్యవర్గ సమావేశాలు జరుగుతున్నాయి. పార్టీలో చేరికలపై బీజేపీ కార్యవర్గం ప్రధానంగా చర్చించనున్నట్లు తెలుస్తోంది. ఎమ్మెల్యే పదవులకు రాజీనామా చేస్తేనే బీజేపీలో చేర్చుకుంటామని బండి సంజయ్ ఇప్పటికే స్పష్టం చేసిన విషయం తెలిసిందే. ఈ సమావేశాలకు కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రదాన్, సంస్థాగత ప్రధానకార్యదర్శి చంద్రశేఖర్ తివారీ, పార్లమెంట్ ఎన్నికల ఇంచార్జ్ అభయ్ పాటిల్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. శంషాబాద్ మల్లికా కన్వెన్షన్లో కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో జరుగుతోన్న సమావేశాల్లో లక్ష్మణ్, బండి సంజయ్, డీకే అరుణ, ఈటల, గరికపాటి తదితరులు పాల్గొన్నారు. అలాగే పదాధికారులు, కార్యవర్గ సభ్యులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, మాజీ ఎంపీలు ఎమ్మెల్యేలు, జిల్లాల అధ్యక్షులు, కార్పోరేటర్లు హాజరయ్యారు. పార్లమెంటు ఎన్నికల తర్వాత జరుగుతున్న మొదటి కార్యవర్గ సమావేశం ఇది. భవిష్యత్తు ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా రాష్ట్ర కార్యవర్గ సమావేశాలు జరుగుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలు అమలు చేసేలా ఒత్తిడి తీసికొచ్చే కార్యక్రమాలపై ఈ సమావేశాల్లో నేతలు దిశానిర్దేశం చేయనున్నారు.

# జాతీయ రహదారిని మీరెలా అడ్డుకుంటారు..?

● హరియాణా ప్రభుత్వానికి సుప్రీం కోర్టు సూటి ప్రశ్న
● శంభూ సరిహద్దులో జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన అడ్డుకట్టల్ని తొలగించాలని ఆదేశాలు

దిల్లీ: హరియాణాలోని అంబాలా సమీపంలో శంభూ సరిహద్దు వద్ద జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన అడ్డుకట్టల్ని తొలగించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సుప్రీం కోర్టు ఆదేశించింది. ఒక హైవేను అడ్డుకునేందుకు రాష్ట్రానికి ఏ అధికారం ఉంది అని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఉజ్జల్ భూయాన్లతో కూడిన ధర్మాసనం ప్రశ్నించింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో రైతు ఉద్యమం సందర్భంగా చలో దిల్లీని అడ్డుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం బారికేడ్లను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. వాటిని వారంలోగా తొలగించాలని పంజాబ్-హరియాణా హైకోర్టు కూడా బుధవారం ఆదేశించింది.

ఫిబ్రవరిలో ఖనౌరీ సరిహద్దు వద్ద హరియాణా పోలీసులు, రైతుల మధ్య జరిగిన ఘర్షణల్లో యువ రైతు శుభ్కరణ్ సింగ్ మృతి చెందారు. ఆయన మృతిపై హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి నేతృత్వంలో విచారణ కమిటీని ఏర్పాటు చేయాలని మార్చి 7న హైకోర్టు నిర్ణయించింది. దీన్ని సవాలు చేస్తూ హరియాణా దాఖలు చేసిన పిటిషన్పై సుప్రీం కోర్టు శుక్రవారం విచారణ చేపట్టింది. హైకోర్టు జారీ చేసిన బారికేడ్ల తొలగింపు ఆదేశాలనూ సవాల్ చేయనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం తరఫు న్యాయవాది ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. ఈ క్రమంలోనే ధర్మాసనం పలు కీలక ప్రశ్నలు సంధించింది.

హైవేను ఒక రాష్ట్రం ఎలా దిగ్బంధిస్తుంది? ట్రాఫిక్ను నియంత్రించడం దాని బాధ్యత. జాతీయ రహదారిని తెరవండి.. కానీ, రాకపోకలను నియంత్రించండి అని జస్టిస్ భూయాన్ ఆదేశించారు. మీరు హైకోర్టు ఆదేశాలను ఎందుకు సవాల్ చేయాలనుకుంటున్నారు? రైతులూ ఈ దేశ పౌరులే. వారికి ఆహారం, మంచి వైద్యం అందించండి. వారు వచ్చి నినాదాలు చేసి, తిరిగి వెళ్లిపోతారు అని జస్టిస్ సూర్యకాంత్ తెలిపారు. బహుశా మీరు రోడ్డు మార్గంలో ప్రయాణించరేమో! అని ప్రభుత్వ న్యాయవాదిని ఉద్దేశించి వ్యాఖ్యానించగా.. తాను అదే దారిలో రాకపోకలు సాగిస్తానని బదులిచ్చారు. అయితే.. మీకూ ఈ ఇబ్బందుల గురించి



తెలిసే ఉంటుందని ధర్మాసనం పేర్కొంది. తదుపరి చర్యలపై అఫిడవిట్ దాఖలు చేయాలని హరియాణా ప్రభుత్వాన్ని ఆదేశించింది.

# కవితకు బెయిల్ కష్టమే..!?

● ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో మరో కీలక పరిణామం ● కేసులో కవిత పాత్రపై సీబీఐ సప్లిమెంటరీ ఛార్జిషీట్ ● జులై 22కు విచారణ వాయిదా వేసిన న్యాయస్థానం

ఢిల్లీ... లిక్కర్ స్కాం కేసులో రోజుకో పరిణామం చోటుచేసుకుంటోంది. ఇప్పటికే ఈ కేసులో అరెస్టయి.. సుమారు 120 రోజులుగా తీహార్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉంటున్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విషయంలో మళ్లీ సేమ్ సీన్ రిపీటయ్యింది. ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో.. ఈడీ, సీబీఐ అధికారులు పెట్టిన కేసుల్లో బెయిల్ కోసం అటు రౌస్ ఎవెన్యూ కోర్టులో, ఇటు ఢిల్లీ హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేయగా.. రెండు న్యాయస్థానాలు తిరస్కరించాయి. కాగా.. మరో ప్రయత్నంగా.. డిఫాల్ట్ బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు కవిత. అయితే.. ఈ పిటిషన్ విషయంలోనూ గతంలో జరిగిందే రిపీటవుతోంది. ఈ పిటిషన్ విచారణ కూడా వాయిదా పడింది.

అయితే.. లిక్కర్ స్కాం కేసులో కవిత పాత్రపై సీబీఐ అధికారులు సప్లిమెంటరీ ఛార్జిషీట్ దాఖలు చేయగా.. ఆ విచారణతో పాటు ఇటు డిఫాల్ట్ బెయిల్ పిటినషన్ విచారణను కూడా రౌస్ అవెన్యూ కోర్టు వాయిదా వేసింది. కోర్టులో జడ్జి కావేరి భవేజా ఆధ్వర్యంలో.. సీబీఐ కేసులో కవితకు డిఫాల్ట్ బెయిల్పై వాదనలు జరిగాయి. మద్యం కేసులో కవిత పాత్రపై సాక్ష్యాలతో కూడిన సప్లిమెంటరీ ఛార్జిషీట్ను దాఖలు చేసినట్టు.. ధర్మాసనానికి సీబీఐ తెలిపింది. ఛార్జిషీట్ను పరిగణనలోకి తీసుకోవాలని న్యాయస్థానాన్ని కోరింది. అయితే.. సీబీఐ ఛార్జిషీట్లో తప్పులున్నాయని కవిత తరపు లాయర్ నితేష్ రానా కోర్టుకి తెలిపారు. మరోవైపు తప్పులేవి లేవని సీబీఐ తరపు న్యాయవాది తెలపగా స్పందించిన జడ్జి కావేరి భవేజా.. ఛార్జిషీట్లో తప్పులున్నాయని కోర్టు ఆర్డర్ ఫైల్ చేయాలని సూచించారు. కోర్టు ఆర్డర్ కూడా అప్లోడ్ కాలేదని కవిత తరపు న్యాయవాది నితేష్ రానా పేర్కొన్నారు. దీంతో జూలై 22కి తదుపరి విచారణను రౌస్ అవెన్యూ కోర్టు వాయిదా వేసింది.కాగా.. ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో కవితను.. మార్చి 15న ఈడీ అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. ఆమె జైలులో ఉండగానే సీబీఐ కూడా అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టింది. కాగా.. అప్పటి నుంచి.. ఆమె రిమాండ్ను కోర్టు పొడిగిస్తూ వస్తోంది. దీంతో.. ఆమెకు బెయిల్ రావటం కష్టంగా మారింది.

## ఫోన్ ట్యాపింగ్ కేసు... నాంపల్లి కోర్టు కీలక తీర్పు

ఫోన్ ట్యాపింగ్ కేసు నిందితులకు మరోసారి ఎదురుదెబ్బ తగిలింది. నాంపల్లి కోర్టులో నిందితులు దాఖలుచేసిన మ్యాండేటరీ (తప్పనిసరి) బెయిల్ పిటిషన్లను నాంపల్లి కోర్టు కొట్టివేసింది. ఏ2 ప్రణీత్రావు, ఏ3 తిరుపతన్న, ఏ4 భుజంగరావు, ఏ5 రాధాకిషన్రావులకు కస్టడీ పూర్తయిందని, ఇప్పటి వరకు ఛార్జిషీట్ నమోదు కానందున వారికి బెయిల్ ఇచ్చే అధికారం కోర్టుకు ఉందని నిందితుల తరపు న్యాయవాదులు కోర్టుకు విన్నవించారు. వారి వాదనలపై అభ్యంతరం వ్యక్తం చేసిన పోలీసులు.. ఛార్జి షీట్ దాఖలు చేశామని, దాన్ని తిప్పి పంపినంత మాత్రాన అసలు దాఖలు చేయనట్టు కాదు అన్నారు. విచారణ కీలక దశలో ఉందని.. బెయిల్ ఇవ్వొద్దని పోలీసుల తరపు న్యాయవాది కోర్టుకు విన్నవించారు. ఇరుపక్షాల వాదనలు విన్న కోర్టు నిందితులు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్ ను తిరస్కరిస్తూ తీర్పునిచ్చింది. ఇరువైపులా వాదనలు ముగియగా.. జడ్జి జులై 12 న తీర్పు వెలువరించారు.

# కాంగ్రెస్‌లోకి బీఆర్ఎస్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్

● కాంగ్రెస్ కండువా కప్పి ఆహ్వానించిన సిఎం రేవంత్
● ఇప్పటికే 7గురు కారుదిగిన శాసనసభ్యులు




హైదరాబాద్ : కాంగ్రెస్ పార్టీలో మరో బీఆర్ఎస్ ఎమ్మెల్యే చేరారు. హైదరాబాద్ నగరానికి చెందిన రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. శుక్రవారం (జూలై 12) సాయంత్రం జూబ్లీహిల్స్లోని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇంటికి వచ్చి.. ప్రకాశ్ గౌడ్ కాంగ్రెస్ లో చేరారు. ఎమ్మెల్యేతో పాటు ఆయన ఫాలోవర్లు, కింది స్థాయి కార్యకర్తలు కూడా కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సహా ఇతర కాంగ్రెస్ నేతలు ఈ చేరిక కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈయనతో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ లో చేరిన వారి సంఖ్య 8కి చేరింది. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే వలసలు పెరిగిన సంగతి తెలిసిందే. దానం నాగేందర్, కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావు, ఎంపీలు రంజిత్ రెడ్డి, పసునూరి దయాకర్, మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి లాంటి వారు కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల్లో జడ్పీ ఛైర్మన్ కుర్చీలు, మున్సిపల్ ఛైర్మన్లు కూడా కాంగ్రెస్ లో చేరారు.

గత నెలలో కూడా ప్రకాష్ గౌడ్ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ని ఎర్రవెల్లిలోని ఫాంహౌస్ లో కలిశారు. ఆ సమయంలో చాలా మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు మర్యాద పూర్వకంగా కేసీఆర్ ను కలిశారు. ఎమ్మెల్యేలు టి. హరీష్ రావు, వేముల ప్రశాంత్ రెడ్డి, కేపీ వివేకానంద, అరికెపూడి గాంధీ, మాగంటి గోపీనాథ్, మాధవరం కృష్ణారావు, ముఠా గోపాల్, ఎమ్మెల్సీలు శేరి సుభాష్ రెడ్డి, దండే విఠల్, మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న, పార్టీ నాయకులు క్యామ మల్లేష్, రావుల శ్రీధర్ రెడ్డితో పాటు ప్రకాష్ గౌడ్ కూడా కేసీఆర్ ను కలిశారు. ఇంతలోనే బీఆర్ఎస్ ను వీడారు.

# అధ్యక్ష అభ్యర్థిత్వం కోసం అన్ని టెస్ట్‌లకు సిద్ధమైన బైడెన్

● ఇప్పటికే అమెరికా అధ్యక్ష బరి నుంచి తప్పుకోవాలని వత్తిళ్లు ● ప్రత్యర్థి, రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్‌ను ఎదుర్కొవడంలో విఫలం ● మాటల్లో తడబాటు, వింత వింత ప్రవర్తనతో నిత్యం వార్తల్లో నిలుస్తున్న బైడెన్ ● సొంత పార్టీ నేతలైన డెమోక్రాట్ల నుంచే తీవ్ర అభ్యంతరాలు



వాషింగ్టన్ ... మరికొన్ని రోజుల్లో అమెరికా అధ్యక్ష ఎన్నికలు జరగనున్నాయి. ఈ క్రమంలోనే ప్రస్తుత అధ్యక్షుడు జో బైడెన్ వ్యవహార శైలి పట్ల సొంత పార్టీ నుంచే తీవ్ర విమర్శలు, వ్యతిరేకత వ్యక్తం అవుతోంది. గత కొన్ని రోజుల నుంచి బైడెన్ అనుసరిస్తున్న తీరు.. అధ్యక్ష పోటీలో ప్రత్యర్థి ముందు తడబడటం డెమోక్రటిక్ పార్టీ నేతలకు మింగుడు పడటం లేదు. ఈ నేపథ్యంలోనే ఆయనను తప్పుకోవాలని సొంత పార్టీ నుంచే తీవ్ర ఒత్తిడి పెరుగుతోంది. ఈ క్రమంలోనే డెమోక్రటిక్ పార్టీ అధ్యక్ష అభ్యర్థిత్వం నుంచి బైడెన్ను పక్కకు తప్పుకోవాలనే డిమాండ్లు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలోనే తాజాగా జో బైడెన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. తన డాక్టర్లు సూచిస్తే తాను మెడికల్ టెస్టు చేయించుకునేందుకు సిద్ధం అంటూ ప్రకటించారు. తన డాక్టర్లు సూచిస్తే వెంటనే మెడికల్ టెస్టులు చేయించుకునేందుకు తాను సిద్ధమని జో బైడెన్ ప్రకటించారు. తన ఆరోగ్యం బాగానే ఉందని స్పష్టం చేశారు. గత కొన్ని రోజులుగా తన మానసిక స్థితిపై తీవ్ర సందేహాలు నెలకొన్న వేళ.. ఆయన చేసిన ప్రకటన ప్రాధాన్యం సంతరించుకుంది. తాను పూర్తిగా ఆరోగ్యంగా ఉన్నానని.. దాన్ని నిరూపించుకునేందుకు అవసరమైతే ఎలాంటి మెడికల్ టెస్టుకైనా తాను సిద్ధమే అంటూ తాజాగా నాటో సదస్సు అనంతరం నిర్వహించిన ప్రెస్ కాన్ఫరెన్సో బైడెన్ ప్రకటించారు. బైడెన్ మానసిక స్థితిపై సొంత పార్టీ నేతలే విమర్శలు చేస్తున్న వేళ బైడెన్ ప్రకటన రావడం గమనార్హం. తన డాక్టర్లు మరోసారి న్యూరోలాజికల్ టెస్టులు చేయించుకోవాలని చెబితే తప్పనిసరిగా చేసుకుంటానని బైడెన్ స్పష్టం చేశారు. తన చుట్టూ చాలా పెద్ద పెద్ద, అనుభవం కలిగిన డాక్టర్లు ఉన్నారని తెలిపారు. తనకు ఏమైనా సమస్య ఉంటే గుర్తించి చెబుతారని పేర్కొన్నారు. ఇక తాను ఫిట్గా ఉన్నట్లు చెప్పిన బైడెన్.. తాను ఏం చేసినా.. ఎవరూ నమ్మడం లేదని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. తాను అధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాత ఇప్పటివరకు 3 సార్లు న్యూరోలాజికల్ టెస్టు చేయించుకున్నానని వెల్లడించారు. అందులో ఈ ఏడాది ఫిబ్రవరిలో ఒకటి ఉన్నట్లు చెప్పారు. అయితే బైడెన్ చెప్పినదానికి.. ప్రత్యక్షంగా జరుగుతున్న దానికి పోలిక లేకపోవడమే ప్రస్తుత గందరగోళానికి దారి తీస్తోంది. ఇటీవల మీడియా ముందు తడబడిన బైడెన్ తాజాగా అదే ప్రవర్తన కనబరిచారు. అమెరికా ఉపాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. ఉక్రెయిన్ అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ అంటూ.. బైడెన్ వింత వింత వ్యాఖ్యలు చేయడం మరోసారి తీవ్ర దుమారానికి కారణం అయ్యాయి.

# ఏపీకి బ్రాండ్ అంబాసిడర్ సీఎం చంద్రబాబు



ఏపీ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి: ఆంధ్రప్రదేశ్కు సీఎం చంద్రబాబు బ్రాండ్ అంబాసిడర్ అని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి భరత్ అన్నారు. రాష్ట్రానికి పెట్టబడులు తీసుకురావడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. విశాఖపట్నంలోని నోవోటెల్ హోటల్లో ఆయన పారిశ్రామికవేత్తలు, వ్యాపార ప్రముఖులు, సీఐఐ సభ్యులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని పారిశ్రామికవేత్తలను కోరినట్లు మంత్రి తెలిపారు. పారిశ్రామికవేత్తలకు మెరుగైన రాయితీలు ఇవ్వడంతో పాటు పరిశ్రమలకు అనుకూల వాతావరణం కల్పించేందుకు ముందుంటామన్నారు.

వ్యాపారాన్ని సులభతరం చేయడం ( ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ) పై త్వరలోనే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో చర్చించి పాలసీని తయారుచేస్తామని మంత్రి టి.జి భరత్ అన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధిలో ముందుకు తీసుకెళ్లడంతో పాటు యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయ్యాకనే పారిశ్రామికవేత్తలు రాష్ట్రానికి వచ్చి పెట్టుబడులు పెట్టేందుకు సుముఖత వ్యక్తం చేస్తున్నట్లు మంత్రి టి.జి భరత్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పారిశ్రామికవేత్తలు, సీఐఐ సభ్యులు, చాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# ఒకే వేదికపై చంద్రబాబు, పవన్, జగన్

- ముఖేశ్ అంబానీ ఇంట పెళ్లి వేడుకలకు హాజరు
- పెళ్లికి రూ.5 వేల కోట్లు వరకు ఖర్చు చేస్తున్నారనే టాక్
- ఉద్యోగులకు సైతం భారీ కానుకలిచ్చిన రిలయన్స్ గ్రూప్



అమరావతి... ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, వైసీపీ అధినేత వైఎస్ జగన్లను ఒకే వేదికపై చూసిన సందర్భాలు చాలా అరుదు. చంద్రబాబు..వైఎస్ జగన్లు గతంలో అసెంబ్లీ సమావేశాల్లో వేదిక పంచుకున్న సంగతి తెలిసిందే. కానీ పవన్ కల్యాణ్తో వేదిక పంచుకోలేదు. ఇలాంటి తరుణంలో ఒకే వేదికపైకి ఈ ముగ్గురు నాయకులు కలవబోతున్నారు. సీఎం చంద్రబాబు నాయుడు, మాజీ సీఎం జగన్, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఒకే వేదికపైకి రాబోతున్నారు. ఈ ముగ్గురు ఒకే వేదికపై రావడానికి కారణం అంబానీ కుటుంబ. ప్రపంచ కుబేరుడు, రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముఖేశ్ అంబానీ చిన్న కుమారుడు అనంత్ అంబానీ పెళ్లి ఈ ముగ్గురుని కలపనుంది. ఈ సందర్భంగా ముగ్గురు నేతలు ఒకే వేదికను పంచుకోనున్న సంగతి తెలిసిందే.

**పెళ్లికి హాజరుకానున్న చంద్రబాబు..జగన్...పవన్ కల్యాణ్**

ప్రపంచ కుబేరుడు ముకేశ్ అంబానీ ఇంట ఏ కార్యక్రమం అయినా సరే అది వేరే లెవెల్ అని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు. ఏదైనా కార్యక్రమం చేపడితే అది ఓ రేంజ్లో ఉంటుంది. అదే పెళ్లి అయితే ఇక ఆ హడావిడి అంతా ఇంతా కాదు. అది తలచుకుంటేనే వామ్మో అనిపిస్తుంది. ఈ పెళ్లికి రూ.5 వేల కోట్లు వరకు ఖర్చు చేస్తున్నారనే టాక్ సైతం వినిపిస్తోంది. అనంత్ అంబానీ..రాధికా మర్చంట్ల వివాహానికి అకాశమంత పందిరేసి అత్యంత వైభవంగా వివాహం జరిపిస్తున్నారు ముఖేశ్ అంబానీ. సుమారు నెల రోజుల పాటు దేశమంతా ఈ వేడుక గురించే మాట్లాడుకునే పరిస్థితి ఉందంటే ఎంతలా జరుగుతుందోఅర్థం చేసుకోవచ్చు. అనంత్ అంబానీ....రాధికా మర్చంట్ల వివాహం శుక్రవారం జరగనున్న సంగతి తెలిసిందే. ముంబయిలోని జియో వరల్డ్ సెంటర్లో ఈ వేడుక నిర్వహించనున్నారు. ఈ వివాహ వేడుకకు దేశ విదేశాల నుంచి ప్రముఖ నటీనటులు, రాజకీయ నేతలు, పారిశ్రామిక వేత్తలు అతిథులుగా హాజరుకానున్నారు. ఇప్పటికే చాలా మంది వీవీఐపీలు ముంబైకి చేరుకున్న సంగతి తెలిసిందే. ఇదే వివాహానికి మాజీ సీఎం వైఎస్ జగన్, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్లు ఒకే వేదికపైకి రాబోతున్నారు. అనంత్ అంబానీ–రాధికా మర్చంట్ వివాహ వేడుకలకు సంబంధించి ఇప్పటికే దేశ విదేశాల నుంచి సెలబ్రిటీలు తరలివచ్చారు. వీరి కోసం ముంబై లోని స్టార్ హోటల్స్లో విడిది ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. అంతేకాదు అతిథులను వివాహ వేదిక వద్దకు తరలించేందుకు 3 ఫాల్కన్ 2000 జెట్ విమానాలను సైతం అంబానీ ఫ్యామిలీ అందుబాటులో ఉంచింది. ఈ పెళ్లి కోసం అంబానీలు చేస్తున్న హంగామా అంతా ఇంతా కాదు. రిలయన్స్ ఇండస్ట్రీస్లో పని చేస్తున్న ఉద్యోగులకు ప్రత్యేక పెళ్లి కానుకలు పంపించారు. ఈ సందర్భంగా రిలయన్స్ సంస్థల అధిపతి ముఖేష్ అంబానీ తమకు పంపిన వెడ్డింగ్ గిఫ్టుకు సంబంధించిన ఫోటోలను ఉద్యోగులు సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తున్న సంగతి తెలిసిందే. ఇకపోతే ప్రతీ ఉద్యోగికి ఎరువు రంగు కలిగిని గిఫ్ట్బాక్స్ అందజేశారు. ఎరువు రంగు బాక్సు పై బంగారు వర్ణంలో వధూవరుల పేర్లు పొందుపరిచారు. బాక్సు లోపల నాలుగు రకాల మిఠాయిలు, తినుబండారాలు ఉన్నాయి. ఆలూ భుజియా, సేవ్, చిడ్వాతో పాటు వెండి నాణాన్ని సైతం ఉద్యోగులకు అంబానీ ఫ్యామిలీ అందజేసింది. ఇదిలా ఉంటే అనంత్ అంబానీ–రాధికా మర్చంట్ వివాహ వేడుకల్లో భాగంగా అంబానీ ఫ్యామిలీ పలు అద్భుతమైన కార్యక్రమాలు చేపట్టింది. ఇందులో భాగంగా జూలై 2వ తేదీన 50 జంటలకు అంబానీ కుటుంబం సామూహిక వివాహాలు జరిపించింది. ఈ సందర్భంగా నూతన వధూవరులకు లక్ష రూపాయల చెక్, ఏడాదికి సరిపడా సరుకులు అందించి ఆశీర్వదించిన సంగతి తెలిసిందే. అంతేకాదు ముంబైలోని స్వగృహం ఆంటిలియాలో అన్నదాన కార్యక్రమం సైతం నిర్వహించింది. గుజరాత్లోని జామ్ నగర్లో నిర్వహించిన ముందస్తు పెళ్లి వేడుకల్లో అక్కడి గ్రామల ప్రజలకు సైతం విందు ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే.

## మంత్రి పార్థసారథిని మర్యాద పూర్వకంగా
# కలిసిన డైరెక్టర్ హిమాన్షు శుక్ల



విజయవాడ,12 జూలై: రాష్ట్ర సమాచార శాఖ సంచాలకులు గా నియమితులైన హిమాన్షు శుక్ల శుక్రవారం విజయవాడ కమీషనర్ సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయంలో డైరెక్టర్ గా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం తాడిగడపలోని రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు,గృహ నిర్మాణ శాఖామాత్యులు కొలుసు పార్థ సారథిని వారి క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసారు.

# ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ హెల్త్ స్కీం పొడిగింపు

**శ్రీ హిమాన్షు శుక్లా, డైరెక్టర్, సమాచార, పౌర సంబంధాల శాఖ**

ఏపీ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి: రాష్ట్ర ప్రభుత్వం వర్కింగ్ జర్నలిస్టు హెల్త్ స్కీం పథకాన్ని 2024–25 ఆర్థిక సంవత్సరానికి పొడిగిస్తూ 12.07.2024న జీవో యం.యస్ నెం. 82 ను జారీ చేసినట్లు సమాచార, పౌర సంబంధాల శాఖ డైరెక్టర్ శ్రీ హిమాన్షు శుక్లా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వర్కింగ్ జర్నలిస్టుల హెల్త్ స్కీం () పొడిగింపునకు సమాచార, పౌర సంబంధాల శాఖ ప్రతిపాదనలు పంపించగా ప్రభుత్వం ఆమోదం తెలిపిందని వివరించారు. జర్నలిస్ట్ హెల్త్ స్కీమ్ ద్వారా జర్నలిస్టులు, వారిపై ఆధారపడ్డ కుటుంబ సభ్యులకు ఏదైనా అనుకోని అనారోగ్యం సంభవించిన ప్రతిసారి రూ. 2 లక్షల వరకు విలువ చేసే వైద్యసేవలు అందుతాయని, ఇలా సంవత్సర కాలంలో ఎన్నిసార్లైనా పరిమితులు లేకుండా ఈ సదుపాయాన్ని అందిస్తారని తెలిపారు.

వర్కింగ్ జర్నలిస్ట్ హెల్త్ స్కీమ్ ద్వారా జర్నలిస్టులు ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ () తరహాలో వైద్య సేవలు పొందవచ్చన్నారు. వర్కింగ్ జర్నలిస్ట్ హెల్త్ స్కీమ్ ద్వారా పొందే వైద్యసేవల విషయంలో ఎలాంటి ఆదాయ పరిమితులు లేవని, అదే విధంగా నిర్దేశిత చికిత్సలకు సంబంధించి ఉచిత ఓపీ సేవలు పొందవచ్చని ఆయన వివరించారు. ఈ పథకానికి డా. నందమూరి తారకరామారావు వైద్య సేవ ట్రస్ట్ ఇంప్లిమెంటింగ్ ఏజెన్సీగా అదే విధంగా సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్ నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తాయని ఆయన పేర్కొన్నారు. అక్రిడిటేషన్ పొందిన జర్నలిస్టులందరూ ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని డైరెక్టర్ శ్రీ హిమాన్షు శుక్లా ప్రకటనలో స్పష్టం చేశారు.

# తిరుమల కొండపై విరిగిపడ్డ చెట్టుకొమ్మ

- యువతికి తీవ్ర గాయాలు
- జాపాలి తీర్థంలో ఆంజనేయ స్వామి ఆలయం వద్ద ఘటన
- భక్తులపై ప్రాంక్ వీడియో - టీటీడీ సీరియస్



తిరుపతి : తిరుమలలో శుక్రవారం ఉదయం ప్రమాదం జరిగింది. జాపాలి తీర్థంలో ఆంజనేయ స్వామి దర్శనానికి వెళ్తున్న ఓ యువతిపై చెట్టుకొమ్మ విరిగి పడింది. ఈ ఘటనలో ఆమె తల, వెన్నెముకకు తీవ్ర గాయాలు కాగా.. స్థానికులు బర్డ్ ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంతో తోటి భక్తులు ఆందోళన చెందారు. ఈ ప్రమాదాన్ని మరో భక్తులు సెల్ ఫోన్లో చిత్రీకరించగా ఆ దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్గా మారాయి. అటు, తిరుమలలో భక్తుల మనోభావాలు దెబ్బతీసేలా ఓ ట్యూబర్ చేసిన ప్రాంక్ వీడియోలపై టీటీడీ సీరియస్ అయ్యింది. ఇద్దరిపై చర్యలకు ఉపక్రమించింది. కొద్ది రోజుల కిందట తమిళనాడుకు చెందిన టీటీఎఫ్ వాసన్, అతని మిత్రులు తిరుమల వచ్చారు. వాసన్ మిత్రుడు ఒకరు నారాయణగిరి షెడ్లలోని క్యూ లైన్లో వెళ్తూ.. కంపార్ట్మెంట్ తాళాలు తీసే ఉద్యోగిలా నటించాడు.

కంపార్ట్మెంట్ గేట్ తాళాలు తీస్తున్నారని నమ్మిన భక్తులు ఒక్కసారిగా లేచి అటు వెళ్లబోయారు. వెను వెంటనే వారిద్దరూ వెకిలిగా నవ్వుతూ పరుగులు తీశారు. ఈ తతంగాన్ని వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. ఈ వీడియో తమిళనాడులో వైరల్గా మారింది. ఈ క్రమంలో భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అటు, దీనిపై విమర్శలు రావడంతో టీటీడీ స్పందించింది. నిందితులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. వాసన్ సహా ఈ వీడియో తీసిన వ్యక్తిని పట్టుకునేందుకు ఓ బృందాన్ని తమిళనాడు పంపినట్లు తెలుస్తోంది.

# ఆగస్టు 15న ఏపీకి అన్న కేంటిన్ల రీఎంట్రీ

- నిరుపేదల ఆకలి తీర్చిన అన్న క్యాంటిన్లు
- జగన్ సర్కారు నిర్లక్ష్యంగా తొలగింపు
- దేశం శ్రేణులు అన్నం పెట్టాలని చూసినా కేసులు
- ఎన్డీఏ సర్కారు రాకతో మళ్లీ పునర్వైభవం
- విరాళాలకు ఆదాయ పన్ను మినహాయింపు కూడా

అమరావతి... అన్ని దానాల కన్నా అన్నదానం మిన్న అన్నారు పెద్దలు. ఎదుటి వారికి ఏం దానం ఇచ్చినా సంతృప్తి చెందనివారు అన్నదానం చేస్తే తృప్తిగా భోజనం చేసి మనలను చల్లగా ఉండాలని దీవించి వెళతారు. అందుకే మనం ఏ శుభకార్యం చేసినా ఇంట్లో అశుభకార్యం చేసినా బంధుమిత్రులకు అన్నదానం చేస్తుంటాం. దేశంలోని ప్రధాన దేవాలయాలలో కూడా నిత్యాన్నదానంతో భక్తులను ఐహికానందాన్ని కలిగిస్తుంటారు. ఒకప్పుడు తమిళనాట అమ్మ క్యాంటిన్లకు విశేషాదరణ లభించింది. నాటి దివంగత తమిళనాడు ముఖ్యమంత్రి జయలలిత ఈ పథకాన్ని యావత్ దేశానికే గర్వకారణంగా మలిచింది. ఆమె ఇచ్చిన స్ఫూర్తితో దేశంలో పలు రాష్ట్రాలు ఈ పథకాన్ని నడిపాయి. స్వర్గీయ ఎన్టీఆర్ కూడా రెండు రూపాయలకే కిలో బియ్యం పథకాన్ని విజయవంతంగా కొనసాగించి పేదల ముఖ్యమంత్రిగా పేరు తెచ్చుకున్నారు. కేసీఆర్ హయాంలో తెలంగాణలో అన్నపూర్ణ క్యాంటిన్లు కేవలం రూ.5 కే భోజనం అందించే కార్యక్రమం నడిపారు. ఇక ఏపీ విషయానికి వస్తే గతంలో చంద్రబాబు అధికారం లో ఉన్నప్పుడు అన్న క్యాంటిన్లు ఎంతో మంది పేదల ఆకలిని తీర్చాయి. రోజు కూలీలు, ఆటో డ్రైవర్లు, నిరుద్యోగ యువకులు ఇలా చాలా మందికి అన్న క్యాంటిన్లు ఆకలి బాధలు తీర్చే సెంటర్లుగా మారాయి.అయితే వైఎస్ఆర్సీపీ అధికారంలోకి వచ్చాక తెలుగుదేశం పథకాలన్నీ ఒక్కొక్కటిగా తీసేస్తూ వచ్చారు. అదే క్రమంలో అన్న క్యాంటీన్లను పూర్తిగా ఎత్తేశారు. దీనిపై వచ్చిన విమర్శలను సైతం జగన్ సర్కార్ పట్టించుకోలేదు.



కేవలం రాజకీయ కక్ష సాధింపు చర్యలలో భాగంగానే అన్న క్యాంటిన్లు మూసివేశారు.కాగా మీ రాజకీయాల మధ్య మిమ్మల్ని ఎందుకు బలిచేస్తున్నారంటూ నిరుద్యోగులు, చిరుద్యోగులు జగన్ సర్కార్ ను నిలదీశారు అయినా ఫలితం శూన్యం. రీసెంట్ గా అధికార పగ్గాలు చేపట్టింది తెలుగు దేశం ప్రభుత్వం. మళ్లీ అన్న క్యాంటిన్లు తెరిపిస్తామని ఎన్నికల ప్రచారంలో చేసిన వాగ్దానం ప్రకారం మళ్లీ అన్న క్యాంటిన్లకు మహర్ధశ రానుంది. అన్న క్యాంటిన్లను తిరిగి ఆగస్టు 15 లోగా తెరవాలని టీడీపీ సర్కార్ భావిస్తోంది. తొలి దశలో 183 క్యాంటిన్లను ప్రారంభించాలని సన్నాహాలు చేస్తోంది. ఇప్పటికే టెండర్లు పిలిచి సాధ్యమైనంత త్వరలో ఈ కార్యక్రమాన్ని ఆరంభించాలని భావిస్తోంది. అప్పుడు అధికారంలో ఉన్నప్పుడు విజయవంతంగా నడిచిన అన్న క్యాంటిన్లు కొన్నింటికి శాశ్వత భవనాలు ఏర్పాటు చేశారు. అయితే అవన్నీ ఇన్నాళ్లుగా మూతపడి శిథిలావస్థలో ఉన్నాయి. మళ్లీ వాటిని వునరుద్ధరించాలని అధికారులను ఆదేశించింది. స్వచ్ఛంద సంస్థలు, ప్రజల నుంచి అన్న క్యాంటిన్లకు విరాళాలు సేకరించాలనే లక్ష్యం పెట్టుకుంది. ఇందుకు ఎన్ఆర్ఐలు కూడా విదేశాలనుంచి భారీగా విరాళాలు పంపినట్లు సమాచారం. పైగా అన్నదానానికి విరాళాలు ఇచ్చే దాతలకు ఆదాయపన్ను మినహాయింపు ఇచ్చే యోచనలో ఏపీ ప్రభుత్వం ఉన్నట్లు సమాచారం.

# అమరావతి నిర్మాణాలపై అధ్యయనం

- పటిష్ఠతపై నిర్ధారణ బాధ్యతలు ఐఐటి చెన్నైకి
- మంత్రి నారాయణ అధికారులతో సమీక్ష
- లేఖ రాయాలని ప్రభుత్వం కీలక నిర్ణయం



అమరావతి: రాజధానిలో నిర్మాణాలపై రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం ఉన్న నిర్మాణాల పటిష్టతపై అధ్యయనం చేయాలని ఆదేశించింది. ఏఐఎస్లు, ఎన్జీవోల సముదాయాలు, సచివాలయాల ఐకానిక్ టవర్లు, అసెంబ్లీ భవనాల బేస్మెంట్లపై అధ్యయనం చేయనున్నారు.

రాజధాని నిర్మాణాల స్థితిగతులపై శుక్రవారం సాయంత్రం మంత్రి నారాయణ అధికారులతో సమీక్షించారు. కట్టడాల పటిష్టత నిర్ధారణ బాధ్యతలు ఐఐటీ చెన్నైకి అప్పగించాలని నిర్ణయించారు. ఈ మేరకు ఐఐటీ చెన్నై, ఐఐటీ హైదరాబాద్ సంస్థలకు ప్రభుత్వం లేఖలు రాయనుంది.

# టిడిపిలో చేరేందుకు వైసిపి ఎమ్మెల్సీల మొగ్గు

## మంత్రుల చుట్టూ చక్కర్లు కొడుతున్న వైనం

అమరావతి ... రాష్ట్రంలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో అఖండ విజయాన్ని సాధించిన తెలుగుదేశం పార్టీ, జనసేన, బిజెపి కూటమి ప్రభుత్వం అసెంబ్లీలో పూర్తిస్థాయి మెజారిటీతో కొనసాగుతోంది. శాసనసభలో ఏ బిల్లు అయినా సులభంగా పాస్ చేసుకునే బలం కూటమికి ఉంది. గత ఐదేళ్లు అధికారాన్ని అనుభవించిన వైసీపీ దారుణ పరాభవంతో 11 సీట్లకు మాత్రమే పరిమితమైంది. అయితే, వైసీపీకి శాసనమండలిలో మాత్రం బలం ఉంది. రాష్ట్ర ప్రభుత్వం ఏవైనా కీలక బిల్లులను పాస్ చేయించుకోవాలంటే శాసన మండలిలో కూడా ఆమోదం తప్పనిసరి. ప్రస్తుత పరిస్థితుల్లో శాసనమండలిలో వైసీపీకి బలం ఉండడంతో అధికార కూటమి ప్రభుత్వానికి కొంత ఇబ్బంది తప్పదు అన్న విశ్లేషణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే కూటమి నేతలు శాసనమండలలోనూ బలం పెంచుకునే దిశగా అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది. తెలుగుదేశం పార్టీలో చేరేందుకు ఆసక్తి చూపిస్తున్న పలువురు ఎమ్మెల్సీలపై టిడిపి దృష్టి సారించినట్లు తెలుస్తోంది. గడిచిన ఐదేళ్లు అధికారం ఉన్నప్పటికీ తమను కనీసం పట్టించుకోలేదన్న భావన చాలా మంది ఎమ్మెల్సీలలో ఉంది. అటువంటి వారంతా ఇప్పుడు అధికార తెలుగుదేశం పార్టీ వైపు చూస్తున్నట్లు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో అటువంటి వారిపైన తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించి చేర్చుకునేందుకు ఆలోచన చేస్తున్నట్లు చెబుతున్నారు.

**మంత్రుల ద్వారా రాయబారం నెరవుతున్న ఎమ్మెల్సీలు..** వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్సీలుగా ఉన్నప్పటికీ కనీసం గౌరవం, గుర్తింపు దక్కకపోవడం పట్ల అవమాన భారంతో ఉన్న పలువురు ఎమ్మెల్సీలు ప్రస్తుత అధికార తెలుగుదేశం పార్టీలో చేరేందుకు సంసిద్ధులవుతున్నారు. ఈ క్రమంలోనే తమకు సన్నిహితంగా ఉండే మంత్రులు, ఎమ్మెల్యేల ద్వారా టిడిపిలో చేరేందుకు రాయబారాలను పంవుతున్నారు. ఇప్పటికే పలువురు ఎమ్మెల్సీలు ఈ మేరకు ప్రయత్నాలు చేస్తున్నారు. మంత్రులను కలిసి తమ ఆలోచనలను వారికి తెలియజేస్తున్నారు.

ఇప్పటికే ఐదుగురు ఎమ్మెల్సీలు తెలుగుదేశం పార్టీకి చెందిన కీలక నేతలు, మంత్రులను కలిసి మాట్లాడినట్లు చెబుతున్నారు. శాసనమండలి డిప్యూటీ చైర్మన్ జకియా ఖానం బుధవారం రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ ను కలవడం ప్రాధాన్యం సంతరించుకుంది. అధికారంలో ఉన్న ఐదేళ్లు తమకు ప్రాధాన్యం ఇవ్వలేదని, ఎమ్మెల్సీగా అవకాశం ఇచ్చి ఉద్ధరించామన్నట్టుగా చూశారని ఓ ఎమ్మెల్సీ ఈ సందర్భంగా వ్యాఖ్యానించడం గమనార్హం. అధికారంలో ఉన్నంతకాలం జగన్ తమతో ఒక్కసారి కూడా ప్రత్యేకంగా కూర్చుని మాట్లాడిన దాఖలాలు లేవని అసంతృప్త ఎమ్మెల్సీలు ప్రస్తావిస్తున్నట్లు చెబుతున్నారు. ఇటీవల ఎన్నికల్లో ఘోర పరాజయం తరువాత మాత్రమే జగన్ తమతో ప్రత్యేకంగా మాట్లాడినట్లు పలువురు పేర్కొంటున్నారు. ఇప్పుడు కూడా తమ అవసరం వచ్చింది కాబట్టి పిలిచారని, అది కూడా తమ గురించి కాకుండా మండలిలో తన కోసం నిలబడాలని చెప్పినట్లు పలువురు ఎమ్మెల్సీలు వ్యాఖ్యానిస్తున్నారు.

**అదే బాటలో మరింత మంది ఎమ్మెల్సీలు ..** ప్రస్తుతం ఐదుగురు ఎమ్మెల్సీలు తమకు తెలిసిన మంత్రుల ద్వారా టిడిపిలో చేరేందుకు రాయబారాలు నెరవుతున్నారు. ఇదే ఆలోచనలో మరింత మంది ఎమ్మెల్సీలు ఉన్నట్లు చెబుతున్నారు. కొంతమంది టిడిపి మంత్రుల ద్వారా పార్టీలో చేరేందుకు అవకాశం కల్పించాలంటూ కోరుతున్నారు. మరి కొంతమంది వచ్చి కలుస్తామంటూ మంత్రులకు వర్తమానాన్ని పంపిస్తున్నారు. అదే సమయంలో వైసీపీ మద్దతుతో గెలిచిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీల్లో కూడా ఇద్దరూ తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులతో టచ్ లోకి వెళ్లినట్లు చెబుతున్నారు. అయితే, ఎమ్మెల్సీలను పార్టీలో చేర్చుకునే విషయంలో తెలుగుదేశం పార్టీ ఆచితూచి వ్యవహరిస్తోంది. గడిచిన ఐదేళ్లలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలపై తీవ్ర స్థాయిలో వ్యాఖ్యానించిన, ఇబ్బందులకు గురి చేసిన వారి విషయంలో మాత్రం తెలుగుదేశం పార్టీ కఠినంగా ఉండాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. అటువంటి నాయకులను పార్టీలో చేర్చుకునేందుకు చంద్రబాబు కూడా ఆసక్తి చూపించడం లేదని ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఇదిలా ఉంటే తాజాగా వైసీపీలో ఎమ్మెల్సీలుగా ఎన్నికై ఎన్నికల సమయంలో ఆయా స్థానాలకు రాజీనామా చేసి పలువురు టిడిపిలో చేరారు. వీటిలో రెండు స్థానాలకు కొద్ది రోజుల కిందట అధికారులు ఎన్నికలు నిర్వహించేందుకు నోటిఫికేషన్ విడుదల చేశారు. అయితే, వైసీపీ నుంచి అభ్యర్థులెవరు నామినేషన్ దాఖలు చేయకపోవడంతో టిడిపి నుంచి సి రామచంద్రయ్య, జనసేన నుంచి హరిప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

# అప్రతిహతంగా మైత్రీ బంధం

- జనసేన నేతలకు కీలక పదవులు
- పవన్ సూచనలకు ప్రాధాన్యత ఇస్తున్నబాబు
- ఎమ్మెల్సీ, ఏఏజీల నియామకంలో జనసేకు ప్రాధాన్యత
- అన్ని సౌకర్యాలున్న భవనాన్ని క్యాంపు కార్యాలయంగా ఏర్పాటు
- టీడీపీ కార్యకర్తల దూకుడుకు కళ్లెం

ఏపీ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి: ఏమిటీ మైత్రీ బంధం...బాబు మారిపోయాడా? పవన్ పవర్ ప్రాబల్యమా? ఇది కూటమి ప్రభుత్వంలో వినపడుతున్న మాట. ఇది మరీ ముఖ్యంగా టీడీపీ నేతలు, కార్యకర్తల్లో హాట్ టాఫిక్ గా మారిపోయింది. బ్రహ్మ ముహూర్తంలో చంద్రబాబు పవన్ల మధ్య మైత్రీ బంధం ఏర్పడిందని, అది మున్ముందు అప్రతిహతంగా కొనసాగుతుందనే భావనకు వీరు వస్తున్నారు. పవన్ అభిప్రాయానికి సీఎం చంద్రబాబు విలువ ఇస్తుండటంతో జనసేనకులు కూడా సంతోషం వ్యక్తం చేస్తున్నారు. తమ కారణంగా ఇరువురి మధ్య మైత్రి చెదిరిపోకూడదని జనసేన నాయకులు, కార్యకర్తలు కోరుకుంటున్నారు. కొన్ని నియోజకవర్గాల్లో ఇసుకు రీచ్ ల వద్ద, ప్రొక్లయిన్ల ఏర్పాటు విషయంలో టీడీపీ కార్యకర్తల్ హల్ చల్ చేస్తున్నా, జనసేన నాయకులు సంయమనం పాటిస్తున్నారు. టీడీపీలోని సీనియర్లు, కమ్మ సామాజిక వర్గంలోని పెద్దలు టీడీపీ కార్యకర్తల దూకుడుకు కళ్లెం వేస్తున్నారు. ఏపీలో తాజా ఎన్నికల్లో తమతో జట్టు కట్టడమే కాకుండా కూటమి ఏర్పాటులోనూ కీలకంగా మారి ఘన విజయం సాధించడంలో పవన్ పోషించిన పాత్రను గుర్తు చేస్తున్నారు. ఇంతకంటే ముందు మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డిని తక్కువగా అంచనా వేయలేమని, మొండివాడు, ఆర్థికంగా బలవంతుడని, ఏదైనా సాధించే సత్తా ఉందనే విషయాన్ని మర్చిపోకూడదంటూ హిత బోధన చేస్తున్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు అధ్వాన్నంగా ఉన్న ప్రస్తుత పరిస్థితుల్లో వాటిని చక్కదిద్దుకోడానికి చంద్రబాబుకు సమయం ఉండేలా మీరు నడుచుకోవాలని, అధికారం వచ్చిందని జనసేన పై దూకుడుగా వెళితే మనకే నష్టమని చెబుతున్నారు. ఈ నేపథ్యంలోనే పవన్ కళ్యాణ్ కు ప్రభుత్వంలో ఎక్కడా ప్రాధాన్యం తగ్గకుండా సీఎం చంద్రబాబు చూసుకుంటున్నారు. మొన్నటి ఎంఎస్సీ ఎన్నికల్లో టీడీపీలో ఎంతో మంది సీనియర్ నాయకులు ఉన్నా, ఒక సీటు జనసేకు కేటాయించడం బాబు వ్యూహంలోనే భాగమేనంటున్నారు. వాస్తవంగా పిఠాపురం సీటును త్యాగం చేసిన వర్మ, వంగవీటి రాధా, దేవినేని ఉమా, నెట్టెం రఘురామ్, ధశరధ జనార్ధన్ వంటి సీనియర్లు ఎంతో మంది ఉన్నారు. అయితే వారందరనీ పక్కన పెట్టి జనసేనకు ఒకటి, టీడీపికి ఒక సీటును కేటాయించారు. పార్టీలో ఎక్కడా అసమ్మతి బయట పడకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. జనసేన పార్టీ నుంచి ఆపార్టీ అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ రాజకీయ కార్యదర్శి పిడుగు హరిప్రసాద్ కేటాయించారు. డిప్యూటీ సీఎం కార్యాలయంలో పని చేసే అధికారుల విషయంలోనూ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. పవన్ కోరిన విధంగా అధికారులను నియమిస్తున్నారు. పవన్ కళ్యాణ్ ఓఎస్డీగా యువ ఐఏఎస్ కృష్ణ చైతన్యను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. సాధారణంగా ఓఎస్డీలుగా గ్రూప్ 1 స్థాయి అధికారులు, ఆర్డీవోలను నియమిస్తుంటారు. కానీ తన తీరుతో జాతీయస్థాయిలో గుర్తింపు తెచ్చుకున్న యువ ఐఏఎస్ అధికారి కృష్ణ చైతన్యను ఓఎస్డీగా నియమించాలని పవన్ కల్యాణ్ కోరారు. దీనికి ఏపీ సీఎం చంద్రబాబు కూడా అనుమతించారు. ప్రస్తుతం కేరళ రాష్ట్ర కేడర్లో పని చేస్తున్న కృష్ణ చైతన్యను డిప్యూటేషన్పై ఏపీకి పంపించాలని కేరళ ప్రభుత్వానికి ఏపీ ప్రభుత్వం లేఖ రాసింది. ఓఎస్డీలుగా కె.వెంకటకృష్ణను ప్రభుత్వం నియమించింది. కె.వెంకటకృష్ణ ప్రస్తుతం జీఏడీలో అడిషనల్ సెక్రటరీగా పనిచేస్తున్నారు. మరో యువ అధికారి మధుసూదన్ను పవన్ కల్యాణ్కు ఓఎస్డీగా నియమించారు. కడప జిల్లా ఆర్డీవో పనిచేస్తున్న మధుసూదన్ను ఓఎస్డీగా నియమిస్తూ నాలుగు రోజుల క్రితం ఉత్తర్వులు కూడా జారీ చేశారు. తాజాగా కీలకమైన అదనపు అడ్వకేట్ జనరల్ పదవిని జనసేన పార్టీకి చెందిన ఇవన సాంబశివ ప్రతాప్ కు కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ప్రతాప్ నియామకానికి సంబంధించిన ఉత్తర్వులు విడుదల అయ్యాయి. జనసేన పార్టీ లీగల్ అడ్వైజర్ గా పదేళ్లుగ అంటపెట్టుకుని ఉన్న సాంబశివ ప్రతాప్ ను రాష్ట్ర ప్రభుత్వం తరవున హైకోర్టులో కేసుల్లో వాదించే ఏఏజీ పదవి ఇచ్చి గౌరవించారు. దీనిపై జనసేన నేతలు కూడా సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వీటన్నింటికీ ముందు పవన్ కళ్యాణ్ కు కేటాయించిన క్యాంపు కార్యాలయం కూడా చాలా అనువైనది. టీడీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ఇరిగేషన్ శాఖ మంత్రి దేవినేని ఉమా అన్ని నివాసానికి, అధికారిక సమావేశాలు నిర్వహించడానికి అనువుగా నిర్మించే ఏర్పాటు చేశారు. ఆ క్యాంపు కార్యాలయం కోసం వైసీపీ అధికారంలో ఉన్న సమయంలో సీనియర్ నాయకులు పోటీపడ్డారు. ఇప్పటి టీడీపీ ప్రభుత్వంలో సీనియర్ నాయకులు ఉన్నప్పటికీ చంద్రబాబు పవన్ కళ్యాణ్ కోసం ఆ భవనాన్ని క్యాంపు కార్యాలయంగా కేటాయించారు. పవన్ ప్రాధాన్యతకు ఏ మాత్రం భంగం కలగకుండా చంద్రబాబు చూసుకోవడం ఆ పార్టీలో చర్చనీయాంశంగా మారింది.


## ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
### స్పెషల్ కలెక్టర్ వారి కార్యాలయం,
### ఒంగోలు

Rc.నెం. C/129/2022, తేది: 12-07.2024

**ఫారం నెం.VII**

(2013 సం.వ 30 చట్ట వలన భూసేకరణ, పునరావాసం, పునఃస్థాపనలో న్యాయ పరమైన నష్ట పరిహారము పొందే హక్కు పారదర్శకత చట్టములోని సెక్షన్ 19(1) మరియు ఆంధ్రప్రదేశ్ నియమావళి 2014లో రూల్ 25, సబ్ రూల్ (1) ననుసరించి

**రూఢి ప్రకటన**

క్రింది షెడ్యూలులో నిర్దిష్ట పరచిన భూములను మరియు వాటి విస్తీర్ణములను ప్రజా ప్రయోజనమునకై అనగా కందుల ఓబులరెడ్డి గుండ్లకమ్మ రిజర్వాయర్ ప్రాజెక్టు నిర్మాణములోని దక్షిణ ధేనువకొండ గ్రామ ఆర్ అండ్ ఆర్ కాలనీ వాసులకు స్మశానము ఏర్పాటు చేయుట కొరకు మద్దిపాడు మండలం గార్లపాడు గ్రామ సర్వే నెం.146/1 నందు గల య.2.64 సెంట్లు భూమి కావలయునని శ్రీ స్పెషల్ కలెక్టర్ (భూసేకరణ), పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్ట్, ఒంగోలు వారు భావించుచున్నందున, 2013 సం.వ 30వ చట్టములోని 15 వ విభాగం ప్రకారము సదరు భూముల యందు వచ్చిన అభ్యంతరముల పై విచారణ జరిపిన పిమ్మట శ్రీ స్పెషల్ కలెక్టర్ (భూసేకరణ), పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్ట్, ఒంగోలు వారు సంతృప్తి చెంది ఈ దిగువ షెడ్యూలు ధాఖల భూములను ప్రజా ప్రయోజనముల నిమిత్తము భూసేకరణ గావించుటకు నిర్ణయించినారు.

**రూఢి ప్రకటన**

శ్రీయుత స్పెషల్ డిప్యూటి కలెక్టర్ (భూసేకరణ), ఒంగోలు వారు 2013 సం.వ 30 చట్టములోని 19(1) విభాగము ననుసరించి ఈ దిగువ నుదహరించి షెడ్యూలులో ధాఖలా భూములు మరియు షుమారుగా వాటి విస్తీర్షములను ప్రజా ప్రయోజనముకై అనగా కందుల ఓబులరెడ్డి గుండ్లకమ్మ రిజర్వాయర్ ప్రాజెక్ట్ నిర్మాణములో భాగముగా దక్షిణ దనువకొండ గ్రామ ఆర్ అండ్ ఆర్ కాలనీ వాసులకు స్మశానము ఏర్పాటు చేయుట కొరకు మద్దిపాడు మండలం గార్లపాడు గ్రామ సర్వే నెం.146/1 నందు గల య.2.64 సెంట్లు భూములు అవసరమైనవని ఇందు మూలముగా ప్రకటన చేసియున్నారు.

**షెడ్యూలు**

జిల్లా: ప్రకాశం మండలం: మద్దిపాడు గ్రామం : గార్లపాడు

| క్రమ సం | సర్వే నెం. | మొత్తం విస్తీర్ణము | తీసుకున్న విస్తీర్ణము ఎ.సెంట్లు | భూస్థితి | సంబంధిత ఆసామి పేరు మరియు చిరునామా | ఉత్తరం సర్వే నెం. స.డి. నెం. | దక్షిణం సర్వే నెం. స.డి. నెం. | తూర్పు సర్వే నెం. సడి.నెం. | పడమర సర్వే నెం. సడి.నెం. | రిమార్కులు |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | | | | 8 |
| 1 | 146/1 | 2.64 | 2.64 | మెట్ట | బసిరెడ్డి అంజి రెడ్డి తండ్రి రాజిరెడ్డి | 10 | 147 | 146/2 | దొడ్డవరం గ్రామ సరిహద్దు | |
| | | మొత్తము | 2.64 | | | | | | | |

స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మరియు భూసేకరణ అధికారి కందుల ఓబులరెడ్డి గుండ్లకమ్మ రిజర్వాయర్ ప్రాజెక్టు కార్యాలయము, ఒంగోలు నందు సదరు భూముల ప్లాను ఉంచినందున పని దినములలో కార్యాలయపు వేళల యందు పరిశిలించు కొనవచ్చును.

భూసేకరణ వలన పునరావాస పున:నిర్మాణము చేయవలసి వచ్చు కుటుంబముల సంఖ్య లేనందు వలన పునరావాస స్థలము గుర్తించ బడలేదు.

ప్రాజెక్ట్ నిర్మాణ దశలో అవసరమైన భాగములో గనులు మరియు ఖనిజములు త్రవ్వట/తొలగించుట/వినియోగించుట తప్ప భూసేకరణ షెడ్యూలు మిగిలిన భూములలో ఉన్న బొగ్గు గనులు, ఇనుప రాయి, పలక రాయి లేదా ఇతర ఖనిజములు అవసరము లేదు.

సం/- **శ్రీమతి కె. ఝాన్సీ లక్ష్మి,** M.A., స్పెషల్ కలెక్టర్ (భూ.సే), పి.యస్. వెలిగొండ ప్రాజెక్టు,



# ఫిలింఫేర్‌లో ఆర్ఆర్ఆర్ సంచలనం

## అదే బాటలో సీతారామం

## ఉత్తమ నటులుగా ఎన్టీఆర్, రామ్ చరణ్‌లు

**2023 సంవత్సరానికి గానూ 68వ ఫిల్మ్‌ఫేర్ సౌత్ అవార్డులను తాజాగా ప్రకటించారు. సౌత్‌లోని నాలుగు భాషల్లో 2023తో పాటు 2022లో థియేటర్లలో విడుదలైన చిత్రాల్ని లెక్కలోకి తీసుకుని అవార్డులని ప్రకటించారు. ఫిల్మ్ ఫేర్ అవార్డ్స్ సౌత్ 2023 తెలుగులో ఉత్తమ సినిమాగా బ్లాక్ బస్టర్ 'ఆర్ఆర్ఆర్' నిలచింది. దర్శకధీరుడు రాజమౌళి తెరకెక్కించిన బ్లాక్బస్టర్ చిత్రం ఆర్ఆర్ఆర్. ఈ సినిమా ఏకంగా ఆస్కార్ అవార్డును దక్కించుకున్న సంగతి తెలిసిందే.**

*బెస్ట్ ఒరిజినల్ సాంగ్ విభాగంలో నాటునాటు పాటకు స్కార్ను సొంతం చేసుకుంది. తాజాగా ఈ మూవీ మరో ఘనతను దక్కించుకుంది. ఈ సినిమాకు ఏకంగా 7 అవార్డులు వచ్చాయి. ఉత్తమ యాక్టర్గా ఎన్టీఆర్, రామ్చరణ్ సంయుక్తంగా ఆవార్డ్ అందుకోనున్నారు. 68వ ఫిల్మ్ఫర్ అవార్డ్లో ఉత్తమ దర్శకుడిగా రాజమౌళికి దక్కింది. ఆర్ ఆర్ ఆర్ వలె సీతారామం ఫిల్మ్ ఫేర్ అవార్డ్స్ లో హవా సాగించింది. ఉత్తమ మూవీ (క్రిటిక్స్) విభాగంలో క్లాసిక్ హిట్ 'సీతారామం'కు 5 అవార్డులు రాగా.. నక్సల్ నేపథ్యంలో వచ్చిన 'విరాట పర్వం'కు 2 అవార్డ్స్ దక్కాయి. ఇవాళ ప్రకటించిన తెలుగుతో పాటు తమిళ, కన్నడ, మలయాళ చిత్రాల విజేతలను కూడా ప్రకటించారు. ఏయే సినిమాకు అవార్డులు దక్కాయో ఫుల్ లిస్ట్ చూసేయండి.*

## తెలుగు

ఉత్తమ చిత్రం- ఆర్ఆర్ఆర్
ఉత్తమ దర్శకుడు- ఎస్ఎస్ రాజమౌళి
ఉత్తమ నటుడు- రామ్ చరణ్, జూనియర్ ఎన్టీఆర్(ఆర్ఆర్ఆర్)
ఉత్తమ చిత్రం (క్రిటిక్స్) - సీతారామం (హను రాఘవపూడి)
ఉత్తమ నటుడు (క్రిటిక్స్) - దుల్కర్ సల్మాన్
ఉత్తమ నటి - మృణాళ్ ఠాకూర్ (సీతారామం)
ఉత్తమ నటి (క్రిటిక్స్) -సాయి పల్లవి( విరాట్ పర్వం)
ఉత్తమ సహాయ నటుడు - రానా దగ్గుబాటి (భీమ్లా నాయక్)
ఉత్తమ సహాయ నటి - నందితాదాస్ (విరాట్ పర్వం)
ఉత్తమ మ్యూజిక్ ఆల్బమ్ - ఎం.ఎం.కీరవాణి (ఆర్ఆర్ఆర్)
ఉత్తమ సాహిత్యం - సిరివెన్నెల సీతారామశాస్త్రి (సీతారామం)
ఉత్తమ నేపథ్య గాయకుడు - కాలభైరవ (కొమురం భీముడో.. ఆర్ఆర్ఆర్)
ఉత్తమ నేపథ్య గాయని - చిన్మయి శ్రీపాద (ఓ ప్రేమ -సీతారామం)
ఉత్తమ కొరియోగ్రఫీ -ప్రేమ్ రక్షిత్ (నాటు నాటు.. ఆర్ఆర్ఆర్)
బెస్ట్ ప్రొడక్షన్ డిజైన్ - సాబు శిరిల్ (ఆర్ఆర్ఆర్)



## ఫిల్మ్‌ఫేర్ విగ్రహం

డ్యాన్స్ నంబర్‌లో చేతులు పైకి లేపి వేళ్లతో తాకుతున్న స్త్రీని వర్ణించే ప్రతిమను సాధారణంగా " ది బ్లాక్ లేడీ" (లేదా "ది లేడీ ఇన్ బ్లాక్") అని పిలుస్తారు. టైమ్స్ ఆఫ్ ఇండియా యొక్క ఆర్ట్ డైరెక్టర్ వాల్టర్ లాంగ్‌హమ్మర్ పర్యవేక్షణలో ఎన్‌జి పన్సారే రూపొందించారు , ఇది సాధారణంగా కాంస్యంతో తయారు చేయబడింది, దీని ఎత్తు 46.5 సెం.మీ మరియు దీని బరువు 5 కిలోలు.అవార్డుల 25వ సంవత్సరాన్ని పురస్కరించుకుని, విగ్రహాలను వెండితో తయారు చేశారు మరియు 50వ సంవత్సరాన్ని పురస్కరించుకుని బంగారంతో విగ్రహాలను తయారు చేశారు . ఫిల్మ్‌ఫేర్ ట్రోఫీని ది అవార్డ్ గ్యాలరీ 2000 నుండి తయారు చేస్తోంది. 2012 వరకు, ట్రోఫీలో కొన్ని మార్పులు మాత్రమే చేయబడ్డాయి. కానీ 2014 నాటికి, ట్రోఫీకి 3-డి రూపాన్ని అందించడానికి భారీ మార్పు చేయబడింది. ఈ మార్పుకు రెండు కారణాలు చెప్పబడ్డాయి. మొదటిది, నేటి ప్రపంచంలో సాంకేతికతలో అనేక పురోగతులతో సరిపోలడం అవసరమని నిర్వాహకులు విశ్వసిస్తున్నారు, ఇది రాబోయే సంవత్సరాల్లో కూడా చాలా అభివృద్ధి చెందుతుంది. ఇది కూడా ముంబైలోని ఫిల్మ్‌ఫేర్‌లో జరిగిన 2013 అవార్డుల సెట్ థీమ్‌తో సరిపోలడానికి చేసిన ప్రయత్నం:





## కన్నడ

ఉత్తమ చిత్రం -కాంతార
ఉత్తమ నటుడు- రిషబ్ షెట్టి (కాంతార)
ఉత్తమ నటి - చైత్ర జే అచార్
ఉత్తమ దర్శకుడు - కిరణ్ రాజ్ (777 ఛార్లీ)
ఉత్తమ సహాయ నటుడు- అచ్యుత్ కుమార్
ఉత్తమ సహాయ నటి - మంగళ
ఉత్తమ సంగీత దర్శకుడు - అజనీష్
ఉత్తమ గేయ రచయిత - నాగేంద్ర ప్రసాద్
ఉత్తమ గాయకుడు - సాయి విగ్నేశ్
ఉత్తమ గాయని- సునిధి చౌహాన్
ఉత్తమ చిత్రం (క్రిటిక్స్)- ధరణి మండల
ఉత్తమ నటుడు క్రిటిక్స్- నవీన్ శంకర్
ఉత్తమ నటి క్రిటిక్స్- సప్తమి గౌడ

## తమిళం




ఉత్తమ చిత్రం - పొన్నియిన్ సెల్వన్- 1
ఉత్తమ నటుడు- కమల్ హసన్ (విక్రమ్)
ఉత్తమ నటి- సాయి పల్లవి (గార్గి)
ఉత్తమ దర్శకుడు- మణి రత్నం (పొన్నియిన్ సెల్వన్ -1)
ఉత్తమ సంగీత దర్శకుడు- ఏఆర్ రెహమాన్ (పొన్నియన్ సెల్వన్- 1)
ఉత్తమ సహాయ నటుడు -(మేల్) కాళి వెంకట్
ఉత్తమ సహాయ నటి - ఊర్వశి
ఉత్తమ చిత్రం క్రిటిక్స్- కదైసి వ్యవసాయి
ఉత్తమ యాక్టర్ క్రిటిక్స్ - ధనుష్ (తిరు), మాధవన్(రాకెట్రీ)
ఉత్తమ నటి క్రిటిక్స్- నిత్యా మీనన్ (తిరు)
ఉత్తమ గేయ రచయిత- తమిరై
ఉత్తమ గాయకుడు- సంతోష్ నారాయణ్ (తిరు)
ఉత్తమ గాయని - అంతనా నంది
ఉత్తమ తొలి చిత్ర నటుడు- ప్రదీప్ రంగనాథ్
ఉత్తమ తొలి చిత్ర నటి - అదితి శంకర్ (విరుమన్)
ఉత్తమ సినిమాటోగ్రఫీ- సెంథిల్, రవి వర్మన్

## మలయాళం

ఉత్తమ చిత్రం- నా తన్ కేస్ కోడు
ఉత్తమ నటుడు- కుంచకో బోబన్
( నా థన్ కేస్ కోడు)
ఉత్తమ నటి - దర్శన రాజేంద్రన్
(జయజయజయజయహే)
ఉత్తమ దర్శకుడు- రతీస్ బాలకృష్ణన్
(నా థన్ కేస్ కోడు)
ఉత్తమ సహాయ నటుడు- ఇంద్రాన్స్ (ఉడల్)
ఉత్తమ సహాయ నటి -పార్వతి తిరువోతు (పుజు)
ఉత్తమ సంగీత దర్శకుడు- కైలాష్ మీనన్ (వాషి)
ఉత్తమ గేయ రచయిత- అరుణ్ అలత్
(హృదయం)
ఉత్తమ ప్లేబాక్ సింగర్ - ఉన్ని మీనన్
(భీష్మ పర్వం)
ఉత్తమ ప్లేబాక్ సింగర్ - మృదుల వారియర్
(పాథోన్పథం నోట్టండు)







## ఇంగ్లాండ్ మళ్లీ.. వరుసగా రెండోసారి ఫైనల్లో కేన్ బృందం

నిర్ణీత సమయం ముగియడానికి ఇంకొన్ని నిమిషాల సమయమే ఉంది. ఆ తర్వాత ఎలాంటి ఫలితం వచ్చేదో..! ఉత్కంఠభరితంగా సాగుతున్న సమయంలో ఓ చిన్న అవకాశం అతడికి వచ్చింది. అంతే బంతిని ఎంతో నేర్పుగా నెట్లోకి పంపి ఇంగ్లాండ్కు ఆనందాన్ని పంచాడు ఒలీ వట్కిన్స్. నెదర్లాండ్స్ను ఓడించి వరుసగా రెండోసారి యూరో ఫైనల్కు దూసుకెళ్లింది ఇంగ్లాండ్.
యూరో ఫుట్బాల్లో ఇంగ్లాండ్ అదరగొట్టింది. సెమీఫైనల్లో వెనుకబడ్డా, పుంజుకుని పైచేయి సాధించింది. ఆఖర్లో సబ్స్టిట్యూట్ ఆటగాడు ఒలీ వట్కిన్స్ గోల్తో 2–1తో నెదర్లాండ్స్పై విజయం సాధించింది. ఇంగ్లాండ్ తరఫున హారీ కేన్ (18వ), ఒలీ వట్కిన్స్ (90+1) చెరో గోల్ కొట్టగా.. నెదర్లాండ్స్ తరఫున నమోదైన ఏకైక గోల్ను జేవియర్ సిమన్స్ (7వ) సాధించాడు. గత యూరోలో రన్నరప్గా నిలిచిన ఇంగ్లాండ్.. ఈసారి ఫైనల్లో స్పెయిన్ను ఢీకొంటుంది.
ఆఖర్లో వచ్చి..: ఆసక్తికరంగా సాగిన సెమీఫైనల్లో ఆరంభంలో నెదర్లాండ్స్దే పైచేయి. ఆ జట్టు ఏడో నిమిషంలోనే గోల్ కొట్టి ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. సిమన్స్ బాక్స్ వెలుపలి నుంచి నెట్లోకి బంతిని కొట్టి.. ఇంగ్లాండ్కు షాకిచ్చాడు. కానీ పుంజుకున్న ఇంగ్లాండ్.. ప్రత్యర్థి డిఫెన్స్పై ఒత్తిడి పెంచింది. 11 నిమిషాల తర్వాత కెప్టెన్ కేన్ గోల్తో స్కోరు సమం చేసింది. పెనాల్టీ ద్వారా అతడు ఈ గోల్ సాధించాడు. ప్రశాంతంగా పని పూర్తి చేసిన కేన్.. ఇంగ్లాండ్ అభిమానులను సంతోషంలో ముంచెత్తాడు. మరో నిమిషంలోనే ఇంగ్లాండ్కు ఆధిక్యంలోకి వెళ్లే అవకాశమొచ్చింది. ఆ జట్టు ఆటగాడు ఫిల్ ఫోడెన్ డచ్ డిఫెండర్లను దాటుకుంటూ వెళ్లి గోల్ కొట్టినంత పనిచేశాడు. నిజానికి ఇంగ్లాండ్ ఆటగాళ్లు, అభిమానులు గోల్ అయిందనుకొని సంబరాలు చేసుకున్నారు. కానీ రిఫరీ గోల్ ఇవ్వలేదు. డచ్ డిఫెండర్ డెంజెల్ డమ్ఫ్రైస్.. బంతి గోల్ లైన్పై ఉండగా బయటికి తన్నేశాడు. నిబంధనల ప్రకారం బంతి మొత్తంగా గోల్ లైన్ దాటితేనే గోల్ ఇస్తారు. తొలి అర్ధభాగంలో ఇంగ్లాండ్ ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తే.. ద్వితీయార్ధంలో నెదర్లాండ్స్ ఎక్కువ నియంత్రణతో ఆడింది. ఇంగ్లాండ్ గోల్కీపర్ జోర్డాన్ పిక్ఫోర్డ్ గోడలా నిలవడంతో డచ్ జట్టు ఆధిక్యంలోకి వెళ్లలేకపోయింది. మ్యాచ్ అదనపు సమయంలోకి వెళ్లక తప్పదనిపించింది. కానీ స్టాపేజ్ టైమ్ మొదటి నిమిషంలో వట్కిన్స్ గోల్తో ఇంగ్లాండ్ విజయాన్నందుకుంది. మరో సబ్స్టిట్యూట్ పాల్మర్ నుంచి బంతిని అందుకున్న వట్కిన్స్.. దాన్ని నెట్లోకి కొట్టాడు.

# ఫిట్‌గా ఉంటే అన్ని ఫార్మాట్లు ఆడాల్సిందే

## టీమ్ ఇండియా ఆటగాళ్లకు గంభీర్ సందేశం



టీమ్ ఇండియా ఆటగాళ్లు మూడు ఫార్మాట్లలో కచ్చితంగా ఆడి తీరాల్సిందేనని కొత్త కోచ్ గౌతమ్ గంభీర్ స్పష్టమైన సంకేతాలు పంపాడు. అతడు తాజాగా ఓ స్పోర్ట్స్ ఛానెల్తో మాట్లాడుతూ ఈ మేరకు కీలక వ్యాఖ్యలు చేశాడు. గాయాలు ఆటగాళ్ల జీవితంలో ఓ భాగం. ఎవరైనా సరే మూడు ఫార్మాట్లు ఆడితే.. గాయపడతారు. విశ్రాంతి తీసుకొని కోలుకొన్న తర్వాత జట్టులోకి వస్తారు. అప్పుడు మాత్రం కచ్చితంగా మూడు ఫార్మాట్లు ఆడి తీరాల్సిందే. ఎవరో ఒకరికోసం అతడిని టెస్టుల్లో ఉంచుతున్నాం.. మరోచోట తీసుకోబోతున్నాం.. గాయాల తీవ్రత తగ్గించేందుకు, వర్క్లోడ్ మేనేజ్ చేయడానికి ప్రయత్నిస్తున్నామంటూ వ్యక్తుల కోసం పని చేయడాన్ని నేను పెద్దగా విశ్వసించను. ప్రొఫెషనల్ క్రికెటర్లను చూడండి.. వారికి చాలా స్వల్ప వ్యవధే లభిస్తుంది. మీరు దేశం కోసం ఆడాలనుకుంటే.. వీలైనంత ఎక్కువగా ప్రయత్నించండి. మీరు మంచి ఫామ్లో ఉన్నట్లైతే.. ఓ అడుగు ముందుకేసి అన్ని ఫార్మాట్లలో ఆడండి అని పేర్కొన్నాడు.
వాస్తవానికి ఇది గత కోచ్ ద్రవిడ్ శైలికి పూర్తిగా భిన్నమైంది. అతడు ఇన్స్యూరీ మేనేజ్మెంట్పై దృష్టిపెట్టేవాడు. హార్దిక్, బుమ్రా గాయపడిన వేళ వారిని కొంతకాలం ఆటకు దూరంగా ఉంచాడు. ఇక రోహిత్, విరాట్పై ఒత్తిడి తగ్గించేందుకు పొట్టి ఫార్మాట్కు దూరం పెట్టేవాడు.
క్రికెట్ ఒకళ్ల ఆటకాదు..
వ్యక్తి కంటే జట్టు ప్రయోజనాలపైనే ఆటగాళ్లు దృష్టిపెట్టాలని గౌతమ్ గంభీర్ పునరుద్ఘాటించాడు. ఒక్కటే సందేశం చెప్పదల్చుకొన్నాను. మీరు నిజాయతీగా ప్రయత్నించండి.. ఆడండి. మీ వృత్తిపై నిజాయతీగా ఉండండి. ఫలితాలు అవే వస్తాయి. నేను బ్యాటింగ్కు వెళ్లే సమయంలో ఫలితాల గురించి అస్సలు ఆలోచించను. ఇన్ని పరుగులు చేయాలని అనుకోను.. నా వృత్తిపై పూర్తి నిజాయతీతో ఆడతాను. సరైన పనులు చేయడానికి ప్రయత్నించాలి. ఏదైనా జట్టుకు ప్రయోజనకరమని నీ మనసు భావిస్తే.. ఆ విషయంలో ప్రపంచమంతా వ్యతిరేకమవుతుందనుకున్నా పట్టించుకోవాల్సిన అవసరం లేదు. నేను మైదానంలో ఎవరితో తలపడినా.. అది జట్టు కోసమే. అంతిమంగా ఇది టీమ్ అన్నదే ముఖ్యం.. అంతేకానీ, ఎవరో ఒకరిది కాదు. మీరు ఏ జట్టులో ఆడినా మైదానంలో ఆ జట్టు విజయం కోసమే ఆలోచించండి. టీమ్ స్పోర్ట్స్కు అది చాలా ముఖ్యం. కేవలం మీ గురించే ఆలోచించుకోవడానికి ఇది ఒకరు ఆడే ఆట కాదు అని గంభీర్ అభిప్రాయం వ్యక్తంచేశాడు.
మోర్కెల్ కోసం గంభీర్ రిక్వెస్ట్..?
టీమ్ ఇండియా బౌలింగ్ కోచ్గా దక్షిణాఫ్రికా సీమర్ మోర్నీ మోర్కెల్ పేరును పరిశీలించాలని కోచ్ గంభీర్ బీసీసీఐని కోరినట్లు సమాచారం. వినయ్ కుమార్, జహీర్ ఖాన్ తర్వాత ఈ రేసులోకి వచ్చిన మూడో పేరు ఇది. వన్డే ప్రపంచకప్ సమయంలో మోర్కెల్ పాక్ జట్టుకు సేవలు అందించాడు. ఆ టోర్నమెంట్ తర్వాత పీసీబీ అతడిని తొలగించింది.

# బాధపడొద్దు..

## ఆ ముగ్గురూ ఇంకా ఆడతారు



ఇటీవల జరిగిన టీ20 ప్రపంచకప్ (20 ) భారత్ క్రికెట్ అభిమానులకు ఎన్నో అనుభూతుల్ని మిగిల్చింది. 13 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ టీమ్ ఇండియా ప్రపంచకప్ గెలుచుకుంది. ఫైనల్ మ్యాచ్లో దక్షిణాఫ్రికాను చావుదెబ్బ కొట్టి.. కప్ సొంతం చేసుకున్న ఆ క్షణాల్లో సగటు క్రికెట్ అభిమానుల హృదయాలు ఆనందంతో ఉప్పొంగిపోయాయి. కానీ, కప్ సాధించిన నిమిషాల వ్యవధిలోనే కెప్టెన్ రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి, ఆల్ రౌండర్ రవీంద్ర జడేజా టీ20లకు రిటైర్మెంట్ ప్రకటించడం ఒకింత ఆవేదనకు గురి చేసింది. అయితే, భారత్ మాజీ క్రికెటర్, ఇటీవల జింబాబ్వే టూర్కు ప్రధాన కోచ్గా వ్యవహరించిన వీవీఎస్ లక్ష్మణ్ అలాంటి వారందరికీ కాస్త ఉపశమనం కలిగించే వార్త చెప్పారు. భారత్ క్రికెట్ను ఎంతో ఎత్తుకు తీసుకెళ్లిన ఈ త్రయం.. పొట్టి క్రికెట్ నుంచి వైదొలగినా.. వన్డే, టెస్ట్ ఫార్మట్లలో ఇంకొన్నాళ్లు కొనసాగుతారని తెలిపారు. విరాట్, రోహిత్, జడేజా అద్భుత నైపుణ్యం కలిగిన ఆటగాళ్లు. భారత్ క్రికెట్ పురోగతికి ఎంతో కృషి చేశారు. వారికి నా హృదయపూర్వక అభినందనలు. అద్భుతమైన ఆటతీరుతో.. యువ క్రికెటర్లకు మార్గదర్శకులుగా నిలిచారు. వారి ఆట ఎంతో మందికి ఆదర్శప్రాయం. గ్రౌండ్లో పక్కా ప్లాన్తో వ్యవహరించే ఈ ముగ్గురూ.. టీ20ల నుంచి వైదొలుగుతున్నారంటే.. అంతే ప్రణాళికతో మిగతా ఫార్మాట్లో కొనసాగేందుకు ఇప్పటికే సిద్ధమై ఉంటారని అనుకుంటున్నా. వాళ్లు వన్డే, టెస్ట్ ఫార్మాట్లలో ఇంకొన్నాళ్లు ఆడి దేశానికి మరిన్ని ట్రోఫీలు తీసుకొస్తారన్న నమ్మకం నాకుంది. వాళ్ల అద్భుత టీ20 కెరియర్కు అభినందనలు అని లక్ష్మణ్ అన్నారు. ఈ వీడియోను బీసీసీఐ తన అధికారిక ఎక్స్ ఖాతాలో పోస్టు చేసింది. మరోవైపు, కొత్త కోచ్ గంభీర్ నేతృత్వంలో టీమ్ ఇండియా శ్రీలంక పర్యటనకు వెళ్లనుంది. దీనికి సంబంధించిన జట్టును ఇంకా ప్రకటించలేదు.

# టెన్నిస్ రాకెట్ పట్టిఉంటే..



దిల్లీ: బ్యాడ్మింటన్ బదులు టెన్నిస్ను కెరీర్గా ఎంచుకుని ఉంటే తాను మరిన్ని గొప్ప విజయాలు అందుకునేదాన్నని భారత షట్లర్ సైనా నెహ్వాల్ తెలిపింది. బ్యాడ్మింటన్లో ప్రపంచ నంబర్వన్ ర్యాంకుతో పాటు ఒలింపిక్స్లో పతకం సాధించిన తొలి భారత క్రీడాకారిణిగా సైనా రికార్డులు సృష్టించింది. నా తల్లిదండ్రులు నన్ను టెన్నిస్లో చేర్చివుంటే బాగుండని కొన్నిసార్లు అనిపిస్తుంది. టెన్నిస్లో ఎక్కువ డబ్బు ఉంది. నా దగ్గర ఎక్కువ శక్తి ఉందని అనుకుంటున్నా. బ్యాడ్మింటన్లో కంటే టెన్నిస్లో మరింత గొప్పగా రాణించే అవకాశముండేది. బ్యాడ్మింటన్ ఆరంభించినప్పుడు నాకంటూ ఆదర్శం ఎవరూ లేరు. మరొకరిలా ప్రపంచ నంబర్వన్ కావాలని.. ఒలింపిక్స్ పతకం సాధించాలని.. అనుకునే పరిస్థితి అప్పుడు నాకు లేదు. నాకంటే ముందు ఎవరూ ఆ ఘనతలు అందుకోలేదు అని సైనా చెప్పింది.
అమెరికా బృందంలో అమ్మాయిలే ఎక్కువ
వరుసగా నాలుగో ఒలింపిక్స్కు అమెరికా జట్టు అబ్బాయిల కంటే అమ్మాయిల్ని ఎక్కువ సంఖ్యలో పంపిస్తోంది. పారిస్ ఒలింపిక్స్లో అమెరికా తరఫున 592 మంది క్రీడాకారులు బరిలో దిగుతున్నారు. అందులో 314 మంది మహిళలు కాగా 278 మంది పురుషులు. ఈ బృందంలో 110 స్వర్ణాలు గెలిచిన 66 మంది ఒలింపిక్ ఛాంపియన్లు ఉండటం విశేషం. డయానా టౌరాసి (బాస్కెట్బాల్), స్టీఫెన్ పీటర్స్, మెక్లైన్ వార్డ్ (ఈక్వెస్ట్రియన్)లకు అయిదు ఒలింపిక్స్లలో ఆడిన అనుభవం ఉండటం మరో విశేషం.
శ్రీలంకతో మూడేసి వన్డేలు, టీ20లు
దిల్లీ: శ్రీలంక పర్యటనలో భారత జట్టు మూడేసి వన్డేలు, టీ20లు ఆడనుంది. ఈ మ్యాచ్లకు పల్లెకెలె, కొలంబో ఆతిథ్యమిస్తాయని గురువారం బీసీసీఐ తెలిపింది. ఈనెల 26, 27, 29 తేదీల్లో పల్లెకెలెలో మూడు టీ20లు జరుగుతాయి. ఆగస్టు 1, 4, 7 తేదీల్లో మూడు వన్డేలకు కొలంబో ఆతిథ్యమిస్తుంది. ఇరు జట్లు కొత్త కోచ్ల ఆధ్వర్యంలోనే బరిలో దిగుతుండటం విశేషం. భారత్కు గౌతమ్ గంభీర్, శ్రీలంకకు సనత్ జయసూర్య నూతన కోచ్లుగా నియమితులయ్యారు.
టీమ్ఇండియా పాకిస్థాన్కు వెళ్లట్లేదు!
దిల్లీ: ఛాంపియన్స్ ట్రోఫీ కోసం పాకిస్థాన్లో టీమ్ఇండియా పర్యటించే అవకాశం లేనట్లే. వచ్చే ఏడాది జరిగే ఈ టోర్నీని హైబ్రిడ్ పద్ధతిలో నిర్వహించాలని ఐసీసీని బీసీసీఐ కోరనుంది. భారత్ ఆడే మ్యాచ్లను దుబాయ్ లేదా శ్రీలంకలో జరిగేలా షెడ్యూల్ రూపొందించాలని బీసీసీఐ ప్రతిపాదించాలని నిర్ణయించిందని సమాచారం.
బాబర్ సారథ్యంపై సందిగ్ధం
లాహోర్: పాకిస్థాన్ టెస్టు జట్టుకు షాన్ మసూద్ కెప్టెన్గా కొనసాగనున్నాడు. తీరికలేని అంతర్జాతీయ టెస్టు షెడ్యూల్ నేపథ్యంలో మసూద్పైనే పీసీబీ, కోచ్ జేసన్ గిలెస్పీ విశ్వాసం ఉంచారు. ఆగస్టు– జనవరిలో బంగ్లాదేశ్, ఇంగ్లాండ్, దక్షిణాఫ్రికా, వెస్టిండీస్లతో జరిగే టెస్టు సిరీస్లకు మసూద్ను కెప్టెన్గా కొనసాగించాలని సీనియర్ సభ్యులు, సెలెక్టర్లు, కోచ్లతో జరిగిన సమావేశంలో పీసీబీ నిర్ణయించింది. అయితే పరిమిత ఓవర్ల ఫార్మాట్లో బాబర్ అజాం సారథ్యంపై సందిగ్ధత నెలకొంది. సమావేశంలో బాబర్ కెప్టెన్సీపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని పీసీబీ వర్గాలు తెలిపాయి.
రేసింగ్ జట్టును కొన్న గంగూలీ
దిల్లీ: భారత మాజీ కెప్టెన్ సౌరభ్ గంగూలీ ఇండియన్ రేసింగ్ ఫెస్టివల్ (ఐఆర్ఎఫ్)లో భాగమయ్యాడు.
ఐఆర్ఎఫ్లో బరిలో దిగుతున్న కోల్కతా రాయల్ టైగర్స్ జట్టును గంగూలీ కొనుగోలు చేశాడు. ఈ ఏడాది ఆగస్టు– సెప్టెంబరులో జరిగే ఐఆర్ఎఫ్లో ఇండియన్ రేసింగ్ లీగ్ (ఐఆర్ఎల్), ఫార్ములా 4 ఇండియన్ ఛాంపియన్షిప్ (ఎఫ్4ఐసీ)లు భాగం. కోల్కతాతో పాటు హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, దిల్లీ, గోవా, కొచ్చి, అహ్మదాబాద్ జట్లు ఐఆర్ఎఫ్లో బరిలో దిగుతాయి. ఐఆర్ఎఫ్లో కోల్కతా రాయల్ టైగర్స్తో కలిసి ప్రయాణాన్ని ప్రారంభించడం సంతోషంగా ఉంది. మోటార్స్పోర్ట్స్ అంటే నాకెప్పుడూ ఇష్టమే. కోల్కతా జట్టుతో కలిసి దేశంలో మోటార్స్పోర్ట్స్ ఔత్సాహికుల్లో స్ఫూర్తి నింపుతాం అని గంగూలీ తెలిపాడు.

## ఫుట్‌బాల్ హీరో యమాల్‌కు వయసు కష్టాలు..

## 90 నిమిషాలు ఆడేందుకు నో పర్మిషన్



మ్యూనిక్: యూరో చరిత్రలోనే గోల్ కొట్టిన అత్యంత పిన్న వయస్కుడిగా సరికొత్త రికార్డు సృష్టించి.. టీనేజ్లోనే ఫుట్బాల్ ప్రపంచం దృష్టిని ఆకర్షించాడు లమిన్ యమాల్ యూరో కప్ 2024 ఫైనల్ మ్యాచ్కు ఒక్క రోజు ముందు 17వ ఏటలోకి అడుగుపెట్టబోతున్న ఈ యువ సంచలనం.. యూరో టోర్నీ ( 2024) లో మ్యాచ్లను పూర్తి సమయం ఆడకపోవడం గమనార్హం. జర్మనీ చట్టాల ప్రకారం అతడు పూర్తి సమయం గేమ్లో ఉండేందుకు కుదరట్లేదని స్పెయిన్ కోచ్ చెబుతున్నారు.
జర్మనీ కార్మిక చట్టాల ప్రకారం 18 ఏళ్ల లోపు వారు రాత్రి 8 గంటల (స్థానిక కాలమానంలో) తర్వాత పని చేసేందుకు వీల్లేదు. అథ్లెట్లకు కొంత మినహాయింపు ఉన్నప్పటికీ అది కూడా రాత్రి 11 గంటల వరకు మాత్రమే. ప్రస్తుతం యూరో 2024 జర్మనీ వేదికగా జరుగుతోంది. కొన్ని మినహా చాలా మ్యాచ్లు రాత్రి 9 గంటలకు మొదలయ్యాయి. బ్రేక్, ఎక్స్ట్రా టైమ్, పెనాల్టీ సమయం ఇవన్నీ కలిపి మ్యాచ్ పూర్తవడానికి రాత్రి 11 దాటుతోంది.
వయసు కొంచెం.. కిక్ ఘనం: ఎవరీ యమాల్..?
దీంతో గ్రూప్ దశలో స్పెయిన్ () ఆడిన పలు మ్యాచ్లో యమాల్ను మ్యాచ్ సెకండ్ హాఫ్లో వేరే ఆటగాడితో సబ్స్టిట్యూట్ చేయాల్సి వచ్చింది. ఒక్క జార్జియాతో మినహా ఏ మ్యాచ్లోనూ అతడు పూర్తి సమయం మైదానంలో లేడు. జులై 14న స్పెయిన్–ఇంగ్లాండ్ మధ్య జరిగే ఫైనల్ మ్యాచ్ కూడా రాత్రి 9 గంటలకు (స్థానిక కాలమానంలో) ప్రారంభం కానుంది. ఎలాంటి అడ్డంకులు లేకపోతే 11 గంటల్లోపే మ్యాచ్ పూర్తవుతుంది. అలా కాకుండా ఎక్స్ట్రా, పెనాల్టీలు ఇవ్వాల్సి వస్తే మాత్రం యమాల్ను ఆడించడం స్పెయిన్కు ఇబ్బందే. ఒకవేళ, 11 గంటల తర్వాత కూడా అతడు ఆడితే జర్మనీ నిబంధనల ప్రకారం స్పెయిన్ ఫుట్బాల్ అసోసియేషన్ 30వేల యూరోల జరిమానా చెల్లించాల్సి ఉంటుంది.
ఫ్రాన్స్తో జరిగిన సెమీస్ పోరుతో యమాల్ పేరు ప్రపంచమంతా మార్మోగిన సంగతి తెలిసిందే. ఆ మ్యాచ్ 21వ నిమిషంలో యమాల్ గోల్ కొట్టి స్పెయిన్ విజయానికి బాటలు పరిచాడు. కళ్లు చెదిరే రీతిలో 25 గజాల దూరం నుంచి టాప్ కార్నర్కు బంతిని కొట్టిన అతడిపై ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. అంతేనా.. కేవలం 16 ఏళ్ల 362 రోజుల వయసులోనే గోల్ కొట్టి సరికొత్త చరిత్ర లిఖించాడు.


## ఫైనల్లో పావోలిని, క్రెజికోవా



ఇటలీ అమ్మాయి జాస్మిన్ పావోలిని అదరగొట్టింది. హోరాహోరీ పోరులో వెకిచ్ను ఓడిస్తూ వింబుల్డన్ మహిళల సింగిల్స్ ఫైనల్కు దూసుకెళ్లింది. ఈ టోర్నీలో ఫైనల్ చేరిన తొలి ఇటలీ అమ్మాయిగా ఆమె ఘనత సాధించింది. టైటిల్ కోసం ఆమె క్రెజికోవాతో తలపడనుంది. క్రెజికోవా సెమీస్లో నాలుగో సీడ్ రిబకినాపై గెలిచింది.
లండన్ ఏడో సీడ్ పావోలిని, క్రెజికోవా వింబుల్డన్ మహిళల సింగిల్స్ ఫైనల్లో అడుగుపెట్టారు. గురువారం రసవత్తరంగా సాగిన సెమీఫైనల్లో పావోలిని 2–6, 6–4, 7–6 (8)తో అన్సీడెడ్ డోనా వెకిచ్ (క్రొయేషియా)పై విజయం సాధించింది. పోరాటపటిమను ప్రదర్శించిన పావోలిని వెనుకబడుతూ, పుంజుకుంటూ పైచేయి సాధించింది. సెరెనా విలియమ్స్ (2016) తర్వాత ఒకే సీజన్లో ఫ్రెంచ్ ఓపెన్, వింబుల్డన్ ఫైనల్ చేరిన తొలి మహిళగా నిలిచింది. గత నెలలో ఫ్రెంచ్ ఓపెన్ ఫైనల్లో స్వైటెక్ చేతిలో పావోలిని ఓడిపోయింది. ఇప్పుడు వెకిచ్తో సెమీస్లో పావోలిని 5 ఏస్లు, 26 విన్నర్లు కొట్టింది. ఆమె కన్నా వెకిచ్ ఎక్కువ విన్నర్లు (42), ఎక్కువ ఏస్లు (7) కొట్టినా.. 57 అనవసర తప్పిదాలతో మూల్యం చెల్లించుకుంది. పావోలిని కేవలం 32 అనవసర తప్పిదాలే చేసింది. ఈ మ్యాచ్లో మొదట వెకిచ్దే ఆధిపత్యం. అయిదు, ఏడో గేముల్లో బ్రేక్లు సాధించడం ద్వారా ఆమె తొలి సెట్ను చేజిక్కించుకుంది. రెండో సెట్లో సర్వీసులు నిలబెట్టుకుంటూ సాగిన క్రీడాకారుణులు ఇద్దరూ ఓ దశలో 4–4తో సమంగా నిలిచారు. 9వ గేమ్లోనూ సర్వీసు కాపాడుకున్న పావోలిని.. తర్వాతి గేమ్లో ప్రత్యర్థి సర్వీసును బ్రేక్ చేసి సెట్ను చేజిక్కించుకుంది. మూడో సెట్ హోరాహోరీగా, నాటకీయకంగా సాగింది. తొలి గేమ్లోనే సర్వీసు కోల్పోయి వెనుకబడ్డ పావోలిని, ఆరో గేమ్లో బ్రేక్ సాధించి 3–3తో స్కోరు సమం చేసింది. కానీ వెంటనే సర్వీసు కోల్పోయింది. వెకిచ్ సంతోషం ఎంతో సేపు నిలవలేదు. ఎనిమిదో గేమ్లోనే తిరిగి బ్రేక్ సాధించిన పావోలిని మళ్లీ స్కోరు సమం చేసింది. ఆ తర్వాత క్రీడాకారిణులిద్దరూ సర్వీసులు నిలబెట్టుకోవడంతో టైబ్రేక్ తప్పలేదు. టైబ్రేక్లో పావోలిని పైచేయి సాధించి సెట్ను, మ్యాచ్ను గెలుచుకుంది. మరో సెమీస్లో క్రెజికోవా 3–6, 6–3, 6–4తో రిబకినాను ఓడించింది. ఫైనల్ శనివారం జరుగుతుంది. ముసెట్టి ముందుకు..: పురుషుల విభాగంలో లొరెంజో ముసెట్టి (ఇటలీ) సెమీఫైనల్కు దూసుకెళ్లాడు. అయిదుసెట్ల పాటు సాగిన క్వార్టర్ఫైనల్లో అతడు 3–6, 7–6 (5), 6–2, 3–6, 6–1తో 13వ సీడ్ టేలర్ ఫ్రిట్జ్ (అమెరికా)పై విజయం సాధించాడు. 22 ఏళ్ల ముసెట్టికి కెరీర్లో ఇదే తొలి గ్రాండ్స్లామ్ సెమీఫైనల్. ముసెట్టి ఇంతకుముందెప్పుడూ ఏ గ్రాండ్స్లామ్ టోర్నీలోనూ నాలుగో రౌండ్ దాటలేదు.

# ఎన్ని పట్టుకొస్తారో?






అప్పటి భారత రెజ్లింగ్ సంఘం అధ్యక్షుడిపై అగ్రశ్రేణి రెజ్లర్ల ఉద్యమం.. ఒక్కసారిగా దేశంలో రెజ్లింగ్ కార్యకలాపాలపై ప్రతిష్టంభన. ట్రయల్స్ లేవు. పోటీలు లేవు. అంతర్జాతీయ పోటీల బహిష్కరణ. దాదాపు ఏడాది పాటు ఇదే పరిస్థితి. కానీ ఇప్పుడు దృష్టి మరోసారి మ్యాట్ మీదకు మళ్లుతోంది. పారిస్ ఒలింపిక్స్ దగ్గర పడుతుండటంతో రెజ్లింగ్లో వచ్చే పతకాలపై చర్చ సాగుతోంది. ఒలింపిక్స్లో దేశానికి పతకాలు అందించడంలో ముందుండే రెజ్లర్లు ఈ సారి కూడా అంచనాలు పెంచేస్తున్నారు. వినేశ్ ఫొగాట్, అంతిమ్ పంగాల్, అన్షు మలిక్, అమన్ సెహ్రావత్ ఆశలు కలిగిస్తున్నారు.
ఒలింపిక్స్లో వ్యక్తిగత విభాగంలో దేశానికి పతకాలు అందించే క్రీడాంశాల్లో రెజ్లింగ్ కూడా ముఖ్యమైంది. ఇప్పటివరకూ ఇందులో దేశానికి రెండు రజతాలు, అయిదు కాంస్యాలు దక్కాయి. 2008 నుంచి కనీసం ఒక పతకమైనా ఖాతాలో చేరుతోంది. టోక్యోలో రవి దహియా రజతం, బజ్రంగ్ కాంస్యం నెగ్గారు. కానీ ఈ సారి వీళ్లు అర్హత సాధించలేదు. అయినా పారిస్లో పతకాల పట్టు పట్టేందుకు ఆరుగురు భారత రెజ్లర్లు సిద్ధమవుతున్నారు. హరియాణాకే చెందిన వినేశ్ ఫొగాట్ (50 కేజీలు), అంతిమ్ పంగాల్ (53), అన్షు మలిక్ (57), నిషా దహియా (68), రీతిక హుడా (76), అమన్ సెహ్రావత్ (57) సమరానికి సై అంటున్నారు.
యువ జోరు
యువ రెజ్లర్లు అంతిమ్, అన్షు కూడా పతక ఆశలు రేపుతున్నారు. ప్రపంచ రెజ్లింగ్ వేదికపై 19 ఏళ్ల అంతిమ్ సంచలన ప్రదర్శనతో దూసుకెళ్తోంది. 2022లో అండర్–20 ప్రపంచ ఛాంపియన్గా నిలిచిన తొలి భారత రెజ్లర్గా చరిత్ర సృష్టించిన ఆమె.. గతేడాది ఆ టైటిల్ను నిలబెట్టుకోవడం విశేషం. మ్యాట్పై వేగంగా కదులుతూ ప్రత్యర్థిని పడగొట్టే అంతిమ్ ఒలింపిక్స్లోనూ పతకం గెలవాలనే లక్ష్యంతో ఉంది. 22 ఏళ్ల అన్షుపైనా భారీగానే అంచనాలున్నాయి. ప్రపంచ ఛాంపియన్షిప్లో రజతం గెలిచిన తొలి భారత రెజ్లరైన ఆమె.. టోక్యో ఒలింపిక్స్లో ఒత్తిడికి చిత్తయింది. ఇప్పుడు మరింత పరిణతితో, ఆత్మవిశ్వాసంతో పారిస్ విమానమెక్కనుంది. 76 కేజీల విభాగంలో ఒలింపిక్స్కు అర్హత సాధించిన భారత తొలి రెజ్లర్గా నిలిచిన అండర్–23 ప్రపంచ ఛాంపియన్ రీతిక, అండర్–23 ప్రపంచ ఛాంపియన్షిప్స్ కాంస్య విజేత నిషా కూడా స్థాయికి తగ్గ ఆటతీరు ప్రదర్శిస్తే పతకాలు గెలిచే అవకాశముంది.
ఒకే ఒక్కడు: పురుషుల రెజ్లింగ్లో ఈ సారి భారత్ నుంచి అమన్ మాత్రమే ఒలింపిక్స్లో పోటీపడబోతున్నాడు. 20 ఏళ్లకే అంతర్జాతీయ స్థాయిలో లెక్కకు మిక్కిలి పతకాలు సాధించిన అతను పారిస్లో పోడియంపై నిలబడతాడనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మ్యాట్పై దూకుడుతో సాగే అతను ఎంతటి ప్రత్యర్థినైనా లెక్కచేయడు. 2022లో అండర్–23 ప్రపంచ ఛాంపియన్గా నిలిచి ప్రకంపనలు సృష్టించిన అతను నిలకడగా రాణిస్తున్నాడు.
సవాళ్లను దాటి
అసలు తిరిగి ఆటలో కొనసాగుతుందా? ఒలింపిక్స్కు అర్హత సాధిస్తుందా?.. ఇవీ కొన్ని రోజుల ముందు వరకూ వినేశ్ ఫొగాట్పై నెలకొన్న సందేహాలు. మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపుల ఆరోపణలతో భారత రెజ్లింగ్ సంఘం మాజీ అధ్యక్షుడు బ్రిజ్భూషణ్ శరణ్ సింగ్కు వ్యతిరేకంగా చేపట్టిన ఉద్యమంలో వినేశ్ది ప్రధాన పాత్ర. జంతర్మంతర్ దగ్గర ధర్నా మొదలు.. అవార్డులు వెనక్కి ఇచ్చేయడం వరకూ వినేశ్ ఎంతో మానసిక ఒత్తిడి ఎదుర్కొంది. ఆ తర్వాత మోకాలి శస్త్రచికిత్స చేయించుకుంది. దీంతో దాదాపు ఏడాది పాటు ఆటకు దూరంగా ఉంది. మరోవైపు 53 కేజీల విభాగంలో అంతిమ్ అర్హత సాధించడంతో వినేశ్ 50 కేజీలకు మారాల్సి వచ్చింది. కానీ 29 ఏళ్ల వినేశ్ సంకల్ప బలం ముందు ఈ సవాళ్లు చిన్నబోయాయి. తిరిగి మ్యాట్పై అడుగుపెట్టడమే కాదు మునుపటి స్థాయి ప్రదర్శనతో ఆమె సత్తాచాటుతోంది. మూడోసారి ఒలింపిక్స్కు అర్హత సాధించిన తొలి భారత మహిళా రెజ్లర్గా నిలిచింది. 2016 ఒలింపిక్స్లో కచ్చితంగా పతకం గెలిచేలా కనిపించిన ఆమెను క్వార్టర్స్లో మోకాలి గాయం రూపంలో దురదృష్టం వెంటాడింది. టోక్యో ఒలింపిక్స్లో అంచనాలను అందుకోలేకపోయింది. ఈ సారి మాత్రం ఒలింపిక్ పతకం కలను నెరవేర్చుకుంటాననే పట్టుదలతో సాగుతున్న వినేశ్.. తాజాగా స్పెయిన్ గ్రాండ్ ప్రి టోర్నీలో స్వర్ణంతో అంచనాలను పెంచేసింది.

## 23 ఏళ్ల తర్వాత.. కోపా అమెరికా ఫైనల్లో కొలంబియా

కొలంబియా ఫుట్బాల్ జట్టు సత్తాచాటింది. గురువారం నాటకీయ పరిణామాల మధ్య, ఉద్రిక్త వాతావరణంలో సాగిన కోపా అమెరికా సెమీస్లో ఆ జట్టు 1–0 తేడాతో ఉరుగ్వేపై విజయం సాధించింది. 23 ఏళ్ల తర్వాత ఈ టోర్నీ ఫైనల్లో అడుగుపెట్టిన ఆ జట్టు ఫైనల్లో అర్జెంటీనాను ఢీకొననుంది. జెఫర్సన్ లెర్మా (39వ నిమిషంలో) జట్టుకు గెలుపు గోల్ అందించాడు. 2001లో ఈ టోర్నీకి ఆతిథ్యమిచ్చినప్పుడు కొలంబియా విజేతగా నిలిచింది. పసుపు జెర్సీలతో నిండిపోయిన స్టేడియంలో కొలంబియా రెట్టించిన ఉత్సాహంతో ఆడింది. 61.9 శాతంతో బంతిపై నియంత్రణలో పైచేయి సాధించినప్పటికీ ఉరుగ్వే గోల్ కొట్టలేకపోయింది. కొలంబియా రక్షణశణి ప్రత్యర్థి ప్రయత్నాలను సమర్థంగా అడ్డుకుంది. రోడ్రిగ్స్ కార్నర్ కిక్ను జెఫర్సన్ తలతో గోల్పోస్టులోకి పంపడంతో స్టేడియం మార్మోగింది. అక్కడి నుంచి ఆధిక్యాన్ని కాపాడుకుంటూ కొలంబియా సాగింది. ఉరుగ్వే ఎంత ప్రయత్నించినా ప్రత్యర్థిని అందుకోలేకపోయింది. రెండు సార్లు ఎల్లో కార్డు అందుకోవడంతో డానియల్ బయటకు వెళ్లాల్సి వచ్చింది. పది మందితోనే ఆట కొనసాగించినప్పటికీ కొలంబియా గొప్ప పోరాట పటిమతో విజయతీరాలకు చేరింది.
రిఫరీ చివరి ఈల వేశాక కొలంబియా ఆటగాళ్లు, అభిమానుల్లో ఉద్వేగం ఉప్పొంగి కన్నీళ్లుగా మారింది. అదే సమయంలో ఉరుగ్వే ఆటగాళ్లు ఓటమి బాధను తట్టుకోలేక కొలంబియా ప్లేయర్లతో ఘర్షణకు దిగారు. స్టాండ్స్లోకి వెళ్లి మరీ కొలంబియా అభిమానులతో వాగ్వాదం పెట్టుకున్నారు.

# రామ్‌చరణ్ సినిమాలో కరుణాణ చక్రవర్తి శివరాజ్



ఆర్ఆర్ఆర్ గ్లోబల్ సక్సెస్ గ్లోబల్ స్టార్ రామ్ చరణ్‌కు ప్రపంచవ్యాప్తంగా ఫేమ్ తెచ్చింది. ఉప్పెనతో బ్లాక్ బస్టర్ డెబ్యు చేసిన సెన్సేషనల్ బుచ్చిబాబు సానాతో కలిసి తన 16వ సినిమా చేయను న్నారు రామ్‌చరణ్. పాన్ ఇండియా ప్రొడక్షన్ హౌస్ మైత్రి మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సగర్వ సమర్పణలో వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై మెగా-బడ్జెట్, హై-క్లాస్ ప్రొడక్షన్, టెక్నికల్ వాల్యూస్‌తో రూపొందే ఈ మోస్ట్ ఎవెయిటింగ్ ప్రాజెక్ట్ చరామ్‌చరణ్16తో వెంకట సతీష్ కిలారు గ్రాండ్‌గా ఫిల్మ్ ప్రొడక్షన్‌లోకి ఎంట్రీ ఇస్తున్నారు. ఈ క్రేజీ పాన్ ఇండియా ప్రాజెక్ట్‌లో వివిధ భాషలకు చెందిన పలువురు ప్రముఖ నటీనటులు కనిపించనున్నారు. తాజాగా టీమ్ రామ్‌చరణ్16 తెలుగు సినిమాకి కరుణాడ చక్రవర్తి శివ రాజ్‌కుమార్ ఎరైవల్‌ని సెలబ్రేట్ చేసు కుంటుంది. కన్నడ సూపర్ స్టార్ ఈ చిత్రంలో వెరీ పవర్ ఫుల్ రోల్ పోషించడానికి సైన్ చేశారు. ఈ న్యూస్‌ని శివ రాజ్‌కుమార్ పుట్టినరోజు ప్రత్యేక సందర్భంగా అనౌన్స్ చేసప్రు. ఈ న్యూస్‌తో ఇద్దరు స్టార్స్ అభిమానులు ఆనందంగా వున్నారు. ఇద్దరు సూపర్‌స్టార్‌లను కలిసి తెరపై చూసేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. రామ్ చరణ్ సరసన జాన్వీ కపూర్ హీరోయిన్‌గా కనిపించనున్న ఈ మ్యాసీవ్ మూవీకి అకాడమీ-అవార్డ్-విన్నింగ్ కంపోజర్ ఎ.ఆర్. రెహమాన్ సంగీతం అందిస్తున్నారు. ఆర్ రత్నవేలు డీవోపీ కాగా, అవినాష్ కొల్లా ప్రొడక్షన్ డిజైనర్.

## జూలై 15 నుంచి 'సర్దార్ 2' రెగ్యులర్ షూటింగ్



హీరో కార్తీ 'సర్దార్' సినిమా తమిళం, తెలుగు భాషల్లో బంపర్ హిట్ అయ్యింది. సర్దార్ థియేటర్స్‌లో విడుదలైన కొద్ది రోజుల తర్వాత మేకర్స్ సినిమా పార్ట్ 2ని అఫీషియల్ గా అనౌన్స్ చేశారు. సర్దార్ 2కి సంబంధించిన పూజా కార్యక్రమాలు ఇటీవల జరిగాయి, ఈ సినిమా షూటింగ్ 2024 జూలై 15న చెన్నైలో భారీ సెట్స్‌లో ప్రారంభం కానుంది. ప్రీక్వెల్‌కి దర్శకత్వం వహించిన పిఎస్ మిత్రన్ సర్దార్ 2కి దర్శకత్వం వహించనున్నారు. ప్రిన్స్ పిక్చర్స్ నిర్మించనుంది. సర్దార్ ఎండింగ్ లో నెక్స్ట్ మిషన్ కంబోడియాలో జరగబోతోందని రివిల్ అయ్యింది. సర్దార్ 2 భారీ బడ్జెట్‌తో హ్యూజ్ స్కేల్ లోతెరకెక్కనుంది. టాప్ టెక్నిషియన్స్ ఈ సినిమాకి పని చేస్తున్నారు. సర్దార్ 2 చిత్రానికి యువన్ శంకర్ రాజా సంగీతం అందించనున్నారు. జార్జ్ సి విలియమ్స్ ఫోటోగ్రఫీ డైరెక్టర్, దిలీప్ సుబ్బరాయన్ స్టంట్ డైరెక్టర్. రాజీవ్ నంబియార్ ప్రొడక్షన్ డిజైనర్. విజయ్ వేలుకుట్టి ఎడిటర్. %ూూ% పాల్ పాండి ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్. ఎ వెంకటేష్ సహ నిర్మాతగా, ఎస్. లక్ష్మణ్ కుమార్ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు.

## "కపుల్ ఫ్రెండ్లీ" నుంచి బర్త్ డే గ్లింప్స్, టైటిల్ లుక్

ప్రముఖ నిర్మాణ సంస్థ యూవీ క్రియేషన్స్ సమర్పణలో సంతోష్ శోభన్ హీరోగా యూవీ కాన్సెప్ట్స్ సంస్థ నిర్మిస్తున్న మూవీ "కపుల్ ఫ్రెండ్లీ". ఈ రోజు హీరో సంతోష్ శోభన్ పుట్టినరోజు సందర్భంగా ఆయనకు బర్త్ డే విశెస్ తెలియజేస్తూ స్పెషల్ గ్లింప్స్ తో పాటు ఈ సినిమా టైటిల్ లుక్ ను మేకర్స్ రిలీజ్ చేశారు. "కపుల్ ఫ్రెండ్లీ" చిత్రంలో మిస్ ఇండియా మానస వారణాసి హీరోయిన్‌గా నటిస్తోంది. లవ్ అండ్ యూత్ ఫుల్ ఎంటర్ టైనర్‌గా దర్శకుడు అశ్విన్ చంద్రశేఖర్ ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. అజయ్ కుమార్.పి. కో ప్రొడ్యూసర్ గా వ్యవహరిస్తున్న ఈ సినిమా ప్రస్తుతం రెగ్యులర్ చిత్రీకరణలో ఉంది. వచ్చే ఏడాది ఫిబ్రవరి 14వ తేదీన వాలెంటైన్స్ డే సందర్భంగా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ చేయబోతున్నారు. "కపుల్ ఫ్రెండ్లీ" టైటిల్ లుక్ లో చెన్నై సెంట్రల్ స్టేషన్ దగ్గరలోని ఓ రెసిడెన్షియల్ ఏరియాను చూపించారు. చెన్నై బ్యాక్ డ్రాప్‌లో సాగే ఇంట్రెస్టింగ్ మూవీగా "కపుల్ ఫ్రెండ్లీ" ఉండబోతోంది.



## టీజీ విశ్వ ప్రసాద్‌కు ఘన స్వాగతం

విభిన్న తరహా చిత్రాలను రూపొందించి పరిశ్రమలో తనదైన ముద్ర వేసుకున్న విజనరీ నిర్మాత టిజి విశ్వ ప్రసాద్‌కు పవర్ స్టార్ పవన్ కళ్యాణ్, జనసేన పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రితో ఉన్న అనుబంధం అందరికీ తెలిసిందే. సినిమాల పరంగానే కాకుండా,



వ్యక్తిగతంగానూ పవన్ కళ్యాణ్‌తో టిజి విశ్వ ప్రసాద్‌కు మంచి సాన్నిహిత్య బంధం ఉంది. ఎన్నికలకు ముందు పవన్ కళ్యాణ్‌కు మద్దతునిచ్చిన పరిశ్రమలోని మొదటి వ్యక్తులలో ఆయన ఒకరు. ఎన్‌డిఎ కూటమి విజయాన్ని సంబరాలు చేసుకున్న మొదటి వ్యక్తి కూడా ఆయనే. 2018లో జనసేన పార్టీ మేనిఫెస్టో విడుదల చేసిన దగ్గరనుంచి, జనసేన ప్రవాస గర్జన సందర్భంగా పవన్ కళ్యాణ్‌తో పాటు టీజీ విశ్వ ప్రసాద్ 2024 ఎన్నికల్లో పార్టీ విజయంలో కీలకపాత్ర పోషించారు. కాగా, ఎన్నికల ఫలితాల తర్వాత తొలిసారిగా అమెరికాలోని సియాటిల్‌కు వచ్చిన టీజీ విశ్వప్రసాద్‌కు విమానాశ్రయంలో జనసేన మద్దతుదారులు ఘన స్వాగతం పలికారు. సియాటిల్‌లోని శ్రీదేవి ఫంక్షన్ హాల్‌లో ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా విశ్వ ప్రసాద్ మాట్లాడుతూ..'పటిష్టమైన సమన్వయం వల్లే కుటమి ఎన్నికల్లో విజయం సాధించింది. తెలుగుదేశం, జనసేన మద్దతుదారులు ఒకే స్ఫూర్తితో, ఆత్మీయతతో కలిసి పనిచేయాలి' అని అన్నారు.



## 'కమిటీ కుర్రోళ్ళు' నుంచి లిరికల్ సాంగ్



నిహారిక కొణిదెల సమర్పణలో పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ ఎల్.ఎల్.పి, శ్రీరాధా దామోదర్ స్టూడియోస్ బ్యానర్స్‌పై రూపొందిన 'కమిటీ కుర్రోళ్ళు' సినిమాకు యదు వంశీ దర్శకుడు. పక్కా ప్లానింగ్‌తో మేకర్స్ అనుకున్న సమయానికి కన్నా ముందే సినిమా షూటింగ్‌ను పూర్తి చేయటం ఇక్కడ విశేషం. ఇప్పటికే రిలీజ్ చేసిన టీజర్, సాంగ్స్‌కు మంచి రెస్పాన్స్ వచ్చింది. తాజాగా ఈ చిత్రం నుంచి జాతర పాటను రిలీజ్ చేశారు. సందడి సందడి అంటూ సాగే ఈ పాటను సింహాచలం మన్నెల రచించగా.. అనుదీప్ దేవ్, రేణూ కుమార్, శ్రీనివాస్ దరిమిశెట్టి ఆలపించారు. అనుదీప్ దేవ్ మంచి ఊపునిచ్చే బాణీని అందించారు. ఈ లిరికల్ వీడియోలోని విజువల్స్, జాతర సన్నివేశాలు, కుర్రాళ్ల ధూంధాం స్టెప్పులు బాగున్నాయి. రాజు ఎదురోలు ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. అన్వర్ అలీ ఎడిటర్‌గా పని చేశారు. ఈ చిత్రానికి వెంకట సుభాష్ చీర్ల, కొండల రావు అడ్డగళ్ల సంభాషణలు రాశారు. ఆగస్టులో ఈ చిత్రాన్ని విడుదల చేసేందుకు మేకర్లు ప్లాన్ చేస్తున్నారు.

## ఆగస్టు 1న 'శివం భజే'



ఇటీవల విడుదలైన ఫస్ట్ లుక్, టీజర్ తో అందరి దృష్టిని ఆకర్షించిన గంగా ఎంటర్టైన్మెంట్స్ 'శివం భజే' చిత్రం ఆగస్టు 1న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ రిలీజ్ అవ్వనున్నట్టు నిర్మాత మహేశ్వర్ రెడ్డి మూలి తెలిపారు. అప్సర్ దర్శకత్వంలో తెరకక్కనున్న ఈ న్యూ ఏజ్ డివైన్ సస్పెన్స్ థ్రిల్లర్ చిత్రంలో హీరో - హీరోయిన్లుగా అశ్విన్ బాబు, దిగంగనా సూర్యవంశీ నటించారు. బాలివుడ్ నటుడు అర్బాజ్ ఖాన్, మురళీ శర్మ, తనికెళ్ళ భరణి, సాయి ధీన, అయ్యప్ప శర్మ, హైపర్ ఆది, బ్రహ్మాజీ, తులసి, దేవి ప్రసాద్ వంటి నటులు ముఖ్యమైన పాత్రలు పోషించారు. ఈ సందర్భంగా చిత్ర నిర్మాత మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, "వైవిధ్యమైన కథతో, సాంకేతిక విలువలతో మా సంస్థ గంగా ఎంటర్టైన్మెంట్స్ నిర్మాణంలో ఆగస్టు 1న విడుదలవ్వనున్న చిత్రం 'శివం భజే'. ఫస్ట్ లుక్‌కి, టీజర్‌కి అద్భుతమైన స్పందన రావడంతో చిత్ర విజయంపై మాకున్న విశ్వాసం మరింత పెరిగింది. మా హీరో అశ్విన్ బాబు, దర్శకుడు అప్సర్, అర్బాజ్ ఖాన్, సాయి ధీనా, హైపర్ ఆది, మురళీ శర్మ, బ్రహ్మాజీ, తులసి వంటి నటులు, ఇండస్ట్రీ మేటి సాంకేతిక నిపుణుల సహకారంతో మా మొదటి చిత్రం అనుకున్నట్టుగా రూపుదిద్దుకుంది. ప్రస్తుతం నిర్మాణాంతర కర్యక్రమాలు చివరి దశలో ఉండగా ఆగష్టు 1న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేయడానికి సిద్ధమవుతున్నాం. శివస్మరణతో మొదలైన మా చిత్రానికి ఆయన ఆశీస్సులతో అద్భుత స్పందన లభించడం చాలా ఆనందంగా ఉంది. అన్ని వర్గాల ప్రేక్షకులకు కచ్చితంగా నచ్చుతుంది. ట్రైలర్ మరియు పాటల విడుదల గురించి వివరాలు త్వరలో వెల్లడిస్తాం" అని అన్నారు. దర్శకుడు అప్సర్ మాట్లాడుతూ, "ఆగష్టు 1న ప్రపంచవ్యాప్తంగా విడుదలవుతూ అన్ని వర్గాల, వయసుల ప్రేక్షకులని అలరించడానికి సిద్ధంగా ఉంది మా 'శివం భజే'. టైటిల్, టీజర్ తో అందరి దృష్టి ఆకర్షించిన మా చిత్రంపై అన్ని భాషల ప్రేక్షకులలో మంచి అంచనాలున్నాయి. మా హీరో అశ్విన్ బాబు, ఇతర నటీ నటులు, సాంకేతిక నిపుణులు, నిర్మాత మహేశ్వర రెడ్డి గారి పూర్తి సహకారంతో ఈ చిత్రం అద్భుతంగా రూపొందింది. మా పాటలు, ట్రైలర్ త్వరలో విడుదల చేస్తాం" అన్నారు.


## ఆగస్టు 2న 'విరాజి'



మహా మూవీస్ మరియు ఎమ్ 3 మీడియా బ్యానర్ పై వరుణ్ సందేశ్ ప్రధాన పాత్రలో ఆద్యంత్ హర్ష దర్శకత్వంలో మహేంద్ర నాథ్ కూండ్ల నిర్మించిన చిత్రం "విరాజి". ఈ చిత్రం ఇటీవలే సెన్సార్ కార్యక్రమాలు పూర్తి చేసుకుంది. సెన్సార్ సభ్యులు చిత్రాన్ని వీక్షించి యు/ఎ సర్టిఫికెట్ ఇచ్చారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకుని ప్రపంచవ్యాప్తముగా ఆగస్టు 2న విడుదలకు సిద్ధంగా ఉంది. నిర్మాత మహేంద్ర నాథ్ కూండ్ల మాట్లాడుతూ "మా విరాజి చిత్రానికి సెన్సార్ సభ్యులు యు/ఎ సర్టిఫికెట్ ఇచ్చారు. చిత్రాన్ని వీక్షించిన సెన్సార్ సభ్యులు చిత్రం చాలా బాగుంది అని కొనియాడారు. ఇటీవలే విడుదల అయిన టీజర్ కి అద్భుతమైన స్పందన లభించింది. ఈ చిత్రం వరుణ్ సందేశ్ కెరీర్‌లో పెద్ద విజయం సాధిస్తుంది. ఇది ఒక సస్పెన్స్ థ్రిల్లర్. వరుణ్ సందేశ్ చాలా కొత్తగా ఉంటాడు. ఆగస్టు 2న ప్రపంచ వ్యాప్తంగా విడుదల చేస్తున్నాం" అని తెలిపారు.

## అమృత ప్రొడక్షన్స్‌లో సంతోష్‌శోభన్

సక్సెస్ ఫుల్ ప్రొడ్యూసర్ ఎస్ కేఎన్, "కలర్ ఫొటో"తో నిర్మాతగా తన అభిరుచి చాటుకున్న దర్శకుడు సాయి రాజేశ్ సంయుక్త నిర్మాణంలో అమృత ప్రొడక్షన్స్, మాస్ మూవీ మేకర్స్ బ్యానర్స్ పై సంతోష్ శోభన్, సోషల్ మీడియా ఫేమ్ అలేఖ్య హారిక హీరో హీరోయిన్లుగా ప్రొడక్షన్ నెం.4 సినిమా తెరకెక్కుతోంది. హీరో సంతోష్ శోభన్ పుట్టినరోజు సందర్భంగా ఆయనకు పుట్టినరోజు శుభాకాంక్షలు చెబుతూ ఈ సినిమా నుంచి కొత్త పోస్టర్ రిలీజ్ చేశారు. ఈ పోస్టర్ పై కొన్ని 'ప్రేమ కథలు జీవితకాలం వెంటాడుతాయి..' అనే హార్ట్ టచింగ్ క్యాప్షన్ ఆకట్టుకుంటోంది. సంతోష్ శోభన్ లుక్ ఇంటెన్స్ గా ఉంది. ఈ చిత్రానికి సుమన్ పాతూరి దర్శకత్వం వహిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా మ్యూజిక్ సిట్టింగ్స్ జరుగుతున్నాయి. ఆగస్టు నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించేందుకు మూవీ టీమ్ సిద్ధమవుతోంది.




## 50 వసంతాల" స్వర్ణోత్సవ సంబరాలు

### భారీగా ఏర్పాట్లు చేయనున్న నందమూరి అభిమానులు


1974 తాతమ్మ కల చిత్రంతో ఎన్.టి.ఆర్. నట వారసుడిగా వెండితెరకి పరిచయమై తన అద్భుత నటనతో అంచెలంచెలుగా ఎదిగి... " తండ్రికి తగ్గ తనయుడు" గా అందరి ప్రశంసలు పొంది , విశ్వవ్యాప్తంగా కోట్లాది అభిమానులను సంపాదించుకున్న లెజెండ్ బాలయ్య గారి సినీ ప్రస్థానం 50 వసంతాలు పూర్తి చేసుకోవడం. అరుదైన గౌరవం, భారతదేశ సినీ చరిత్రలో నట వారసుడిగా 50 యేండ్లు పూర్తి చేసుకున్న ఏకైక అగ్ర కథానాయకుడుగా కొత్త చరిత్ర కు శ్రీకారం చుట్టారు.
తన తండ్రి ఎన్.టి.ఆర్ గారి తర్వాత నేటితరంలో పౌరాణిక, సాంఘిక, జానపద, చారిత్రాత్మక చిత్రాలు చేసి.. అన్ని జనరేషన్స్ ప్రేక్షకులను మెప్పించిన ఒకేఒక్కడు బాలయ్య కావడం మన తెలుగువారందరికి గర్వకారణం. ఈ ప్రతిష్టాత్మక 50 వసంతాల బాలయ్య సినీ స్వర్ణోత్సవ సంబరాలను ఎన్‌బికె హెల్పింగ్ హ్యాండ్స్ అధ్యక్షులు అనంతపురం జగన్ బాలయ్య అభిమానులను ఒక టీమ్‌గా ఏర్పాటుచేసి అత్యంత వైభవంగా 50 రోజుల పాటు పెద్దఎత్తున నిర్వహించాలని సన్నా హాలు చేస్తున్నారు, అలాగే తెలుగు చలనచిత్ర పరిశ్రమ కూడా హైదరాబాద్ లో ఘనంగా వేడుకలు చేయడానికి సిద్ధం చేస్తున్నారు.

## 'డార్లింగ్' నుంచి సున్ చలియా సాంగ్

రొమాంటిక్, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ జానర్‌లలోకి వచ్చే సినిమాలు ఆడియన్స్ ఎక్స్‌పీరియన్స్‌ను బూస్ట్ చేయడానికి చార్ట్‌బస్టర్ ఆల్బమ్‌లు అవసరం. ఈ జానర్ చిత్రాలు ఇంపాక్ట్ క్రియేట్ చేయడంలో మ్యూజిక్ కీలక పాత్ర పోషిస్తుంది.' డార్లింగ్' సినిమా విడుదలకు ముందే మ్యూజికల్ హిట్‌గా మారింది. ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్ కె నిరంజన్ రెడ్డి, శ్రీమతి చైతన్య నిర్మించిన ఈ చిత్రానికి అశ్విన్ రామ్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాలోని మొదటి రెండు పాటలు సూపర్ డూపర్ హిట్ అయ్యాయి. ఈ రోజు, మేకర్స్ థర్డ్ సింగిల్ సున్ చలియాను రిలీజ్ చేశారు.మొదటి రెండు పాటలు ప్రియదర్శి, నభా నటేష్‌ల సోలో నంబర్‌లు కాగా, మూడవ పాట ఇద్దరూ కలసి అలరించిన డ్యూయెట్. వివేక్ సాగర్ ఈ పాటని ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న లవ్ సాంగ్ ఆఫ్ ది ఇయర్ గా చాలా బ్యూటీఫుల్ గా కంపోజ్ చేశారు. అద్భుతమైన ఆర్కెస్ట్రేషన్‌తో ఈ పాట మెస్మరైజ్ చేస్తోంది. వివేక్ మ్యూజిక్ సాంగ్ మూడ్‌కి పర్ఫెక్ట్. కాసర్ల శ్యామ్ లిరిక్స్ లవ్లీగా వుండగా, అనురాగ్ కులకర్ణి వోకల్స్ ఎక్స్‌ప్రెసివ్ గా వున్నాయి. ఈ పాట లీడ్ పెయిర్ ప్రియదర్శి, నభా నటేష్ ల లవ్లీ జర్నీని అద్భుతంగా ప్రజెంట్ చేస్తోంది. ఈ పాటలో వీరిద్దరూ స్పార్క్లింగ్ కెమిస్ట్రీని షేర్ చేసుకున్నారు.



## ది గోట్ నుంచి డ్యాన్స్ అంథమ్



దళపతి విజయ్, వెంకట్ ప్రభుల మోస్ట్ ఎవైటెడ్ పాన్ ఇండియా మూవీ ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్ ఫస్ట్ సింగిల్ రిలీజ్ అయ్యింది. యువన్ శంకర్ రాజా కంపోజ్ చేసిన ఈ పాటకు యువన్ శంకర్ రాజా, నకాష్ అజీజ్ వారి ఎనర్జిటిక్ వోకల్స్ తో ఎక్స్ట్రా ఎనర్జీని యాడ్ చేశారు. రామజోగయ్య శాస్త్రి రాసిన లిరిక్స్ ఆకట్టుకున్నాయి. ఈ సాంగ్ పవర్ ఫుల్ ఎనర్జీతో డ్యాన్స్ అంథమ్. ట్రాక్ స్పార్క్లింగ్ ఎట్మాస్పియర్ ని క్రియేట్ చేసి లిజనర్స్ కి ఫుట్ ట్యాపింగ్ నెంబర్ గా అలరించింది. ఛాంపియన్షిప్ ని సెలబ్రేట్ చేసుకునే సాంగ్ ఇది, సినిమా సెంట్రల్ థీమ్ ని రిజనేట్ చేస్తోంది. లిరికల్ వీడియోలో ప్రభుదేవా, ప్రశాంత్, అజ్మల్ అమీర్‌లతో కలిసి విజయ్ డ్యాన్స్ అదరగొట్టారు. రాజు సుందరం మాస్టర్ కొరియోగ్రఫీ చేశారు. కంప్లీట్ విజువల్స్‌తో పాటను చూసినప్పుడు మరింత ఇంపాక్ట్ గా ఉండబోతోంది. విజయ్ ద్విపాత్రాభినయం చేస్తున్న ఈ చిత్రంలో ప్రశాంత్, ప్రభుదేవా, మోహన్, జయరామ్, స్నేహ, లైలా, అజ్మల్ అమీర్, మీనాక్షి చౌదరి, వైభవ్, యోగి బాబు, ప్రేమి అమరెన్, యుగేంద్రన్ వాసుదేవన్, అఖిలన్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఏజిఎస్ ఎంటర్‌టైన్‌మెంట్ ప్రై లిమిటెడ్‌పై కల్పాతి ఎస్ అఘోరమ్, కల్పాతి ఎస్ గణేష్, కల్పాతి ఎస్ సురేష్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి సిద్ధార్థ నుని సినిమాటోగ్రఫీ అందించారు.

## కిల్లర్ వైరస్



ప్రతిష్టాత్మకమైన కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ 2024లో తన అంతర్జాతీయ చలనచిత్ర పోస్టర్‌ను ఆవిష్కరించిన అతి పిన్న వయస్కురాలిగా నటి అవ్‌నీత్ కౌర్ ఒక గొప్ప మైలురాయిని సాధించింది. కేన్స్‌లో అద్భుత అరంగేట్రం కెరీర్‌లో ఒక ముఖ్యమైన ఘట్టం. అంతర్జాతీయ చిత్రం లవ్ ఇన్ వియత్నాం తన ఫేట్ ని మారుస్తుందని అవ్ నీత్ నమ్ముతోంది. గ్లామ్ అండ్ గ్లిజ్ ప్రపంచంలో ఎదుగుతున్న ధృవతారగా ఇది తొలి పెద్ద అడుగు. ప్రస్తుతం సోషల్ మీడియాల్లోను అవ్ నీత్ హైస్పీడ్ తో దూసుకుపోతోంది. తాజాగా అవ్ నీత్ బీచ్ వెకేషన్ కి సంబంధించిన ఫోటోషూట్ ఇంటర్నెట్ ని షేక్ చేస్తోంది. బ్లూ బికినీ ధరించి కాంబినేషన్ గా వైట్ హ్యాట్ ని షేడ్స్ ని ధరించిన అవ్ నీత్ లుక్ కి అభిమానుల నుంచి అద్భుత స్పందన వస్తోంది. అవ్ నీత్ కిల్లింగ్ అంటూ అభిమానులు ప్రశంసిస్తున్నారు.

PRINTED & PUBLISHED BY NUKARAPU PADMAJA ON BEHALF OF SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081. PRINTED AT SPR PRINTING PRESS, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081, TELANGANA, PUBLISHED AT SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR,NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081. EDITOR : NUKARAPU PADMAJA. Fax No:040-30473232 RNI Registration No. APTEL/2007/22044.